
అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

శనివారం 02-12-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 281 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 8 పేజీలు + టాబ్లాయిడ్ 8 పేజీలు వెల : 6.50



దేశ ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. దేశాన్ని రక్షించడానికి మెరుగైన ప్రభుత్వం కేంద్రంలో అవసరం. ఐదు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఇండియా బ్లాక్ నేతలంతా కలిసి కూర్చుని తమ భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తాం."ఇవి చాలా గట్టి పోటీ ఉన్న ఎన్నికలు కాబట్టి, ప్రధానమంత్రి, హెూంమంత్రి, మొత్తం క్యాబినెట్ తీవ్రమైన ప్రచారం చేసినా బీజేపీకి,ప్రత్యేకించి ప్రధాని మోడీకి ఈ ఫలితాలు అంత తేలికైనవి కావు".

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

బీజేపీ అసమర్థ పాలనకు తార్కాణం

## ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

- వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ భారీ మూల్యం చెల్లించక తప్పదు
- కేంద్రంలోనూ మార్పు తప్పనిసరి
- దేశరక్షణకు మెరుగైన సర్కార్ కావాలి
- అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరువాతే ఇండియా బ్లాక్ భవిష్యత్ కార్యాచరణ : సీతారాం ఏచూరి

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

దేశ ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తన అసమర్థ పాలనకు ఫలితాన్ని చవిచూస్తుందని ఏచూరి అన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో కూడా బీజేపీ భారీ మూల్యాన్ని చెల్లించక తప్పదని సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి వ్యాఖ్యానించారు. కేంద్రంలో ప్రభుత్వ మార్పు తప్పక జరగాల్సిన అవసరం ఉందని అన్నారు.దేశాన్ని రక్షించడానికి మెరుగైన ప్రభుత్వం కేంద్రంలో అవసరమనిఏచూరి పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఇండియా బ్లాక్ నేతలంతా కలిసి కూర్చుని తమ భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. శుక్రవారం కోయంబత్తూరులో సీపీఐ(ఎం) శాఖ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీతారాం ఏచూరి మాట్లాడారు. "ఇవి చాలా గట్టి పోటీ ఉన్న ...5లో

## ఎన్నికలు కాగానే బాదుడు..

### కమర్షియల్ ఎల్పీజీ ధర రూ.21 పెంపు



వివరాలు 7లో..

- హైదరాబాద్‌లో 19 కేజీల గ్యాస్ ధర రూ. 2024.50
- విమానాలకు వాడే ఇంధనం(ఏటీఎఫ్) ధర 4.6 శాతం తగ్గింపు

## 3 శాతం తగ్గిన పోలింగ్



### 3న కౌంటింగ్ ఏర్పాట్లు ముమ్మరం

- తొలుత పోస్టల్ బ్యాలెట్లు
- ఆ తర్వాతే ఈవీఎమ్‌లు వివరాలు 7లో..
- ఉదయం 10 గంటలకల్లా తొలి ఫలితం
- మొత్తం పోలింగ్ 71.34 శాతం
- ఎన్నికల సంఘం సీఈఓ వికాస్‌రాజ్ వెల్లడి



## నువ్వా..నేనా..!



### కాకపుట్టిస్తున్న పొలిట్రిక్స్

- బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మైండ్ గేమ్..
- ఫలితాలు రాకముందే ప్రభుత్వ ఏర్పాటుకు పోటాపోటీ..
- నాలుగున క్యాబినెట్ అంటూ కేసీఆర్ ప్రకటన
- తొమ్మిదిన ప్రమాణ స్వీకారం, అదే రోజు ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధతంటున్న రేవంత్
- మానసికంగా పై చేయి సాధించేందుకు రెండు పార్టీల వ్యూహం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సాధారణ రోజుల మాదిరిగానే (ఎన్నికల కంటే ముందు) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఈనెల నాలుగున మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామంటూ కేసీఆర్ ప్రకటించారు. సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటలకు క్యాబినెట్ సమావేశమవుతుందంటూ ఆయన టైమ్‌తో సహా చెప్పేశారు. మరోవైపు రేవంత్ రెడ్డి సైతం తమ పార్టీ కచ్చితంగా గెలిచి తీరుతుందనీ, 9న ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం ఉంటుందని, అదే రోజు క్యాబినెట్ సమావేశం జరిపి, ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామంటూ ప్రకటించటం విశేషం.

పోలింగ్ ముగిసి, ఆదివారం ఫలితాలు వెలువడనుండగా గురువారం సాయంత్రం నుంచే అధికార, ప్రతిపక్ష పార్టీలు మైండ్ గేమ్ ఆడటం మొదలు పెట్టాయి. ఎగ్జిట్‌పోల్స్‌లో ఎక్కువ శాతం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపటంతో బీఆర్ఎస్ క్యాడర్‌లో కాస్త నిరాశ నెలకొంది. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న సమాచారం, ప్రతికూల పవనాల నేపథ్యంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ద్వితీయ శ్రేణి నేతలు డీలాపడిన పరిస్థితి కనిపించింది. దీన్ని గమనించిన ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారిలో జోష్ నింపేందుకు ప్రయత్నించారు. 'ఎగ్జిట్‌పోల్స్‌ను చూసి కంగారు పడొద్దు...మనమే గెలుస్తున్నాం...' అంటూ ధైర్యాన్ని నూరిపోసేందుకు ప్రయత్నించారు. ఇక కాంగ్రెస్ గెలుస్తోందన్న అంచనాతో ఉన్న రేవంత్... ఏకంగా 'సంబురాలు చేసుకోవచ్చు...' అంటూ ఆ పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఇలా ఈ రెండు పార్టీల మైండ్ గేమ్ సాగుతుండగా... ఓటర్లు మాత్రం గుంభనంగా ఉన్నారు. సర్వేలు, ఎగ్జిట్‌పోల్స్, రిపోర్టులతో సంబంధం లేకుండా తమ పని తాము పూర్తి చేశారు. వారితోపాటు నేతలు సైతం ఫలితాల కోసం ఆతృతగా ఎదురు ...5లో

'ఆలూ లేదు.. చూలూ లేదు...' అన్నట్టుగా ఉంది ఇప్పుడు అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ తీరు. పరస్పరం మైండ్ గేమ్ ఆడటం ద్వారా ఒకరిపై మరొకరు పై చేయి సాధించేందుకు రెండు పార్టీలూ తెగ తాపత్రయ పడుతున్నాయి. అసెంబ్లీకి ఎన్నికలు ముగిసి 24 గంటలైనా గడవకముందే, ఫలితాలు వెలువడటానికి ఇంకా రోజున్నర సమయముండగానే ప్రమాణ స్వీకారంపై గులాబీ, హస్తం పార్టీలూ వెలువరించిన ప్రకటనలు... ఆసక్తికరంగానే కాదు, అంతకు మించి అతిశయోక్తిగానూ అనిపిస్తున్నాయి. సీఎం కేసీఆర్, పీసీసీ చీఫ్ రేవంత్‌లు పోటాపోటీగా ఇస్తున్న స్టేట్‌మెంట్లు చర్చనీయాంశమవుతున్నాయి.



## సహకరించండి



- వర్ధమాన దేశాలకు నిధులు అందాలి..సాంకేతికత బదిలీ కావాలి : సంపన్న దేశాలకు మోడీ పిలుపు

**దుబాయ్ :** వర్ధమాన దేశాలకు సాంకేతిక బదిలీ జరగాలని, వాతావరణ విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన నిధులను అందించేలా చూడాలని ప్రధాని నరేంద్ర మోడీ సంపన్న దేశాలకు పిలుపిచ్చారు. వాతావరణ సమస్యలను సృష్టించడంలో వర్ధమాన దేశాల పాత్ర వుండడం లేదని, అయినా కూడా వారు సమస్య పరిష్కారంలో భాగస్వాములవడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నారన్న విషయాన్ని గుర్తించాల్సి వుందన్నారు. సమానత్వం, వాతావరణ న్యాయం, పరస్పరం పంచుకునే బాధ్యతలు, సామర్థ్యాల ప్రాతిపదికన వాతావరణ కార్యాచరణ వుండాలని తాను విశ్వసిస్తానని చెప్పారు. ఈ సూత్రాలకు కట్టుబడి వుండడం ద్వారా సుస్థిరమైన భవిష్యత్ దిశగా ఒక బాటను ఏర్పాటు చేయగలమని, ఆ క్రమంలో ఎవరూ వెనుకబడి పోరని అన్నారు. ఈ క్రమంలో పేద, వర్ధమాన దేశాల అభివృద్ధి ప్రాధాన్యతలపై రాజీ ...7లో

## జాతీయ వైద్య కమిషన్ లోగో మారింది

### భారత జాతీయ చిహ్నం స్థానంలో హిందూ దేవత చిత్రం

- భారత్ పదం చేరిక
- మార్పులపై విమర్శలు

**న్యూఢిల్లీ :** జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) లోగోలో మార్పులు వివాదానికి దారి తీశాయి. భారతదేశ జాతీయ చిహ్నాన్ని హిందూ దేవత ధన్వంతరి రంగుల చిత్రంతో భర్తీ చేయడం ఇందుకు కారణమైంది. అలాగే, అధికారిక లోగోలో "భారత్" అనే పదం వచ్చి చేరింది. అయితే, ఈ మార్పులపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెడిసిన్ ప్రాక్టీషనర్లు, సీపీఐ(ఎం) నాయకుడు థామస్ ఐజాక్ జాతీయ వైద్య కమిషన్ లోగోలో మార్పులను తప్పుబట్టారు. ఈ రంగంలో కుల, మతపరమైన ఆలోచనలను ప్రవేశపెట్టే చర్య ఏమాత్రమూ ఆమోదయోగ్యం కాదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) కేరళ యూనిట్ ఒక ప్రకటనలో పేర్కొన్నది. "కొత్త లోగో తప్పుడు సందేశాన్ని ఇస్తుంది. ఇది కమిషన్ శాస్త్రీయ, లౌకిక స్వభావానికి హాని కలిగిస్తుంది" అని అసోసియేషన్ పేర్కొన్నది. తాము ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామనీ, తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అయితే, లోగోను మార్చలేదని నేషనల్ మెడికల్ కమిషన్ ఎథిక్స్ అండ్ మెడికల్ రిజిస్ట్రేషన్ బోర్డు సభ్యుడు యోగేంద్ర మాలిక్ ...7లో



## దాడులు..సోదాలు..సీజ్‌లు

### ఎన్నికల వేళ ప్రతిపక్ష నేతలపై ప్రతీకార చర్యలు

- రాజకీయ పార్టీలపై రెచ్చిపోయిన మోడీ సర్కారు
- కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పిన వైనం

**న్యూఢిల్లీ :** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష నేతలపై కేంద్రం విరుచుకుపడింది. కేంద్ర దర్యాప్తు సంస్థలతో రాజకీయ పార్టీల నేతలపై దాడులకు దిగింది. తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్.. ఇలా ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ప్రతి రాష్ట్రంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాయి. తమకు వ్యతిరేకంగా ఉండే ప్రతిపక్ష నాయకుల ఇండ్లు, కార్యాలయాల్లో దాడులు, సీజ్‌లు, సోదాలు వంటివి జరిపాయి. అయితే, ఉద్దేశపూర్వకంగానే ఈ దాడులు చేయించిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

**రాజస్థాన్‌లో..**

అక్టోబర్ చివరి వారంలో ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో ఈడీ దాడులు కలకలం రేపాయి. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోతస్రాపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఈ దాడులు జరిపింది. జైపూర్, సికార్‌లలో ఆయన ఇండ్లు, కార్యాలయాలలో సోదాలు జరిపింది. కానీ, ఈడీ మాత్రం అధికారికంగా ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. ఉపాధ్యాయుల ప్రవేశ పరీక్ష లీక్ కేసులో దోతస్రా ఇండ్లలో సోదాలు నిర్వహించినట్టు తెలిసింది. అతనితో పాటు దౌసాలోని మహువా ...7లో


**తెలంగాణలో...**

బీఆర్ఎస్ పాలిత తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ముందు ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కె. కవితకు ఈడీ తాజా సమన్లు పంపింది. ఆప్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఎక్సైజ్ పాలసీలో 849 మద్యం దుకాణాలను ప్రయివేటు సంస్థలకు కేటాయించి, పాలసీ అమలులో అవకతవకలు జరిగాయని పేర్కొంటూ ఢిల్లీ ఎల్జీ వినయ్ కుమార్ సక్సేనా సీబీఐ విచారణకు సిఫారసు చేయటంతో అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం దానిని రద్దు చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఆప్ నేతలు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్‌లను అరెస్ట్ చేశారు. ఇప్పటికే అరెస్టయిన ఆప్ ...7లో

## బిల్లుల ప్రతిష్టంభనకు తెరదించాలి

### సీఎంతో సమావేశమై పరిష్కరించుకోండి

- అసెంబ్లీ రెండోసారి ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతికి పంపొద్దు : తమిళనాడు గవర్నర్‌కు సుప్రీంకోర్టు సూచన





**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

శాసనసభ తీర్మానించి పంపిన బిల్లులకు తమిళనాడు గవర్నర్ ఆమోద ముద్ర వేయకపోవడంపై ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తో సమావేశమై సమస్య పరిష్కరించుకోవాలని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవికి అత్యున్నత న్యాయస్థానం సూచించింది. తాము ఉన్నతమైన రాజ్యాంగబద్ధ వ్యవస్థలతో వ్యవహరిస్తున్నామని చెబుతూనే.. శాసనసభ రెండోసారి ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు ...7లో

## సాగర్ డ్యామ్‌పై టెన్షన్..టెన్షన్

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ వద్ద మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొంది. తెలంగాణ ప్రాంతం నుంచి దాదాపు వెయ్యి మంది పోలీస్ బలగాలతో పహారా కాస్తున్నారు. ఇటు తెలంగాణ పోలీసులు, అటు ఆంధ్ర పోలీసు బలగాలతో డ్యామ్ పరిసరాల్లో ఉత్కంఠగా మారింది. గురువారం ఏపీ అధికారులు కృష్ణానది యాజమాన్య బోర్డుకు, తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్ష నిర్ణయంతో బలవంతంగా డ్యామ్‌పై దూసుకొచ్చిన విషయం తెలిసిందే.



### రెండో రోజూ యుద్ధ వాతావరణం

- డ్యామ్ వద్దకు ఇరిగేషన్ ఉన్నతాధికారులు
- భారీగా పోలీసు బలగాలతో పహారా
- ఆంధ్ర ఇరిగేషన్ అధికారులు, పోలీస్ అధికారులపై తెలంగాణలో కేసు నమోదు వివరాలు 5లో..

### తక్షణమే ఆపేయండి

నాగార్జునసాగర్ ప్రాజెక్టు వివాదంపై ఏపీకి కేఆర్ఎంబీ ఆదేశం వివరాలు 5లో..

### కేఆర్ఎంబీ చేతిలోకి సాగర్


డ్యాంకు సీఆర్‌పీఎఫ్ భద్రత

- కేంద్ర హోంశాఖ ప్రతిపాదనకు ఇరు రాష్ట్రాల అంగీకారం
- ప్రధానకార్యదర్శులు, డీజీపీలతో వీడియోకాన్ఫరెన్స్

## పురాణాలతో భవిష్యత్తు సంక్షోభం

### గత చరిత్ర గొప్పతనాన్ని చెప్పాల్సిందే

- ఎన్‌సీఈఆర్టీ పాఠ్యాంశాల మార్పుపై విస్తృత చర్చ జరగాలి : ఎస్వీకే వెబినార్‌లో ప్రొఫెసర్ హరగోపాల్



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రామాయణం, మహాభారతం, పురాణాలతో విద్యార్థుల భవిష్యత్తు సంక్షోభంగా మారుతుందని ప్రముఖ రాజకీయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి హరగోపాల్ అన్నారు. గత చరిత్ర గొప్పతనాన్ని చెప్పాల్సిందేననీ, అయితే దానివల్ల సమాజానికి, ప్రజలకు భవిష్యత్తులో కలిగే ప్రయోజనాల గురించి స్పష్టత ఉండాలని చెప్పారు. అప్పుడే మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. 'చరిత్ర పాఠ్యపుస్తకాల్లో పురాణాలా?'అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే) ఆధ్వర్యంలో శుక్రవారం వెబినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చరిత్రను రాసిన వాళ్లంతా మార్క్సిస్టులు కాబట్టి పాఠ్యాంశాలను మారుస్తున్నామని బీజేపీ నాయకులు చెప్తున్నారని వివరించారు. అయితే మార్క్సిస్టులు రాసినా, ఇతరులు రాసినా ఆ చరిత్ర వాస్తవమా? కాదా?, దానికి చారిత్రక ఆధారాలున్నాయా? లేదా?అనేది గమనించాలని సూచించారు. అంతే తప్ప వారు రాశారు కాబట్టి ఆ చరిత్ర స్థానంలో పురాణాలను విద్యార్థులకు అందించడం సమంజసం కాదన్నారు. భారతదేశానికి సంబంధించి మధ్యయుగాలనాటి చరిత్రను వదిలేసి రామాయణం, మహాభారతం, పురాణాల గురించి చరిత్ర పాఠ్యపుస్తకాల ద్వారా అందిస్తే విద్యార్థులకు స్పష్టమైన అవగాహన లోపిస్తుందని వివరించారు. అయితే వాటిలో ఉండే వాస్తవికత, కాల్పనికత గురించి చెప్పాల్సిన అవసరముందన్నారు. ఐఐటీలు, ఐఐఎంలు, ఖగోళ విజ్ఞానం, చంద్రునిపై ప్రయోగాలు విజయవంతమవుతున్న ఈ ఆధునికయుగంలో విశ్వాసాలకు సంబంధించిన చరిత్రను విద్యార్థులకు అందిస్తే నూతన సమాజం ఎలా ఏర్పడుతుందని ప్రశ్నించారు. అంబేద్కర్ కలలుగన్న కులరహిత సమాజం కావాలని చెప్పారు. ఉపాధ్యాయులపై ఉన్న నమ్మకంతో రామాయణం, మహాభారతం, పురాణాలే చరిత్రగా చదివితే ఓ ...7లో

# వన్యప్రాణుల వేట నిరోధానికి ప్రత్యేక డ్రైవ్

## వేట వస్తువులను స్వాధీనం చేసుకోనున్న అటవీశాఖ

- క్యాచ్ ద ట్రాప్ కార్యక్రమం ప్రారంభం



**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రంలో వన్యప్రాణుల వేటను నివారించేందుకుగానూ అటవీశాఖ ప్రత్యేక డ్రైవ్‌ను మొదలుపెట్టింది. వేటగాళ్ల వద్ద ఉండే వేట వస్తువులను స్వాధీనం చేసుకునేకుందు క్యాచ్ ద ట్రాప్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. వేట వస్తువులు ఎవరివద్దనైనా ఉన్నట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలని పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియల్ కోరారు. చట్టవిరుద్ధమైన వేట, అందుకోసం ఉపయోగించే వస్తువులకు సంబంధించిన ఏదైనా సమాచారం, వేట సంబంధిత కార్యకలాపాల గురించి తెలిస్తే జిల్లా అటవీ అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. దానికి సంబంధించిన ఫోన్ నెంబర్ 98033 38666, టోల్ ఫ్రీ నెంబర్ 18004255364ను ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి ప్రత్యేక డ్రైవ చేస్తున్నట్టు తెలిపారు. వేట పరికరాల నివారణలో అత్యుత్తమ పనితీరు కనబరిచే క్షేత్రస్థాయి సిబ్బందికి, ఇన్‌ఫార్మర్లకు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు.

**స్పెషల్ డ్రైవ్ ఇలా..**

ఎ) ఫారెస్ట్ అధికారులు ఈ ప్రత్యేక డ్రైవ్‌లో వీలైనన్ని అటవీ ప్రాంతాలను పరిశీలిస్తారు. ఆ ప్రాంతాల్లో వేటగాళ్లను గుర్తించి వారు వాడే పరికరాలను స్వాధీనం చేసుకుంటారు. గత రికార్డులు, కేసులను పరిశీలించి అనుమానితుల ఇండ్లల్లో సోదా చేస్తారు. వారి వద్ద ఉండే వేట పరికరాలను స్వాధీనం చేసుకుంటారు.

బి) అడవులను ఆనుకుని ఉండే వ్యవసాయ క్షేత్రాలు, అడవుల పక్కనే ఉండే గ్రామాలు, ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారు.

సి) స్వాధీనం చేసుకున్న అన్ని వేటకు ఉపయోగించే మెటీరియల్/పరికరాలు రికార్డ్ చేయటంతో పాటు, సురక్షితమైన కస్టడీ, తిరిగి ఉపయోగించడాన్ని నివారించటం కోసం హైదరాబాద్‌కు తరలిస్తారు.

**ఇలా చేయకూడదు**

1) వలలు, ఉచ్చులు, లైవ్ వైర్లు, విషం, పేలుడు పదార్థాలు మొదలైన వాటిని ఉపయోగించి అటవీ జంతువులను చంపడం/వేటాడటం నిషేధం.

2) సాధారణంగా వైర్, నైలాన్ లేదా స్టీల్, మెష్, ఇతర పరికరాలు అటవీ జంతువుల వేటకు వాడుతున్నారు. అలా చేయడం చట్టవిరుద్ధం.

3) వ్యవసాయ పంటల నష్టాన్ని నివారించడం కోసం కొంతమంది, అటవీ జంతువుల మాంసం వినియోగం, వ్యాపారం కోసం కూడా ఇటువంటి జంతువుల వేట విరివిగా జరుగుతున్నది. ఇలా చేయడం చట్టరీత్యా నేరం.

4) అటవీ జంతువుల దాడి కారణంగా పంట నష్టపోవటం, పెంపుడు పశువుల నష్టానికి ప్రతీకారంగా కూడా అటవీ జంతువుల వేట జరుగుతుంది. ఇలా చేయడం నేరం.

# బాలిక గొంతులో చీము గడ్డ తొలగింపు

- ప్రాణం కాపాడిన ఈఎన్‌టీ వైద్యులు

**నవతెలంగాణ-సుల్తాన్ బజార్**

గొంతులో చీము గడ్డ ఏర్పడటంతో తీవ్ర నొప్పితో బాధపడుతున్న ఓ బాలికకు ఈఎన్‌టీ ఆస్పత్రి వైద్యులు చికిత్స అందించి ప్రాణం కాపాడారు. వివరాల్లోకెళ్తే.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మేట గ్రామానికి చెందిన 15 ఏండ్ల బాలిక శృతి కొన్ని రోజులుగా గొంతునొప్పితో బాధపడుతోంది. ఏమీ మింగరాకుండా ఉంది. దాంతో ఆమెను కుటుంబీకులు హైదరాబాద్ కోఠిలోని ఈఎన్‌టీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే అక్కడి వైద్యులు అడ్మిట్ చేసుకొని రక్త పరీక్షలు నిర్వహించి గొంతులో పెద్ద చీము గడ్డను గుర్తించారు. ఈ గడ్డ గొంతులో వెనుక భాగము నుంచి ఛాతిపై భాగానికి కూడా విస్తరించినట్టుగా గుర్తించారు. ఏ మాత్రం ఆలస్యం చేసినా శ్వాసనాళానికి ఇబ్బంది ఏర్పడి ప్రాణానికే ప్రమాదం ఉంటుందని గుర్తించిన వైద్యులు.. ఆపరేషన్ నిర్వహించి 300 ఎంఎల్ చీమును బయటకు తీశారు. అనంతరం బాలికను ఐసీయూకి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన వైద్యుల బృందాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ అభినందించారు. డాక్టర్ ఆనంద్ ఆచార్య, డాక్టర్ సంపత్ రావు, డాక్టర్ ఫణి, డాక్టర్ స్వామి, మత్తు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ నిఖిల వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్స్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## పాఠశాల సెలవులనూ వివాదాస్త్రంగా మార్చిన బీజేపీ

**పాట్నా** :బీజేపీ యేతర రాష్ట్రాల్లో విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పాఠశాల సెలవులనూ అస్త్రంగా వినియోగిస్తోంది. విద్యార్థులకు ఇచ్చే సెలవులతో బీహార్‌లో వివాదానికి తెరతీసింది. ఇటీవల బీజేపీతో తెగతెంపులు చేసుకున్న జనతాదళ్ (యునైటెడ్) అధ్యక్షుడు నితీష్‌కుమార్, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ)తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. దీంతో నితీష్‌కుమార్‌ను టార్గెట్ చేసేందుకు బీజేపీ ఏ ఒక్క అవకాశాన్ని కూడా విడిచిపెట్టడంలేదు.

రెండు రోజుల క్రింత బీహార్‌లోని విద్యాశాఖ 2024 పాఠశాలలకు సెలవుల జాబితాను విడుదల చేసింది. ఈ సెలవులపై వార్తాపత్రికలతో పాటు ఎలక్ట్రానిక్ మీడియాలో కూడా తప్పుడు కథనాలు ప్రచారమయ్యాయి. ఈ కథనాల సారాంశమేమిటంటే.. పాఠశాలలకు ప్రకటించిన సెలవుల్లో హిందూ పండుగలు రద్దు చేయబడ్డాయి. ముస్లిం సెలవులు ప్రవేశపెట్టబడ్డాయి. ఈ తప్పుడు సమాచారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హిందూ సంఘాలు కూడా పెద్ద ఎత్తున బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను ట్రోల్ చేయడం ప్రారంభించాయి. పలువురు సీనియర్ బీజేపీ నేతలు, కార్యకర్తలు ఈ నకిలీ వార్తలకు విస్తృత ప్రచారం కల్పించారు. దీంతో టీవీ, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ఈ అంశంపై చర్చలు ప్రారంభమయ్యాయి. చివరికి హిందూ వర్గం కూడా ఈ వార్తలపై ఆగ్రహం కలిగి ఉందంటూ సోషల్‌మీడియా హెూరెత్తించింది.

**అసలు విషయమేమిటంటే..**

ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలలకు సెలవుల జాబితాను విడుదల చేస్తుంటాయి. అయితే వేర్వేరు పాఠశాలల కోసం వేర్వేరు క్యాలెండర్‌లను జారీ చేస్తాయి. మదర్సా మరియు మక్తాబ్‌లకు వేర్వేరు సెలవుల జాబితా ఉంటుంది. మదర్సా, మక్తాబ్‌ల సెలవుల జాబితాను మాత్రమే ఎంచుకుని.. అన్ని విద్యాసంస్థలకు ఈ సెలవులనే జారీ చేశారంటూ సోషల్‌మీడియా, వార్తాపత్రికలు నకిలీ సమాచారాన్ని వ్యాప్తి చేశాయి. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వంలోనూ ఉత్తర ప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ ఆదివారానికి బదులుగా శుక్ర వారాన్ని సెలవుదినంగా ప్రకటిస్తుంది. నితీష్‌కుమార్-తేజస్వీయాదవ్‌ల ప్రభుత్వం వేసవి సెలవులను 20 నుండి 30 రోజులకు పొడిగించింది. ఆ సమయంలో వచ్చే హిందూ పండుగలకు ప్రత్యేకంగా సెలవులను పేర్కొనలేదు.

దీంతో ఉద్దేశపూర్వకంగా విద్వేషపూరిత ప్రచారాన్ని వ్యాప్తి చేసేందుకు బీజేపీ ఈ జాబితాను అస్త్రంగా వినియోగించింది. బీహార్‌లోని నితీష్ కుమార్ ప్రభుత్వం ముస్లింలకు మాత్రమే ఐటీ పార్క్, మతపరమైన రిజర్వేషన్లు కల్పిస్తోంది. అలాగే షాదీ షగున్ పథకం, వక్ఫ్ సంస్థలకు వడ్డీలేని రుణాలు, హజ్‌యాత్రకు సబ్సిడీ, మౌల్వీలకు జీతాలు, ముస్లిం విద్యార్థులకు ఉచిత యుపిఎస్‌ఇ కోచింగ్ ఇస్తోంది. ఇవి సంక్షేమం కాదు.. ఇవి యుద్ధం అని బీజేపీ ట్వీట్ చేసింది. ఈ దేశంలో 'సెక్యులరిజం' సమాధానపరిచే అంశంగా మారిపోయిందని ఆరోపించింది. జన్మాష్టమి, రక్షా బంధన్, శివరాత్రి పండుగలకు సెలవులు ఇవ్వకుండా ముస్లిం పండుగైన ఈద్‌కు ఒక్కరోజు బదులుగా మూడు రోజులు సెలవులను ప్రకటించిందని బీజేపీ పేర్కొంది.

# పర్యాటక శాఖ కార్యాలయంలో భారీ అగ్నిప్రమాదం

### ఫైల్స్, ఫర్నీచర్, కంప్యూటర్లు దగ్ధం

**నవతెలంగాణ- హిమాయత్‌నగర్**

తెలంగాణ పర్యాటక శాఖ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఉన్న అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో మంటలు చెలరేగాయి. దాంతో భద్రత సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్టు అగ్నిమాపక సిబ్బంది ప్రాథమికంగా గుర్తించారు. ఈ ప్రమాదంలో అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లోని ఫైల్స్, ఫర్నీచర్, కంప్యూటర్లు దగ్ధమయ్యాయి. కార్యాలయం కింద ఉన్న రెండు ఇన్నోవా కార్లపై అగ్ని కీలలు పడటంతో అవి కాలిపోయాయి.

**అగ్ని ప్రమాదంపై అనుమానాలు : నారాయణ**

పర్యాటక శాఖ ప్రధాన కార్యాలయంలో అగ్ని ప్రమాదం ఉద్దేశపూర్వకంగా చేసినట్టు ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ అనుమానం వ్యక్తం చేశారు. కార్యాలయాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శి కమతం యాదగిరితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి బాగోతం బట్టబయలు కాకుండా కుట్ర చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం మారితే వారి అవినీతి బయట పడుతుందనే భయంతోనే కార్యాలయంలో అగ్ని ప్రమాదం సృష్టించారని ఆరోపించారు. మొదటి అంతస్థులో ఉన్న అడ్మిన్ సెక్షన్‌లో ముఖ్యమైన ఫైల్స్‌ను కుట్రతోనే దగ్ధం చేశారన్నారు. అగ్ని ప్రమాదంపై ఎలాంటి విచారణ జరగకుండా కాలిపోయిన వస్తువులు, ఫర్నీచర్, ఫైల్స్‌ను ఎలా చెత్తకుండీలో వేస్తారని, ఆగమేఘాల మీద కూలీలను పెట్టి శుభ్రం చేయించడంపై అనుమానం కలుగుతోందన్నారు. పర్యాటక శాఖ ఎండీ మనోహరప్ప బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఊడిగం చేయడం వల్లే ఎన్నికల కమిషన్ ఆయనను సస్పెండ్ చేసిందని, ఈ ప్రమాదంలో ఎండీ ప్రమేయంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ అగ్ని ప్రమాదం వెనుక భారీ కుట్ర దాగి ఉందని, ఉన్నత స్థాయి విచారణ జరిపించి నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ నేతలు నెర్లకంటి శ్రీకాంత్, సీహెచ్.శ్రీనివాస్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.



# 10, 12 తరగతి పరీక్షల్లో

## డివిజన్, డిస్టింక్షన్ ఇవ్వం : సిబిఎస్ఇ

**న్యూఢిల్లీ** : 10, 12 తరగతి పరీక్షల్లో డివిజన్, డిస్టింక్షన్ ఇవ్వమని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) శుక్రవారం ప్రకటించింది. అలాగే మార్కుల శాతాన్ని కూడా పేర్కొనమని స్పష్టం చేసింది. ప్రతీ సబ్జెక్టులో మార్కులను ఇచ్చే విధానాన్నే కొనసాగిస్తామని... అవసరమైతే ఉన్నతా విద్యాసంస్థ, సంంధిత యజమాని వాటిని లెక్కించుకోవచ్చునని సిబిఎస్ఇ తెలిపింది.

'డివిజన్, డిస్టింక్షన్, మార్కుల మొత్తాన్ని ప్రకటించం. అలాగే, ఒక అభ్యర్థి ఐదు కంటే ఎక్కువ సబ్జెక్టులను ఎంచుకుంటే.. ఇందులో ఉత్తమైన ఐదు సబ్జెక్టులను అడ్మిషన్ పొందిన సంస్థ లేదా యాజమాని తీసుకోవచ్చు' అని సిబిఎస్ఇ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సన్యాం భరద్వాజ్ తెలిపారు. మార్కుల శాతాన్ని లెక్కించడం, ప్రకటించడం లేదా తెలియజేయడాన్ని సిబిఎస్ఇ చేయదని భరద్వాజ్ తెలిపారు. తదుపరి ఉన్నత విద్యకు లేదా ఉద్యోగంలో మార్కుల శాతం అవసరమైతే వాటిని ప్రవేశం పొందిన సంస్థ, యజమాని లెక్కించుకోవచ్చునని తెలిపారు.

కాగా, గతంలోనే అనారోగ్య పోటీని నివారించడానికి సిబిఎస్ఇ మెరిట్ లిస్టులను ఇచ్చే పద్ధతిని నిలిపివేసింది. సిబిఎస్ఇ 10, 12 తరగతుల బోర్డు పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభం కానున్నాయి. భారత్‌తో పాటు 26 విదేశాల్లో 28 వేలకు పైగా సిబిఎస్ఇ అనుబంధ పాఠశాలలు ఉన్నాయి. గత సిబిఎస్ఇ 10వ తరగతి పరీక్షకు 21 లక్షలకు పైగా విద్యార్థులు, 12వ తరగతి పరీక్షకు 16 లక్షల విద్యార్థులు హాజరయ్యారు.

## శిథిలాల తొలగింపు తరువాత సొరంగ నిర్మాణం పునఃప్రారంభం

**న్యూఢిల్లీ** : శిథిలాలను తొలగించిన తరువాత సిల్క్యారా సొరంగం నిర్మాణ పనులను పున:ప్రారంభిస్తామని నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఐడిసిఎల్) శుక్రవారం ప్రకటించింది. నవంబర్ 12న ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో నిర్మాణంలో ఉన్న సిల్క్యారా సొరంగం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ సొరంగంలో 17 రోజులు పాటు 41 మంది కార్మికులు చిక్కుకుని ఉండిపోయారు. ఈ ప్రమాదంపై ఎన్‌హెచ్‌ఐడిసిఎల్ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్, ఫైనాన్స్) అన్షు మనీష్ ఖల్ఖో మీడియాతో మాట్లాడుతూ 'ఇటువంటి సంఘటనలను ఎవ్వరూ ఊహించలేరు' అని అన్నారు. ఈ సొరంగాన్ని నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ ద్వారా ఎన్‌హెచ్‌ఐడిసిఎల్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టును ఆపడానికి లేదా నిలిపివేయడానికి ఎటువంటి కారణం లేదని అన్నారు. అలాగే, 'కార్మికులను రక్షించడం కోసం ఘటనా స్థలానికి వచ్చిన యంత్రాలను వెనక్కి పంపడం కోసం కొంత విరామం తీసుకుంటున్నాం. కార్మికులకు కూడా కొంత విరామం కావాలి. శిథిలాల తొలగింపు తరవాత నిర్మాణ పనులు పున:ప్రారంభిస్తాం. శిథిలాల తొలగింపునకు మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుంది' అని తెలిపారు. పనిని పున:ప్రారంభించే ముందు జియోలాజికల్ సర్వే, సేఫ్టీ ఆడిట్ నిర్వహిస్తారా.. అనే ప్రశ్నకు 'నిర్మాణం, జియోలాజికల్ సర్వే ఏక కాలంలో కొనసాగుతుంది' అని తెలిపారు. ఈ ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ 21 సార్లు కుప్పకూలిన సంఘటనలు జరిగాయని, అయితే ఎవ్వరూ గాయపడలేదని అన్నారు. సొరంగ నిర్మాణ సమయాల్లో ఇలాంటి ప్రమాదాలు సర్వసాధారణమని అన్షు మనీష్ ఖల్ఖో తెలిపారు.

**ఎయిమ్స్ నుంచి కార్మికుల డిశ్చార్జ్**

సొరంగం నుంచి సురక్షితంగా బయటకు వచ్చిన 41 మంది కార్మికులను రిషికేశ్‌లోని ఎయిమ్స్ నుంచి గురువారం రాత్రి డిశ్చార్జ్ చేశారు. వీరికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని వైద్యులు తెలిపారు. మరోవైపు 41 మంది కార్మికులను ఆసుపత్రిలో కలుసుకున్న నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులు వారికి చెల్లింపు సెలవులతో పాటు రూ 2 లక్షల చెక్కును అందించారు. డిశ్చార్జ్ అయిన కార్మికులు ప్రత్యేక బస్సుల ద్వారా ఢిల్లీ విమానాశ్రాయం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి వారి వారి స్వరాష్ట్రాలకు వెళతారు. బీహార్‌కు చెందిన ఐదుగురు కార్మికులు ఇండిగో 6ఇ విమానం ద్వారా పాట్నా విమానాశ్రయానికి శుక్రవారం చేరుకున్నారు.

# రేవంత్‌ను ముఖ్యమంత్రి చేయొద్దు

### ఏఐసీసీ మాజీ సభ్యులు బక్క జడ్సన్

**నవతెలంగాణ-బంజారాహిల్స్**

తెలంగాణలో కాంగ్రెస్ గెలిస్తే టీపీసీసీ చీఫ్ రేవంత్‌ను సీఎం చేయొద్దంటూ ఆ పార్టీ నేత, ఏఐసీసీ మాజీ సభ్యులు బక్క జడ్సన్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ లో అధికార మార్పిడి దొంగల మార్పిడి కాకూడదన్నారు. కల్వకుంట్ల కుటుంబంతో సంబంధం ఉన్న రేవంత్‌ను ముఖ్యమంత్రిని చేయొద్దన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతి అక్రమాలలో రేవంత్‌కు భాగం ఉందని ఆరోపించారు. అవినీతి ప్రభుత్వాన్ని పారదోలి ప్రజా సంక్షేమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే లక్ష్యంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపారని అన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే అవకాశం ఇచ్చిన ప్రజల కోసం అవినీతి మచ్చలేని వ్యక్తిని ముఖ్యమంత్రి చేసి సంక్షేమ పాలనను అందించాలని అధిష్టానాన్ని కోరనున్నట్టు చెప్పారు. ఈ విషయమై కాంగ్రెస్ అధిష్టానానికి లేఖ రాయనున్నట్టు తెలిపారు.

# ర్యాష్ డ్రైవింగ్.. మహిళ మృతి

## పోలీస్ అధికారి కుమారుడి నిర్లక్ష్యమే కారణం

- పోలీస్‌స్టేషన్ ముట్టడి, బంధువుల రాస్తారోకో




**నవతెలంగాణ-కాజీపేట**

ఓటు వేసి వెళుతుండగా.. అతివేగంగా వచ్చిన కారు ఢీ కొని ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన హన్మకొండ జిల్లా కాజీపేట పట్టణం దర్గా రోడ్డులో జరిగింది. కాగా, కారు నడిపిన వ్యక్తి.. ఎక్సైజ్ పోలీస్ శాఖకు చెందిన ఓ అధికారి కుమారుడు. అతని ర్యాష్ డ్రైవింగ్ వల్లనే ఆమె మృతి చెందినట్టు మృతురాలి బంధువులు ఆరోపిస్తూ స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి రాస్తారోకో చేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని తప్పకుండా న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. వివరాల్లోకెళ్తే.. ఫాతిమానగర్ శౌరీనగర్‌లో నివాసముంటున్న దంపతులు గెదె కవిత (38), జోసఫ్‌రెడ్డి.. సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో గురువారం తమ ఓటు వేయడానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. ఓటు వేసి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో పాఠశాల గేటు ముందు ఆమె భర్త వాహనం ఎక్కుతుండగా.. అతి వూగంగా వచ్చిన కారు కవితను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయాలవ్వడంతో వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. అయితే, కారు ప్రమాదం జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో మృతిరాలి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కారుతో ఢీ కొట్టిన్న వ్యక్తి ఎక్సైజ్ పోలీస్ శాఖకు చెందిన అధికారి కుమారుడు వంశీ భార్గవ్‌గా గుర్తించారు. అయితే కాజీపేట పోలీసులు పట్టించుకోకపోవడంతో.. పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన మృతురాలి బంధువులు.. పోలీసులతో వాగ్వావాదానికి దిగారు. దాంతో దిగొచ్చిన పోలీసులు.. నిందితునిపై కేసు నమోదు చేశామని, తప్పకుండా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాంతో ఆందోళన విరమించారు. రాస్తారోకోతో ఫాతిమానగర్ బ్రిడ్జి వద్ద సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఆగిపోవడంతో ట్రాఫిక్ పోలీసులు క్లియర్ చేశారు. కాగా, మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఆమె నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుండగా, ఆమె భర్త జోసఫ్ రెడ్డి సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్నారు.

# వర్ధమాన దేశాలకు నిధులు అందాలి, సాంకేతికత బదిలీ కావాలి

### సంపన్న దేశాలకు మోడీ పిలుపు

**దుబాయ్** : వర్ధమాన దేశాలకు సాంకేతిక బదిలీ జరగాలని, వాతావరణ విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన నిధులను అందించేలా చూడాలని ప్రధాని నరేంద్ర మోడీ సంపన్న దేశాలకు పిలుపిచ్చారు. వాతావరణ సమస్యలను సృష్టించడంలో వర్ధమాన దేశాల పాత్ర వుండడం లేదని, అయినా కూడా వారు సమస్య పరిష్కారంలో భాగస్వాములవడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నారన్న విషయాన్ని గుర్తించాల్సి వుందన్నారు. సమానత్వం, వాతావరణ న్యాయం, పరస్పరం పంచుకునే బాధ్యతలు, సామర్థ్యాల ప్రాతిపదికన వాతావరణ కార్యాచరణ వుండాలని తాను విశ్వసిస్తానని చెప్పారు. ఈ సూత్రాలకు కట్టుబడి వుండడం ద్వారా సుస్థిరమైన భవిష్యత్ దిశగా ఒక బాటను ఏర్పాటు చేయగలమని, ఆ క్రమంలో ఎవరూ వెనుకబడి పోరని అన్నారు. ఈ క్రమంలో పేద, వర్ధమాన దేశాల అభివృద్ధి ప్రాధాన్యతలపై రాజీ పడరాదన్నారు.

దుబాయ్‌లో జరుగుతున్న కాప్ 28 సదస్సుకు హాజరైన మోడీ అక్కడి పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. వాతావరణ మార్పులనేది సమిష్టిగా ఎదుర్కొనాల్సిన సవాలని తానెప్పుడూ చెబుతానని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఐక్య ప్రతిస్పందన ఒక్కటే దీనికి పరిష్కారమని స్పష్టం చేశారు. వాతావరణ మార్పులపై చేపట్టే కార్యాచరణ గురించి పెరుగుతున్న ఆశలను వాతావరణ నిధులపై పురోగతిలో చూడాల్సి వుందని ఆయన పేర్కొన్నారు. సమర్థవంతమైన, సమిష్టి వాతావరణ కార్యాచరణకు ఈ సదస్సు తాజా ఊపునివ్వగలదని భారత్ ఆశాభావంతో వుందని అన్నారు. అలాగే యుఎన్‌ఎఫ్‌సిసిసి, పారిస్ ఒప్పందం లక్ష్యాలను మరింత ముందుకు తీసుకెళ్లడంలో అంతర్జాతీయ సహకారం కూడా పెరగగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. మరింత పచ్చదనంతో కూడిన, అలాగే సంక్షేమం సమృద్ధిగా వుండగల భవితవ్యం కోసం భారత్, యుఎఇలు భాగస్వాములుగా కృషి చేస్తాయన్నారు. వాతావరణ కార్యాచరణపై అంతర్జాతీయ కార్యకలాపాలను ప్రభావితం చేసేందుకు సంయుక్తంగా కృషి చేయడానికి కట్టుబడి వున్నామన్నారు.

భారత్-యుఇఎ సంబంధాలపై మాట్లాడుతూ, రెండు దేశాల మధ్య ఇప్పటికే మంచి పటిష్టమైన సంబంధాలు వున్నాయన్నారు. ఇంధన భద్రతను మరింత పెంచుకునేందుకు ఉమ్మడి గ్రిడ్‌ను ఏర్పాటు చేయడంలో చేతులు కలపనున్నట్లు చెప్పారు. గ్లోబల్ సోలార్ ఫెసిలిటీకి మద్దతునిస్తామని చెప్పారు.

**తదుపరి కాప్ సదస్సుకు భారత్ ఆతిథ్యం ?**

2028లో జరగబోయే కాప్ 33 వాతావరణ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తుందని ప్రధాని మోడీ శుక్రవారం ప్రతిపాదించారు. ప్రజల ప్రాతినిధ్యం ద్వారా కార్బన్ సింక్‌లను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టే గ్రీన్ క్రెడిట్ ఇనీషియేటివ్‌ను ప్రారంభించారు. అభివృద్ధికి, పర్యావరణ సంరక్షణకు మధ్య సంతులనాన్ని పాటిస్తూ భారత్, ప్రపంచ దేశాలకు గొప్ప ఉదాహరణగా నిలిచిందని చెప్పారు. 2030 జూన్ కల్లా కాలుష్యాల తీవ్రతను 45శాతం తగ్గించాలని, శిలాజయేతర ఇంధనాల వాటాను 50శాతానికి పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు వర్ధమాన, పేద దేశాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపన్న దేశాలు బదిలీ చేయాలని ఆయన కోరారు.

# గాజాపై దాడులను తిరిగి ప్రారంభించిన ఇజ్రాయిల్



**ఇజ్రాయిల్** : కాల్పుల విరమణ అనంతరం హమాస్ పై దాడులను ఇజ్రాయిల్ మళ్లీ మొదలుపెట్టింది. ఇందుకు కాల్పుల విరమణ ఒప్పందాన్ని హమస్ ఉల్లంఘించిందనే నెపాన్ని హమస్ పైన ఇజ్రాయిల్ మోపుతోంది. కాల్పుల విరమణ కాల పరిమితి తరువాత తాను తిరిగి దాడులను పునఃప్రారంభిస్తానని ఇజ్రాయిల్ పదేపదే ప్రకటిస్తోంది. హమస్ కాల్పుల విరమణను ఉల్లంఘించి తమ భూభాగంపైన కాల్పులకు తెగబడిందని ఆరోపించటమే కాకుండా గాజాలోని హమస్ స్థావరాలపైన దాడులను మొదలెట్టిందని కూడా ఇజ్రాయిల్ ఆ ప్రకటనలో పేర్కొంది. అంతేకాకుండా గాజాలోని హమాస్ లక్ష్యాలపైన వైమానిక దాడులను మొదలెట్టినట్టు కూడా ఇజ్రాయిలీ సైన్యం ప్రకటించింది. ఇజ్రాయిలీ సైన్యమే కాకుండా ప్రధాన మంత్రి నేతాన్యాహు కూడా హమస్ కాల్పులు విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, బంధీలుగా వున్న మహిళలందరినీ విడుదల చేయలేదని ఆరోపించారు. అంతేకాకుండా ఇజ్రాయిల్ తన యుద్ధ లక్ష్యాలైన బంధీలను విడుదల చేయటం, హమాస్‌ను తిరిగి తలెత్తుకోలేకుండా తుదముట్టించటంవంటి పనులను నెరవేరుస్తుందని ప్రకటించారు. ఉత్తర గాజాలో కాల్పుల విరమణ ఒప్పంద షరతుల ఉల్లంఘన జరిగిందని ఇరు పక్షాలు పరస్పరం ఆరోపించుకున్నాయి. ఖతార్ మధ్యవర్తిత్వంతో నవంబర్ 24 నుంచి నాలుగు రోజులపాటు కాల్పుల విరమణ చేయటానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ ఒప్పందంలో ప్రధాన మేమంటే... అక్టోబర్ 7న ఇజ్రాయిల్ పైన హమాస్ మెరుపుదాడి చేసి బంధీలుగా పట్టుకున్న దాదాపు 240 మందిలో 50 మందిని, 150 పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాలి. అంతేకాకుండా హమాస్ విడుదల చేసే ప్రతి 10మంది బందీలకు ఒక రోజు కాల్పుల విరమణ చేయటానికి సిద్ధమని ఇజ్రాయిల్ ప్రకటించింది. హమాస్ అనేకమంది విదేశీయులతోసహా 100మందికి మించి బంధీలను విడుదల చేయగా, అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ దాదాపు 240 పాలస్తీనా ఖైదీలను విడుదల చేయటంతో కాల్పుల విరమణ అనేకసార్లు పొడిగించబడింది. గురువారంనాడు చివరగా 8మంది ఇజ్రాయిలీ బందీలను గాజాలో రెడ్ క్రాస్ కు అప్పగించగా, ఇజ్రాయిల్ 30మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది.

# ఫైజర్‌ను కోర్టుకు లాగిన టెక్సాస్

- ఫేక్ కొవిడ్ వ్యాక్సిన్‌తో ప్రజలను మోసగించినందుకు..



**న్యూయార్క్** : ప్రముఖ ఫార్మా బహుళజాతి కంపెనీ ఫైజర్ పైన అమెరికాలోని టెక్సస్ రాష్ట్ర అటార్ని జనరల్ గురువారం ఓ దావా వేశారు. తన కోవిడ్-19 వ్యాక్సిన్ పని సామర్థ్యం గురించి ఫైజర్ ప్రజలను పూర్తిగా తప్పుదోవ పట్టించటమే కాకుండా దాని వైఫల్యాలపైన చర్చ జరగనీయకుండా అణచి వేసిందని ఆయన తన దావాలో పేర్కొన్నారు. ఈ విషయంపైన ప్యాక్స్టన్ ఆరు నెలలపాటు పరిశోధన అనంతరం ఈ దావా వేయటం జరిగింది. తన కోవిడ్-19 వ్యాక్సిన్ పనిచేసే తీరు గురించి టెక్సాస్ డిసెప్టివ్ ట్రేడ్ ప్రాక్టిసెస్ యాక్టుకు ఉల్లంఘించి ఎటువంటి ఆధారాలు లేకుండా మోసపూరితంగా గొప్పలు చెప్పి 100 కోట్ల డాలర్ల లాభాలను ఫైజర్ దండుకుందని ప్యాక్స్టన్ ఒక ప్రకటనలో పేర్కొంది. తన వ్యాక్సిన్ కరోనా వైరస్ పైన 95శాతం సమర్థవంతంగా పనిచేస్తుందని ఫైజర్ చెప్పటాన్ని ప్యాక్స్టన్ తప్పుబట్టింది. "సాపేక్షంగా ప్రమాదాన్ని తగ్గించటం" అనే గణాంక ట్రిక్ వల్ల వినిమయదారులు ఫైజర్ తయారుచేసిన వ్యాక్సిన్ సామర్థ్యాన్ని అతిగా ఊహించుకునే అవకాశం ఉంటుందని అమెరికా ఫు అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌డీఏ) అంగీకరించింది. క్లినికల్ ట్రయిల్ డేటాను అనుసరించి ఈ వ్యాక్సిన్ వల్ల కోవిడ్-19 బారీనపడకుండా తప్పించుకునే అవకాశం కేవలం 0.85శాతం మాత్రమే ఉంటుందని టెక్సాస్ అటార్ని జనరల్ పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి రాకుండా వ్యాక్సిన్ వేసుకున్న అమెరికన్లు ఎటువంటి వ్యాక్సిన్ వేసుకోని అమెరికన్ల కంటే ఎక్కువగా చనిపోయిన ఉదంతాలు చాలాచోట్ల జరిగాయి. ఫైజర్ ఉద్దేశపూర్వకంగానే తన వ్యాక్సిన్ సామర్థ్యం గురించి గొప్పలకు పోయిందని, తన వ్యాక్సిన్‌ను విమర్శించిన వారిని "క్రిమినల్స్" అని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని నిందించిందని అటార్ని జనరల్ తన దావాలో పేర్కొన్నారు. దీనికి శిక్షగా ఫైనాన్షియల్ పెనాల్టీలు ఉండాలని, తిరిగి ఫైజర్ తన ఉత్పత్తుల గురించి అటువంటి తప్పుడు ప్రచారం చేయకుండా నిలువరించాలని దావాలో కోరారు.

# బెంగళూరులోని పాఠశాలలకు బాంబు బెదిరింపులు

**బెంగళూరు:** కర్ణాటక రాజధాని బెంగళూరు, దాని చుట్టుపక్కల ఉన్న 48 పాఠశాలలకు శుక్రవారం ఇమెయిళ్ల ద్వారా బాంబు బెదిదింపులు వచ్చాయి. పాఠశాలల మైదానంలో పేలుళ్ల పదార్థాలు అమర్చామని బెదిరించారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసిన పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులను ఇళ్లకు తీసుకుని వెళ్లాలని వారి తల్లదండ్రులకు విజ్ఞప్తి చేశాయి. బాంబు గుర్తింపు బృందాలతో పాఠశాలలకు చేరుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా పేలుళ్ల పదార్థాలను గుర్తించలేదు. దీంతో ఈ బెదిరింపులను బూటకంగా తేల్చారు. అయితే ఈ బెదిరింపులపై విచారణ కొనసాగిస్తామని చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రంగా స్పందించారు. బెంగళూరులో భద్రత పెంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆందోళనకు గురికావద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్, హోం మంత్రి జి పరమేశ్వర, ప్రతిపక్ష నాయకులు ఆర్ అశోక్ కూడా బెదిరింపులుపై స్పందించారు. పాఠశాలలను సందర్శించారు.

# మయన్మార్ మాజీ కల్నల్‌కు పదేండ్ల జైలు శిక్ష

**నైఫిడో** :గతంలో సమాచార మంత్రిగా, అధ్యక్ష ప్రతినిధిగా పనిచేసిన మాజీ ఆర్మీ అధికారి యే హ్టుట్ (64)ను జుంటా సైన్యం దేశద్రోహం కేసులో దోషిగా నిర్ధారించింది. ఆయనకు పదేళ్ల జైలుశిక్ష విధించినట్లు ఓ న్యాయ అధికారి గురువారం తెలిపారు. తప్పుడు, రెచ్చగొట్టే వార్తలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తున్నారంటూ అరెస్టై జైళ్లలో మగ్గుతున్న ప్రముఖ వ్యక్తులలో యే హ్టుట్ కూడా ఉన్నారు. 2021లో ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన అంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూలదోసి జుంటా సైన్యం మయన్మార్ పాలనను చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.

అప్పటి నుండి మయన్మార్‌లో పలువురిని దేశద్రోహం పేరుతో జైలు పాలు చేస్తోంది. కొంత మంది సీనియర్ సైనిక అధికారులపై అవినీతి ఆరోపణలు సహా పలు కేసులతో తొలగించిన అనంతరం యాంగోన్ రీజనల్ మిలటరీ కమాండ్‌కు చెందిన ఓ సైనిక అధికారి యేహ్టుట్‌ను కూడా తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

## కౌంటింగ్ పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండండి

- అభ్యర్థులకు భట్టి విజ్ఞప్తి
- ఓటర్లకు కృతజ్ఞతలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకు కాంగ్రెస్ అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. ప్రజలు మార్పు కోసం తీసుకున్న నిర్ణయాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. ఎన్నికల్లో పాల్గొని కాంగ్రెస్ హస్తం గుర్తుపై భారీగా ఓట్లేసిన ప్రజలకు, అందుకు సహకరించిన మీడియాకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎల్బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అభిమానంతో ప్రజలు తమ పార్టీ పక్షాన నిలిచారని తెలిపారు. ఎన్నో సర్వే సంస్థలు కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ప్రకటించాయని గుర్తు చేశారు. ఆపద్ధర్మ ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగపరుస్తున్నదని విమర్శించారు. అసైన్డ్ భూములను ధరణిలో తప్పుడుగా నమోదు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం వేరే వ్యక్తుల పేర్ల మీదకు మార్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వాపోయారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసిన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని తెలిపారు. పనులు పూర్తి కాకుండానే కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. ఒక ప్రభుత్వం నుంచి మరొక ప్రభుత్వం మారుతున్న క్రమంలో ఇష్టారాజ్యం వ్యవహరించకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రాష్ట్రంలో గత ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ధర్మపురి, హుజూర్‌నగర్, మంచిర్యాల, ఇబ్రహీంపట్నం, తుంగతుర్తిలో ఇబ్బందులు నెలకొన్నాయని తెలిపారు. ప్రస్తుతం కోర్టుల్లో కేసులు కూడా ఇంకా నడుస్తున్నాయని వివరించారు.అందువల్ల కౌంటింగ్ పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మధుయాష్కీ మాట్లాడుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌ను వీడుతున్నారని ఎద్దేవా చేశారు. అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. తమకు గెలుపుపై పక్కా సమాచారం అందిందన్నారు. ధరణిలో రాత్రికి రాత్రి భూముల పేర్లు మార్చుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు సబ్సిడీలు ఇవ్వకుండా రైతు బంధు డబ్బులు రూ. 5వేల కోట్లను దారి మళ్లించేందుకు కేసీఆర్ పావులు కదుపుతున్నట్టు విమర్శించారు. రాష్ట్రంలో జరిగిన అవినీతిపై కల్వకుంట్ల కుటుంబాన్ని వదిలిపెట్టేది లేదన్నారు. సోదరి కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన అవినీతి సొమ్ముపై కూడా విచారణ జరిపిస్తామని వివరించారు. అవినీతికి సహకరించిన అధికారులను జైలుకు పంపడం ఖాయమన్నారు.ఉద్యమ పార్టీ అని చెప్పుకునే బీఆర్ఎస్‌కు ఇన్ని కోట్ల రూపాయలు ఎక్కడివని ప్రశ్నించారు. బీజేపీకి కూడా స్వాతంత్రం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ కంటే ఎక్కువ డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయో ప్రజలు గమనించాలని కోరారు.

## తగ్గిన ఓటింగ్ శాతంతో.. ఎవరికి నష్టం.?

- ఓటింగ్ సరళిపై పార్టీల ధీమా
- సామాజిక తరగతుల ఓటింగ్‌పై లెక్కలు
- అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్..

నవతెలంగాణ -మిర్యాలగూడ

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2018 ఎన్నికల కంటే పోలింగ్ శాతం తగ్గింది. మునుగోడు, తుంగతుర్తి మినహా మిగిలిన పది స్థానాల్లో గతంతో పోల్చితే ఒకటి, రెండు శాతం ఓట్ల శాతం తగ్గింది. గతంలో కంటే ఓట్లు తక్కువ నమోదు కావడంతో ఏ పార్టీకి నష్టం కలుగుతుందోనని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఎన్నికల్లో అత్యల్పంగా సూర్యాపేటలో 79.95శాతం పోలింగ్ నమోదయింది. 2018లో 87.08 శాతం ఓట్లు నమోదు కాగా, 7.13శాతం ఓట్లు తక్కువగా పడ్డాయి.

మునుగోడులో అత్యధికంగా 91.51శాతం పోలింగ్ నమోదుకాగా, గతంలో 91.30శాతం నమోదు అయింది. గతంతో పోలిస్తే 0.21 శాతం అధికంగా ఓటు నమోదు అయ్యాయి. తుంగతుర్తి నియోజకవర్గంలో 2018లో 86.33శాతం ఓటు నమోదు కాగా ఎన్నికల్లో 87.51 శాతం నమోదయింది. అంటే గతంలో కంటే 1.18 శాతం అధికంగా ఓట్లు నమోదయ్యాయి. కాగా, సామాజిక వర్గాల వారీగా తమ పార్టీకి నమోదైన ఓట్లను అంచనాలు వేసుకుంటూ గెలుపోటములు నిర్ణయించుకుంటున్నారు. తగ్గిన ఓట్లు అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ద.మ.రైల్వేకు రెండు అవార్డులు

- హర్షం వ్యక్తంచేసిన జీఎమ్ అరుణ్‌కుమార్ జైన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సివిల్ ఇంజనీరింగ్, నిర్మాణ రంగాల్లో రెండు పెర్ఫార్మెన్స్ ఎఫిషియెన్సీ షీల్డ్స్-2023 అవార్డుల్ని దక్షిణ మధ్య రైల్వే గెలుచుకుంది. 2022-23లో సాధించిన ప్రగతికి గుర్తుగా ఈ అవార్డుల్ని అందచేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనిపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 15న ఢిల్లీలో జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, ఆ శాఖ సహాయ మంత్రి రావు సాహెబ్ చేతుల మీదుగా ఈ అవార్డుల్ని అందుకోనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. దక్షిణ మధ్య రైల్వే గతేడాది రైలు నెట్‌వర్క్‌కు 383 కిమీలను జోడించడంతో ఈ అవార్డులకు ఎంపిక జరిగిందని తెలిపారు.

### తుఫాన్‌పై సమీక్ష

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మిచాంగ్' తుఫాను పరిస్థితిపై దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ అర్ ధనుంజయులు సమీక్షా సమావేశం నిర్వహించారు. తుఫాను పరిస్థితుల దృష్ట్యా పాటించాల్సిన జాగ్రత్తలపై విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్ల లోని వివిధ విభాగాల ముఖ్య అధికారులతో మాట్లాడారు. అవసరమైన భద్రత, రక్షణ ఏర్పాట్ల చర్యల్ని వేగవంతం చేయాలన్నారు. నిరంతర పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ట్రాక్‌లపై పెట్రోలింగ్, బ్రిడ్జీల వద్ద వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు.

### ప్రయాణికులకు సూచన

ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని దక్షిణ కోస్తా ప్రాంతంలో తుఫాను వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, వచ్చే రెండ్రోజుల్లో ఆ ప్రాంతాల్లోని రైలు సర్వీసుల ప్రణాళికల్లో మార్పులు జరిగే అవకాశం ఉన్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. తీర ప్రాంతాల్లోలో భారీ వర్షాలు, వేగంగా వీచే గాలులు ప్రభావంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ రూట్లలోని రైళ్లను రీషెడ్యూల్ చేయడం లేదా పాక్షికంగా రద్దు చేయబడతాయని వివరించారు. రైలు ప్రయాణీకులు సహకరించాలని కోరారు.

## 10న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

- వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పథకం ఈనెల 10న రాతపరీక్ష జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఎ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. యూజర్‌ఐడీ, పాస్‌వర్డ్‌తో హాల్‌టికెట్లను https//bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

# సాగర్ ప్రాజెక్టు ఘటన వెనుక కుట్రను ఛేదించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి





నవతెలంగాణ-మిర్యాలగూడ

నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై జగన్ ప్రభుత్వ చర్య వెనుక దాగిన రాజకీయ కుట్రను ఛేదించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. శత్రురాజ్యం పైకి సేనలతో దండయాత్ర చేసినట్టుగా ఏపీ ప్రభుత్వం పోలీసులతో సాగర్ ప్రాజెక్టుపై ఉన్న కెమెరాలను ధ్వంసం చేయించి 13 గేట్ల వరకు మాదేనని ఆధీనంలోకి తీసుకోవడం క్షమించరాని విషయమన్నారు. జీవో ప్రకారం కృష్ణా నదిలో నీటివాటా ఎంత అనేది స్పష్టంగా పేర్కొనడం జరిగిందన్నారు.

వివాదాలు తలెత్తినప్పుడు కృష్ణా రివర్ బోర్డు కమిటీకి ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకుంటారని అన్నారు. కానీ, నిబంధనలను అతిక్రమించి ఏపీ ప్రభుత్వం తీసుకున్న చర్యల వెనుక మర్మమేంటనేది ప్రజలు గ్రహించాలన్నారు. త్వరలో ఏపీలో భావోద్వేగాలను రెచ్చగొట్టే విధంగా రాజకీయ నాటకానికి తెరలేపినట్టుగా భావించాల్సి వస్తుందన్నారు. భారీ సంఖ్యలో ఏపీ పోలీసులు ప్రాజెక్టుపై దాడి చేస్తే కనీసం తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోకుండా నిద్ర నటించిందని విమర్శించారు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. కేంద్రం ఆధీనంలోని రివర్‌బోర్డు సభ్యులు సైతం చోద్యం చూడటం వెనుక బీజేపీ హస్తం కూడా ఉన్నట్టు అనుమానించాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 145 టీఎంసీల నీరు మాత్రమే ఉండగా.. అందులో 130 టీఎంసీల కనిష్ట నీటిమట్టంగా నిల్వ ఉంచాల్సి ఉందన్నారు. మిగతా 15టీఎంసీల నీటిని మంచినీటి అవసరాలకు రెండు రాష్ట్రాల ప్రజలు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. వచ్చే ఏడాది వరకు ఇదే నీటిని వాడుకోవాల్సి ఉన్నందున నీటి వినియోగంపై ఆచితూచి వ్యవహరించాల్సి ఉండాల్సిందిపోయి రాజకీయ ప్రయోజనాల కోసం నీటి మంటలు సృష్టించడం మంచిది కాదన్నారు. ప్రాజెక్టుల ప్రయోజనాలను పరిరక్షించే విధంగా కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు వ్యవహరించాలని కోరారు. సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు డబ్బికార్ మల్లేష్, జగదీశ్‌చంద్ర, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి తదితరులు ఉన్నారు.

# సచివాలయంలో విజయవంతంగా ప్లాస్టిక్ నిషేధం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్యావరణానికి ప్రమాదంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని సచివాలయం ప్రాంగణంలో నిషేధించడంలో విజయం సాధించామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి చెప్పారు. సహకరించిన అధికారులను, సిబ్బందిని అభినందించారు. మూడో తేదీ నాటికి పూర్తిస్థాయిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత ప్రదేశంగా సచివాలయం మారబోతున్నదన్నారు. శుక్రవారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ అన్ని హెచ్‌ఓడీలలో స్టీల్, పింగాణీ, క్లాత్, జూట్ వస్తువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలని ఆమె సూచించారు. పలు సూచనలు చేశారు. గతంలో సచివాలయ ప్రాంగణంలో ప్రతి రోజు మూడు వేలకు పైగా సింగిల్ యూజ్ వాటర్ బాటిల్స్ వినియోగించే వారనీ, దాన్ని రెండు వందలలోపు వరకు తగ్గించగలిగామని సీఎస్ పేర్కొన్నారు. సచివాలయం ఆవరణలో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు 32 ఆక్వాగార్డు వాటర్ డిస్పెన్సర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. సచివాలయంలోని రోజువారీ వ్యర్థపదార్థాలను రీసైక్లింగ్ చేసి వినియోగదారులకు ఉపయోగపడే ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. సచివాలయ ప్రాంగణాన్ని జీరో వేస్ట్ క్యాంపస్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషిచేయాలనీ, గ్రీన్ కియాస్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

# సర్వత్రా ఉత్కంఠ

- పోలింగ్ సరళిపై నాయకుల లెక్కలు
- అందరి దృష్టి బాన్సువాడపైనే !

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలో 68.5శాతం పోలింగ్ నమోదయ్యింది. పోలింగ్ సరళిపై ఉమ్మడి నిజామాబాద్‌లో అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. ఫలితాలు ఆదివారం వెలువడనుండడంతో అంతటా ఉత్కంఠ నెలకొంది. తమకు ఎన్ని ఓట్లు వచ్చాయోనని అభ్యర్థులు బేరీజు వేసుకుంటూ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ఓటర్లు వారి మనసులో మాట చెప్పకుండా వారు ఎవరికి ఓటు వేయాలనుకున్నారో వారికే ఓటు వేసి తమ పని తాము కానిచ్చారు. ఓటర్లు మీ పార్టీకే ఓటు వేసామంటూ చెబుతున్నా నాయకులు నమ్మలేని పరిస్థితి ఎదురైంది. నాయకులు పైకి గంభీరంగా ఉన్న లోలోపల మదన పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా బోధన్ నియోజకవర్గంలో ఎస్సీ, బిసి, మైనార్టీ ఓట్లే అభ్యర్థి విజయానికి కీలకం. ప్రభుత్వం తీరుపై ఓటర్లు వ్యతిరేకత కలిగి ఉండడంతో బీఆర్ఎస్ పార్టీకి ఆశించినంత ఓట్లు పడలేదని ప్రచారం కొనసాగింది. ఎక్కడ చూసినా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తమ పార్టీలకు ఎన్ని ఓట్లు వచ్చాయంటూ టెన్షన్ పడే సందర్భాలు కనపడ్డాయి. బిజెపి ప్రచారం జోరుగా సాగినా మూడో స్థానానికి పరిమితం అయ్యే ఉన్నట్టు సమాచారం. అందరి దృష్టి బాన్సువాడ నియోజకవర్గం పైనే కేంద్రీకృతమైంది. అభివృద్ధి, సంక్షేమం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అనుకూలంగా ఉన్నా మార్పు, కొత్త వారికి అవకాశం ఇవ్వాలనే వాదన కాంగ్రెస్‌కు కలిసి వస్తుందా అన్న చర్చ నడుస్తోంది. ఇరువురు అభ్యర్థులు గెలుపు ధీమాలో ఉన్నారు. ఇక్కడ ఎవరు గెలిచినా రెండు మూడు వేల ఓట్ల తేడాతోనే గెలిచే అవకాశాలున్నాయి.

# మార్పు కోరిన ఓటరు

- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో వారికి ఎదురుగాలి తప్పదా?
- కొడంగల్ కాంగ్రెస్‌కే.. • ఈవీఎంల వద్ద గట్టి భద్రత

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ప్రభుత్వ వ్యతిరేకత.. అభ్యర్థుల వైఖరి ఓటర్లను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అధికార పార్టీ నాయకులు ఎంత ప్రచారం చేసినా.. ప్రజల చెవికి ఎక్కలేదని నిన్నటి పోలింగ్ సరళిని బట్టి వ్యక్తమవుతోంది. పోలింగ్ తీరుపై విశ్లేషకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలకు సైతం ఎదురుగాలి తప్పేలా లేదన్న అభిప్రాయం వ్యక్తపరిచారు. ముఖ్యంగా యువత, నిరుద్యోగులు అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టించారని చర్చ నడుస్తోంది.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో అలంపూర్, అచ్చంపేట నియోజకవర్గాలను ఎస్సీలకు కేటాయించారు. అచ్చంపేటలో ప్రభుత్వ వ్యతిరేకతతోపాటు గువ్వల తీరు బాగా లేదనే చర్చ ఆ పార్టీలోనే ఉంది.అలంపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి గతంలో ఓడిన సానుభూతి ఉంది. అదే పనిచేసే అవకాశం ఉందని, ఓటర్లు ఆ అభిప్రాయాన్ని పోలింగ్ రూపంలో తెలియజేశారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిని మార్చడం కూడా వ్యతిరేకత ఉండొచ్చని విశ్లేషకులు అంటున్నారు. మహబూబ్‌నగర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై అనేక ఆరోపణలు ఉన్నా అక్కడ టఫ్‌ఫైట్ నడిచిందని తెలుస్తోంది. వనపర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి నిరంజన్‌రెడ్డిపైనా అనేక ఆరోపణలు ఉన్నాయి.

అయినా ఓటర్లు నిరంజన్‌రెడ్డి వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థికి చిన్నారెడ్డి సహకరించకపోవడం వల్ల ఓట్లు భారీగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆ పార్టీ నేతల్లో ఉంది. కల్వకుర్తి, అచ్చంపేట, అలంపూర్, కొల్లాపూర్, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. వనపర్తి గద్వాల, నారాయణపేట జడ్చర్లలో ఎవరు గెలిచినా తక్కువ ఓట్లతో బయట పడతారు.

నారాయణపేట, దేవరకద్ర, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు అనుకూల వాతావరణం నెలకొంది. ఏదేమైనా బీఆర్ఎస్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. నియోజకవర్గాల వారీగా ఈవీఎంల వద్ద గట్టి భద్రత ఏర్పాటు చేశారు.

# నర్సింగ్‌రావు నిబద్ధత కలిగిన జర్నలిస్టు..

- ఆయన మృతితో ధర్నాచౌక్ చిన్నబోయింది
- జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం
- సంతాప సభలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీనియర్ జర్నలిస్టు ఎర్రం నర్సింగ్‌రావు తన వృత్తిని నిబద్ధతతో నిర్వహించారని పలువురు వక్తలు గుర్తుచేశారు. టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య అధ్యక్షతన నర్సింగ్‌రావు సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. 'ఆయన మృతి కుటుంబానికే కాదు..జర్నలిస్టుల లోకానికి కూడా తీరని లోట'ని గుర్తుచేసుకున్నారు.25ఏండ్లుగా జర్నలిజం వృత్తిలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారని వివరించారు. సమాజ హితం కోసం కలం, గళం అనే నమ్మకంతో నికరంగా పనిచేశారన్నారు.తెలంగాణ టాడీ టాపర్స్ కార్పొరేషన్ చైర్మెన్ పల్లె రవికుమార్ మాట్లాడుతూ ధర్నాలు, ఆందోళనలు, పోరాటాలు ఎక్కువగా బాధిత వర్గాలకు చెందిన వారే చేస్తారనీ, ఆ వర్గానికి చెందిన నర్సింగ్‌రావు ధర్నా చౌక్‌లో ఉండటం వల్ల వారి వార్తలను అద్భుతంగా రాశారని చెప్పారు. నమ్మిన విలువల కోసం పని చేసే వ్యక్తిత్వమే ఆయనకు పేరు తెచ్చిపెట్టిందన్నారు. ప్రజల కోసం సమాజం కోసం పనిచేస్తున్న వారి పట్ల సమాజంలో ఎప్పటికీ గౌరవం ఉంటుందన్నారు. జర్నలిస్టులను అందరూ అవసరాలకు తమ ఎదుగుదల కోసం వాడుకుంటున్నారన్నారు. దుర్భరమైన వారి బతుకులను ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. జర్నలిస్టులకు ఫించన్ చనిపోతే రూ.5లక్షల ఆర్థిక సాయం, ఇండ్ల స్థలాలు తదితర హక్కుల కోసం జర్నలిస్టు సంఘాలు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా పత్రికలకు ఇచ్చే ప్రకటనల ఆదాయంలో ఒకటి నుంచి రెండు శాతం జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్‌కు అందేలా నిర్ణయాన్ని తీసుకునేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు. అప్పుడు ఎవరిపైనా జర్నలిస్టులు ఆధారపడాల్సిన అవసం ముండదన్నారు. హైదరాబాద్‌లో జర్నలిస్టుల ఇండ్ల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కలిసి ముందుకు పోవాలన్నారు.ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు, ఎన్ఏజే జాతీయ నాయకులు ఏ అమరయ్య మాట్లాడుతూ కార్పొరైటేజషన్ ప్రభావం జర్నలిజం వృత్తిపై కూడా ప్రబలంగా ఉందన్నారు. జర్నలిస్టుల సేవలు కావాలి కానీ..వారి సేవలు అవసరం లేదన్నట్టుగా యాజమాన్యాలు ఉంటున్నాయని వివరించారు. వీరి సంక్షేమం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి. బసవపున్నయ్య మాట్లాడుతూ నర్సింగ్‌రావు జీవితం జర్నలిజం కుటుంబంలో తెరిచిన పుస్తక మన్నారు .ఆయన మరణం జర్నలిస్టుల లోకం జీర్ణించుకోలేక పోతున్నదన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకు నేందుకు ఫెడరేషన్ పరంగానే కాకుండా ప్రభుత్వం నుంచి సాయాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు.కార్యక్రమంలో నర్సింగ్‌రావు కూతురు రూప,ఐఎఫ్‌టీయూ కార్యదర్శి ఎస్ఎల్‌పద్మ,ఎన్ఏజే సెక్రటరీ జనరల్ కొండయ్య, హెచ్‌యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి అరుణ్‌కుమార్, బి జగదీశ్వర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఆఫీసు బేరర్లు పిల్లి రాంచందర్, ఈ చంద్రశేఖర్, గుడిగ రఘు, కార్యవర్గ సభ్యులు బీవీఎన్ పద్మరాజు, మూర్తి తదితరులు ప్రసంగించారు.

## మంత్రి ఈశ్వర్‌పై ఎలక్షన్ కేసు కొట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర హైకోర్టులో మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఊరట లభించింది. జగిత్యాల జిల్లా ధర్మపురి నుంచి ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికలు చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. 2018లో జరిగిన ఎన్నికల్లో ఈశ్వర్ 441 ఓట్ల మెజార్టీతో గెలిచారు. వీవీ ప్యాట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయనీ, ఫలితంగా కొప్పుల ఈశ్వర్ ఎన్నికైనట్టుగా అధికారులు ప్రకటించడం చెల్లదని కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ చేస్తున్న అభియోగాలకు ఆధారాలు చూపలేదని జస్టిస్ లక్ష్మణ్ శుక్రవారం తీర్పు చెప్పారు. గత ఎన్నికల్లో కరీంనగర్ జిల్లాలోని ధర్మపురి నియోజకవర్గం నుంచి మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీ చేసి కేవలం 441 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌పై గెలిచారు. దీంతో వీవీ ప్యాట్ల ఓట్ల లెక్కింపు వ్యవహారంపై పిటిషనర్ వాదనలకు ఆధారాలు లేవని తీర్పులో పేర్కొన్నారు.

## టూరిజం కార్పొరేషన్ ఎండీ సస్పెన్షన్‌పై స్టేకు నిరాకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి తిరుమల వెళ్లారనే ఫిర్యాదు ఆధారంగా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ బి.మనోహర్‌రావును సస్పెండ్ చేస్తూ ఎన్నికల సంఘం అధికారులు తీసుకున్న నిర్ణయం అమలు నిలిపివేతకు హైకోర్టు నిరాకరించింది. స్టే జారీ చేయలేమని ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ చెప్పింది. టూరిజం కార్పొరేషన్ ద్వారా తిరుమల దర్శనంటిక్కెట్ల సంఖ్య పెంపు గురించి చర్చించే నిమిత్తం తిరుమల వెళ్లారనీ, మంత్రికి ప్రొటోకాల్ నిమిత్తం వెళ్లలేదని ఎండీ లాయర్ చెప్పారు. తిరుమల అధికారులతో నిర్వహించిన సమావేశం వివరాలను అందజేయాలని టూరిజం ముఖ్య కార్యదర్శిని ఆదేశించిన హైకోర్టు విచారణను డిసెంబర్ 4కి వాయిదా వేసింది.

## ఇద్దరు ఉద్యోగులకు నాన్‌బెయిలబుల్ వారెంట్స్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని శామీర్‌పేట ఎంపీడీవో, మజీద్‌పురా విలేజ్ సెక్రటరీలకు హైకోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఎన్‌బీడబ్ల్యూపై చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్పీని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీ సెక్రటరీపై జనవరి 23న ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోలేదంటూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండలం మజీద్‌పూర్‌కు చెందిన అశోక్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. గతంలో ఆదేశిస్తే అధికారులు రిపోర్టు ఇవ్వలేదు. ఆ తర్వాత జరిగిన విచారణలో శామీర్‌పేట ఎంపీడీవో, మజీద్‌పురా విలేజ్ సెక్రటరీలు స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇద్దరూ విచారణకు హాజరు కాకపోవడంతో నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేసింది. గత జూన్‌లో ఆదేశిస్తే వివరాలు ఇవ్వకపోగా ఇప్పుడు నవంబర్ 30న ఎన్నికలను కారణంగా చెబుతున్నారని పిటిషనర్లను ప్రశ్నించింది.

సస్పెండ్ చేయాలని ఆదేశిస్తే దారికి వచ్చేవారని వ్యాఖ్యానించింది. ఎంపీడీవో, పంచాయతీ సెక్రటరీలకు నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది.

## గ్రామాల్లో ఉపాధి అవసరం

- ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి
- వెల్లడిస్తున్న ఎంజీఎన్ఆర్ఈజీఏ గణాంకాలు

**న్యూఢిల్లీ:** భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నాయా? మోడీ సర్కారు ఈ విషయంలో విఫలమైందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) కింద నమోదైన గణాంకాలే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఎంజీఎన్ఆర్ఈజీఏ కింద పని కోసం డిమాండ్ పెరిగిందనీ, అయితే, ఇది పెరిగిన నిరుద్యోగాన్ని, గ్రామాల్లో ఉపాధి లేమిని సూచిస్తున్నదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మోడీ పాలనలో గ్రామీణ భారతం ఉపాధి లేక వెలవెలబోతున్నదని అంటున్నారు. ముఖ్యంగా, యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నదని చెప్తున్నారు.

రాజస్థాన్‌లో కోవిడ్-19 మహమ్మారి గరిష్ట స్థాయికి చేరుకున్నప్పుడు.. రాష్ట్రంలో ఉపాధి హామీకి డిమాండ్ అత్యధికంగా ఉన్నది. ఒక ప్రయివేటు సంస్థ సేకరించిన డేటా ప్రకారం.. దాదాపు 70 లక్షల మంది ప్రజలు పనిని డిమాండ్ చేశారు. 2022 ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు ఎంఎస్ఆర్ఈజీఏ కింద ఉపాధికి తక్కువగా ఉన్నది. ఇది ఆ కాలంలో ఉపాధి అవకాశాల మెరుగుదలను సూచిస్తుందని నిపుణులు తెలిపారు. అయినప్పటికీ, ఈ ఏడాది జూన్‌లో ఇది గరిష్ట స్థాయికి చేరుకున్నది. దాదాపు 45 లక్షల మంది ప్రజలు పనిని కోరుతున్నారు. సెప్టెంబరు నాటికి కేవలం 19 లక్షల మంది ఈ కార్యక్రమం కింద పనిని డిమాండ్ చేశారు.

మధ్యప్రదేశ్‌లో ఎంజీఎన్ఆర్ఈజీఏ కింద పని కోసం 2020, జూన్‌లో అత్యధిక డిమాండ్ ఉన్నది. 48 లక్షల మంది ప్రజలు పనిని డిమాండ్ చేశారు. 2021 జూన్‌లో 49 లక్షల మంది పనిని డిమాండ్ చేశారు. ఈ ఏడాది మార్చి నాటికి కేవలం పది లక్షల మంది మాత్రమే ఉద్యోగాల కోసం వెతుకుతున్నారు. మేలో పని కోరుతున్న వారి సంఖ్య 34 లక్షలకు పెరిగింది. సెప్టెంబర్ నాటికి 16 లక్షలకు పడిపోయింది.

ఛత్తీస్‌గఢ్‌లో 2020, మేలో గరిష్టంగా 47 లక్షల మంది పనిని కోరారు. 2021, ఫిబ్రవరిలో 33 లక్షల మంది ప్రజలు, ఈ ఏడాది మార్చిలో 26 లక్షల మంది ప్రజలు పనిని కోరారు. అయితే, సెప్టెంబర్‌లో ఇది కేవలం 218,659 మంది పనిని కోరుతున్నట్టు డేటా చూపింది. మిజోరంలో, 2021, మార్చిలో కేవలం 824 మంది ఎంజీఎన్ఆర్ఈజీఏ కింద పనిని డిమాండ్ చేశారు.

## తగ్గని తెలంగాణ ఉద్యమ చైతన్యం

- ఊపిరి పీల్చుకున్న ప్రజలు : ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రజల ఉద్యమ చైతన్యం ఏ మాత్రం తగ్గలేదని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు 1978లో ఎమర్జెన్సీ తర్వాత నిర్వహించిన ఎన్నికలను తలపించాయని తెలిపారు. పాలకులపై ప్రజాస్వామ్య పద్ధతిలో తిరుగుబాటు చేశారని చెప్పారు. అధికార పార్టీలో కింది స్థాయి నాయకుని వరకు పాకిన దోపిడీ, దౌర్జన్యంగా ఆస్తులను లాక్కోవడాన్ని ప్రజలు నిరసించారన్నారు. పరిమితంగా అవకాశమిచ్చిన ప్రజలు సమయం చూసి బుద్ధి చెప్పారన్నారు. ప్రజలతో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఎలా ఉంటుందో అదే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల రూపాల్లో వెల్లడి కానుందని చెప్పారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణకు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడాన్ని స్వాగతించారు. ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, దోపిడీ అంతం దిశగా తమ ప్రయాణం కొనసాగుతుందని తెలిపారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే ప్రజల నుంచి మరోసారి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ కు మద్దతుగా తాను రాష్ట్రవ్యాప్తంగా తిరిగితే ప్రభుత్వ వ్యతిరేకత చాలా ఎక్కువగా కనిపించిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్ పోవాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. 18 నుంచి 35 ఏండ్ల మధ్య ఉన్న ఓటర్లు 35 శాతమున్నారనీ, వీరు కాంగ్రెస్ వైపు తిరగడమే కాకుండా తమ కుటుంబాలను, గ్రామాలను కూడా అటుగా మళ్లించారని తెలిపారు. నిరుద్యోగులు రాజకీయ శక్తిగా మారడం జాతీయ రాజకీయాల్లోనూ కీలక పరిణామంగా అభివర్ణించారు. జాతీయ రాజకీయాల్లోనూ నిరుద్యోగులు సత్తా చాటే అవకాశముందన్నారు. చంద్రబాబు కాలంలో సరళీకృత విధానాలకు వ్యతిరేకంగా పౌర వేదికలు ఉద్యమించాయనీ, నాడు వాటితో కలిసి కాంగ్రెస్ ముందుకెళ్లిందని గుర్తుచేశారు. తిరిగి 2023లో పౌర వేదికల సంఖ్య, బలం, ప్రచారం పెరిగిందన్నారు.

### కేంద్రం పరిష్కరించాలి

కృష్ణా జలాల వివాదాన్ని రేకెత్తించటం ద్వారా పొందేందుకు లబ్ది పొందాలని తెలంగాణ సీఎం కేసీఆర్, ఆంధ్ర సీఎం వై.ఎస్.జగన్ కుట్రలు పన్నారని కోదండరాం ఈ సందర్భంగా విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్య చట్ట వ్యతిరేకమనీ, న్యాయబద్ధంగా నీటిని పొందే అవకాశమున్నా... ఇష్టానుసారంగా వ్యవహరించడం తక్షణ రాజకీయ ప్రయోజనం కోసమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. చట్టం అమలు కోసం కేంద్రం స్పందించాలని డిమాండ్ చేశారు.

ఈ మేరకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు, కేంద్ర జల సంఘానికి లేఖలు రాయనున్నట్టు తెలిపారు.

సంపాదకీయం

# ఎన్నికల అ(వ్య)వస్థ!



ఎన్నికలు ముగిసాయి. ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. వీటిలో అత్యధికం హస్తానికే మొగ్గు చూపుతూ తమ అంచనాలను వెల్లడించాయి. ఇవి ఎంత వరకు నిజమవుతాయో తెలియదుగానీ, వీటితో నిమిత్తం లేకుండా ప్రధాన పోటీదారులు ఎవరికివారు తమదంటే తమదే విజయమని బీరాలు పలుకుతున్నారు. ఈవీఎంలలో నిక్షిప్తమైవున్న ప్రజాతీర్పు రేపు వెలువడాల్సి వుండగానే... ఎల్లుండే క్యాబినెట్ అని ఒక పక్షం, తొమ్మిదిన ప్రమాణస్వీకారం, అదేరోజు క్యాబినెట్ అని మరోపక్షం ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తున్న తీరు విస్తుగొలుపుతోంది! ఇటువంటి రాజకీయా లన్నీ అసంబద్ధ గారడీలే అనడానికి ఇదో తాజా ఉదాహరణ. ఇదిలా ఉండగా దీనికి మించిన వాదనలూ ప్రతి వాదనలు, సవాళ్లూ ప్రతిసవాళ్లతో మీడియా ఈ తతంగాన్ని మరింత రక్తికట్టిస్తోంది. జనంలో కూడా ఇప్పుడు ఏ ఇద్దరు కలిసినా ఇదే చర్చ. తెల్లవారితే గెలిచేదెవరో ఓడేదెవరో తేలిపోతోంది. అయినా ఇదో ప్రహసనం!

ఎన్నడూ ఎండకన్నెరుగని నేత గణమంతా వీధివీధీ తిరిగి జనాన్ని తమ ఉద్రేక ప్రసంగాలతో వూగించాక, మతాన్ని రెచ్చగొట్టి, కులాన్ని మభ్యపెట్టి, ఆలోచనలను జోకొట్టి... ప్రలోభాల్లో ముంచెత్తి, స్వేచ్ఛగా ఎంచుకునే అవకాశమే లేకుండా చేశాక ప్రజలకు మరోదారేది? చివరికి వారిని డబ్బులిస్తే తప్ప ఓటు వేయలేమనే స్థితికి దిగజార్చారు కదా ఈ "రాజకీయులు"..! అయినా చోద్యం చూస్తూ ప్రవచనాలు వల్లించడమే తప్ప ఈ అవాంఛనీయతను నివారించలేని ఎన్నికల వ్యవస్థది మరో అవస్థ.

ఎన్నికలన్నాక ఎవరో ఒకరు గెలవడం, మరొకరు ఓడటం సహజం. కానీ తరువాత జరిగేదేమిటి? జనానికి ఒరిగేదేమిటి? ఈ ప్రశ్నకు ఏ మీడియా చర్చలోనూ తావులేకపోవడం గమనార్హం. నిజంగా ఎన్నికలైపోయినాక ఏం జరుగుతుంది? దీనికి సమాధానం ప్రఖ్యాత పాత్రికేయులు కె.ఎన్.వై.పతంజలిగారి మాటల్లో చెప్పుకోవాలంటే..

**"ఎన్నికలైపోయాక దేశం**
**దగాపడిన ఓ ఆడకూతురిలా ఉంటుంది.**
**చిరిగిపోయిన ప్రచార పత్రాల గుట్టలా ఉంటుంది.**
**ఎన్నికలైపోయినాక ఏమవుతుందంటే...**
**మనకు భోజనం లేదని గుర్తొస్తుంది.**
**మనకు ఉపాధిలేదని తెలిసొస్తుంది.**
**తెలిసి తెలిసీ అయిదేళ్లకోసారి మోసపోవడం గూర్చి ఏడుపొస్తుంది.**
**ఎన్నికల పతాకాలు విప్పేసిన తరువాత, గుడారాలు పీకేసిన తరువాత,**
**పట్టాభిషేక మహోత్సవాలు ముగిసిన తరువాత...**
**తుపాకీ ఇంకా మనకేసే గురిపెట్టి ఉందని తెలుస్తుంది.**
**మన ఓటే మనల్ని కాటేసిందని తెలుస్తుంది."**

నిజానికి ఈ దేశంలో ప్రజాస్వామ్యమనేది ప్రజలందరికీ ప్రత్యక్షంగా అనుభవంలోకొచ్చే ఒకే ఒక సందర్భం ఎన్నికలు. ఈ సందర్భాలు అనేకం వచ్చాయి, వస్తూనే ఉంటాయి. అయితే ఏ సందర్భంలోనూ ఓటును స్వేచ్ఛగా స్వతంత్రంగా వినియోగించుకోలేని దుస్థితి మన ప్రజలది. ప్రతీ సందర్భంలోనూ ప్రధాన పోటీదారులంతా ప్రజా వ్యతిరేకులే అయితే ఏం చేయాలి? ఎవరికి ఓటేయాలి? "ఏ రాయి అయితేనేం పల్లూడగొట్టుకోవడానికి" అన్నట్టుగా.. ఇష్టమున్నా లేకున్నా వారిలోనే ఎవరినో ఒకరినిని ఎంచుకోక తప్పని స్థితి. ఇది చాలదన్నట్టు గుట్టలు గుట్టలుగా కరెన్సీ కట్టలు, సందుసందునా మందు బాటిళ్లు మూకుమ్మడిగా దాడి చేస్తుంటే ఎటూ పాలుపోని స్థితి! ఎన్నడూ ఎండ కన్నెరుగని నేత గణమంతా వీధివీధీ తిరిగి జనాన్ని తమ ఉద్రేక ప్రసంగాలతో వూగించాక, మతాన్ని రెచ్చగొట్టి, కులాన్ని మభ్యపెట్టి, ఆలోచనలను జోకొట్టి... ప్రలోభాల్లో ముంచెత్తి, స్వేచ్ఛగా ఎంచుకునే అవకాశమే లేకుండా చేశాక ప్రజలకు మరోదారేది? చివరికి వారిని డబ్బులిస్తే తప్ప ఓటు వేయలేమనే స్థితికి దిగజార్చారు కదా ఈ "రాజకీయులు"..! అయినా చోద్యం చూస్తూ ప్రవచనాలు వల్లించడమే తప్ప ఈ అవాంఛనీయతను నివారించలేని ఎన్నికల వ్యవస్థది మరో అవస్థ. అన్నింటికీ మించిన విషాదమేమంటే... ఈ అశుద్ధాలన్నీ కలిసి నిజాయితీగా ప్రజలకోసం బరిలో నిలిచే నేతలను వారి దరికే చేరనివ్వడం లేదు. ప్రజల పట్ల నిబద్ధతతో నిజాయితీతో విలువలకు, విధానాలకు కట్టుబడి నడుచుకునే రాజకీయ శక్తులకు ఇది అవరోధంగా మారడం విచారకరం. ఇది తొలగనంతకాలం గెలిచేదెవరైనా ప్రజలు ఓడిపోతూనే ఉంటారు.

బూర్జువా పార్టీలు ఏవైతేనేం, అభ్యర్థులు ఎవరైతేనేం... ఎన్నికల బరిలో నిలువడానికి వాళ్లకున్న ఆస్తులూ, వాటి వెనుకున్న చీకటి వ్యాపారాలే కదా ప్రామాణికాలు! అందుకే గెలిచేదెవరైనా ప్రజాభిప్రాయానికి ఆకాంక్షలకు అవకాశమేలేని "ప్రజాస్వామ్యం" వర్ధిల్లుతోందీ దేశంలో! ఫలితంగా ప్రజాస్వామ్య ప్రక్రియల్లో భాగంగా పరిష్కారం కావాల్సిన ప్రతి చిన్న సమస్యకూ ప్రజలు రోడ్ల మీదికి వచ్చి పోరాడాల్సి వస్తోంది. ఉదాహరణకు గడిచిన ఐదేండ్ల కాలంలో రాష్ట్రంలోగాని, దేశంలోగాని వీధుల్లో జరుగుతున్న పోరాటాల్లోని డిమాండ్లన్నిటినీ ఒక్కచోట చేర్చి చూస్తే... అవన్నీ రాజ్యాంగ పరిధిలోనివే. అసలు వాటిని ప్రజలు అడగనక్కరలేదు. వాటికవే పరిష్కారం కావాల్సినవి. కానీ జరుగుతున్నదేమిటీ? ఏనాడైనా అసెంబ్లీల్లో, పార్లమెంట్‌లో ఈ డిమాండ్లు కనీస చర్చకు నోచుకుంటున్నాయా? మనమేదో రాజ్యాంగబద్ధ పాలన, ప్రజాస్వామ్య ప్రక్రియంటూ ముచ్చట పడుతుంటాం కానీ... ఎన్నికల్లోనే కాదు, వాటిద్వారా ఏర్పడే చట్ట సభల్లో, పాలనా ప్రక్రియల్లో కూడా ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు చోటులేకుండా పోతోంది. ఈ చేదు నిజాన్ని గుర్తించి మేలుకోకపోతే చూపుడు వేలుకు అంటిన సిరా చుక్క మన పౌరధర్మాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుంది.

# వికలాంగుల సంక్షేమ లక్ష్యాలు నెరవేరేనా?

వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కల్పించి వారిని సమాజాభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి (యుఎన్‌ఓ) 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరంగా ప్రకటించింది. వికలాంగులు సమాజంలో గౌరవప్రదంగా జీవిస్తూ, సకలంగులతో సమానంగా అన్ని హక్కులు పొందే విధంగా చైతన్యపరిచేందుకు 1992 డిసెంబర్ 3 నుండి అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం జరుపుకుంటున్నాం. యుఎన్‌ఓ సభ్య దేశాలన్నీ వికలాంగుల సంక్షేమానికి చర్యలు తీసుకునే విధంగా ఐక్యరాజ్యసమితి రూపొందించిన వికలాంగుల హక్కుల ఒప్పంద పత్రంపై భారతదేశం కుడా సంతకం చేసింది. 2007 అక్టోబర్ 1న భారత ప్రభుత్వ క్యాబినెట్ సిఫార్సులతో రాష్ట్రపతి ఆమోదించారు.

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఆరుగురిలో ఒకరికి అంగవైకల్యం ఉంది. ఆరోగ్య అసమానతల వలన అనేకమంది వికలాంగులు చనిపోతున్నారు. సమాజంలో వివక్షత, అసమాన విధానాలు ప్రజల ఆరోగ్యాన్ని నిర్ణయించే అంశాలుగా ఉన్నాయి. ఆరోగ్య సంరక్షణలో నాణ్యత లేకపోవడం, ఆరోగ్య కార్యకర్తలు తక్కువ మంది ఉండడం వంటివి వికలాంగుల జీవితాలపై ప్రభావం చూపుతున్నాయి. ఆరోగ్య అసమానతల వలన వికలాంగులు మెరుగైన వైద్యం పొంద డంలో వెనకబడి ఉంటున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించేందుకు మంచి ఆరోగ్యం, శ్రేయస్సు సాధించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి. ఆరోగ్య సమానత్వం వారి హక్కు. కానీ వారు హింస, అవమానాలు, అన్యాయాలకు గురవుతున్నారు. ఫిలిప్పైన్స్, ఖతార్, బెలూచిస్తాన్, పాకిస్తాన్, దుబాయి, యూఏఈ దేశాల్లో నిర్వహిస్తున్న మోడల్ డిజెబిలిటీ సర్వేని ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో చేయాల్సిన అవసరం ఉంది. సహాయ పరికరాలు ప్రతి పదిమందిలో ఒకరికి మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఈ సర్వేలో తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2030 నాటికి సస్టైనబుల్



డెవలప్‌మెంట్ గోల్స్‌ను నిర్దేశించింది. వీటి ద్వారా వికలాంగులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వికలాంగుల్లో 80 శాతం మంది అభివృద్ధి చెందిన దేశాల్లో నివసిస్తున్నారు. 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వృద్ధుల్లో 46 శాతం మందికి వైకల్యం ఉందని అంచనా.

### రాజ్యాంగ ఫలాలు అందుకునే హక్కు లేదా?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 73 ఏండ్లు పూర్తయింది. రాజ్యాంగంలో పేర్కొన్న స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతత్వం వంటివి వికలాంగులకు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. ఆర్టికల్ 14 నుండి 19 వరకు సమాజంలో పౌరులందరూ సమానమేనని, ఎలాంటి వివక్షతలు ఉండరాదని పేర్కొంది. ఇవేవీ వికలాంగులకు దక్కడం లేదు. సమాజంలో నేటికీ వారు ద్వితీయ శ్రేణి పౌరులుగానే బతకాల్సి వస్తున్నది. వికలాంగులు అంటేనే చిన్న చూపు చూస్తున్నారు. విద్య, ఉద్యోగాల్లో సైతం వివక్షత కొనసాగడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఆదివాసీ, గిరిజనులు, వికలాంగుల హక్కులకోసం గళంవిప్పిన 90శాతం వైకల్యం కలిగిన ప్రొఫెసర్ సాయిబాబాను అరెస్టు చేసి జైల్లో పెట్టడం చూస్తున్నాం. దీంతో రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ వికలాంగులకు ఉందా అనే అనుమానం కలుగుతోంది. ఆర్టికల్ 41 ప్రకారం వికలాంగులకు ఆర్థిక స్వావలంబన కల్పించి వారిని అభివృద్ధి చేయాలని, పని కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే అని పేర్కొంది. ఇవేవీ అమలు కాకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం.

### విద్య, ఉద్యోగాల్లో వాటా ఎక్కడ ?

విద్య, ఉద్యోగాల్లో న్యాయమైన వాటా వికలాంగులకు దక్కకపోవడంతో అనేక మంది ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా మారుతున్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ నియామకల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. వికలాంగులకు ప్రత్యేక స్కూళ్లు, ప్రత్యేక శిక్షణ పొందిన టీచర్లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా అమలు కావడం లేదు. ఆటిజం, అంధత్వం, వినికిడి సమస్యతో బాధపడే విద్యార్థులకు ప్రత్యేక పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించాలని 2017 అక్టోబర్ 30న సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వికలాంగులకు చదువు చెప్పేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశిస్తున్నా పాలకులకు పట్టడం లేదు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఉమ్మడి రాష్ట్రంలో జరిగినటువంటి అన్యాయమే రెండు తెలుగు రాష్ట్రాలలోనూ కొనసాగుతున్నది.

### 21 రకాల వైకల్యాల గుర్తింపు ఎప్పుడు?

2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 21 రకాల వైకల్యాలను గుర్తించింది. కానీ వైకల్య ధవీకరణ పత్రాలు మాత్రం 1995 పిడబ్ల్యుడి చట్టం గుర్తించిన 7 రకాల వైకల్యాలకు మాత్రమే ఇస్తున్నారు. కండరాల క్షీణత, తలసేమియా, ఆటిజం, సెరిబ్రల్‌పాల్సీ వంటి తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులు సర్టిఫికెట్లు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారు. చట్టం అమల్లోకి వచ్చి 7 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఆ ఏడు రకాల వైకల్యాలకు మాత్రమే వైకల్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తున్నారు.

### అమలుకు నోచుకోని చట్టాలు

పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం అనేక చట్టాలను చేసింది. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, 2017 ఇంటర్ హెల్త్ కేర్, నేషనల్ ట్రస్ట్, ఆటిజం యాక్ట్, ఐక్యరాజ్యసమితి హక్కుల ఒప్పందం వంటి అనేక చట్టాలు దేశంలో వికలాంగుల సంక్షేమం కోసం అమలులో ఉన్నాయి. కానీ దేశ పాలకులకు చట్టాలను అమలు చేయాలనే చిత్తశుద్ధి కనిపించడం లేదు. పెట్టుబడిదారులకు సానుకూల వాతావరణం కల్పించాలనే పేరుతో కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్స్‌గా అమల్లోకి తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం వికలాంగుల చట్టాలను కూడా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 89, 92, 93 రద్దు చేసేందుకు, 1999 నేషనల్ ట్రస్టు సవరించేందుకు, దేశవ్యాప్తంగా ఉన్న తొమ్మిది నేషనల్ ఇన్‌స్టిట్యూషన్లను విలీనం కావించేందుకు చేసిన ప్రయత్నాలను ఎన్‌పిఆర్‌డి దేశ వ్యాప్త పోరాటాల ద్వారా తిప్పికొట్టింది.

### 'సుగమ్య అభియాన్ భారత్' ప్రచారం కోసమేనా!

సామూహిక ప్రాంతాలను వికలాంగులు వినియో గించుకునే విధంగా మార్చాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'సుగమ్య అభియాన్ భారత్' పథకాన్ని ప్రవేశపెట్టింది. 2022 నాటికి దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన పట్టణాల్లో సగం వరకైనా అవరోధరహితంగా మార్చాలని నిర్దేశించిన లక్ష్యం నెరవేరలేదు. నేటికీ సామూహిక ప్రాంతాలు వికలాంగులకు అందనంత దూరంలో ఉన్నాయి. ప్రధానమంత్రి వికలాంగులను దివ్యాంగులుగా నామకరణం చేశారు. పేరు మార్చినంత మాత్రాన వికలాంగులకు ఒరిగిందేమీ లేదనే విషయం ప్రభుత్వాలు గుర్తించాలి.

### ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వికలాంగుల వ్యతిరేక విధానాలపై ప్రపంచ వికలాంగుల దినోత్సవస్ఫూర్తితో ఉద్యమించాలి. దేశవ్యాప్తం గా ఒకే పెన్షన్ విధానం, రైల్వేలో సౌకర్యాలు, అంత్యోదయ రేషన్ కార్డులు, నామినేటెడ్ పదవులలో రిజర్వేషన్లు, సామాజిక భద్రత, స్వయం ఉపాధి, మహిళా వికలాంగుల రక్షణ వంటి సమస్యలపై ఉద్యమించాల్సిన అవ సరం ఎంతైనా ఉంది. ■



(డిసెంబర్ 3 అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం)

- యం. అడివయ్య, 9490098713

# ప్రజలు ఓడి... పార్టీలు గెలిస్తే..?



ఎస్. వీరయ్య

అవి ప్రశాంత రాత్రులే! కానీ చాలా మందికి నిద్రలేని రాత్రులు. డబ్బు పంచేవారికీ, ఎదురు చూసేవారికీ నిద్రలు రావు. ప్రజాస్వామ్యం క్రమంగా పరిపుష్టం అవుతుందనీ, విలువలు బలపడతాయనీ ఎవరైనా భావిస్తారు. అనేకసార్లు జరిగిన ఎన్నికల అనుభవాలు, పెరుగుతున్న అక్షరాస్యత, మధ్యతరగతి విస్తరణ ఇందుకు తోడ్పడతాయని ఆశించడం సహజం. కానీ ఆచరణలో ఇందుకు భిన్నంగా జరుగుతున్నది. నవంబర్ 30న జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికలే ఇందుకు తాజా తార్కాణం. శాసనసభకు పోటీ చేసే అభ్యర్థి ఖర్చు గురించిన చర్చ రూ.వంద కోట్ల దాకా చేరింది. మరోవైపు పనితనం, విధానాలు, ప్రజల పట్ల నిబద్ధత ప్రాతిపదికన ఓట్లు అడగడం కాకుండా మతపరమైన భావోద్వేగాలను వాడుకోవడం తీవ్రమైంది. చైతన్యలోపం, డబ్బు, మతపరమైన భావోద్వేగం కలగలిపిన స్థితికి బలయ్యేది ప్రజాస్వామ్యమే కదా! ఎన్నికల ప్రచార పర్వంలో విలువల వలవలూడిపోతున్నాయి. ఒక అభ్యర్థి తన సొంత పార్టీ నాయకురాలు తనకు కాకుండా, రెబల్ అభ్యర్థికి మద్దతిస్తున్నారన్న అక్కసుతో ఆమె ముక్కుకోయండని బహిరంగంగానే చెప్పాడు. మరొక అభ్యర్థి విలేకరుల సమావేశంలోనే తన ప్రత్యర్థి మీద బూతులు ప్రయోగించాడు. ఇంకో అభ్యర్థి డిసెంబర్ 3న తాను గెలిస్తే విజయోత్సవసభకు రావాలనీ, ఓడిపోతే శవయాత్రకు రావాలనీ ప్రకటించాడు. ఒక పార్టీ ప్రధాన నాయకుడే ప్రజలను హౌలే అన్నాడు. మరో పార్టీ ప్రధాన నాయకుడే 'ఇక శిరచ్ఛేదమే' అన్నాడు. ఇవేవీ ఎన్నికల కమిషన్‌కు వినిపించవూ, కనిపించవు. అది పవిత్రమైందికదా! ఇలాంటివి అంటించుకోదు కావచ్చు! పేద ప్రజలు కూడా ఎన్నికల సమయంలో డబ్బు పంచేవారి కోసం ఎదురు చూడటం పెరిగింది. ఇంటికొచ్చి డబ్బులిచ్చే అవకాశం ఎన్నికల సందర్భమే కదా! ఆర్థిక వికేంద్రీకరణ లేదు గానీ... డబ్బు, మద్యం పంపకాలు మాత్రం వికేంద్రీకరించారు. ఏకకాలంలో, ఎక్కడి కక్కడ, పకడ్బందీగా జరిగిపోయాయి. ప్రజాస్వామ్యం కోసం పరితపించే కొందరు ఐటీ దాడుల మీద, ఎన్నికల కమిషన్ మీద ఆశలు పెట్టుకున్నారు. కానీ ఈ రెండూ అధికారపక్షం గుప్పిట్లో ఉన్నాయి. డబ్బు, మద్యం పంపకాల్లో అగ్రస్థానం కూడా అధికార పార్టీదే కదా! డబ్బు, మద్యం పాత్ర నిరోధించాలన్న రాజకీయ లక్ష్యం ఉంటే తప్ప, అడ్డుకోవడం సాధ్యపడదు. పైగా ఐటీ దాడులు ప్రతిపక్షం మీదనే జరుగుతాయి! ఇక ఆపగల్గేదెక్కడ?

డబ్బు పంచకుండా ఎన్నికల్లో పోటీ చేయడం సాధ్యం కాదనీ, చేసినా గెలవరన్న భావన స్థిరపరిచే ప్రయత్నం జరుగుతున్నది. డబ్బుస్వామ్యం అవినీతి సామ్రాజ్యంతో లాభం పొందేవారి అవసరం. కానీ ప్రజల అవసరం ప్రజాస్వామ్యం. డబ్బు కచ్చితంగా ప్రజల తీర్పును మార్చివేస్తుందన్నది కూడా అర్ధసత్యమే. డబ్బు తీసుకుని కూడా వేయదలచిన వారికే ఓటువేసి, ప్రభుత్వాలనే తారుమారు చేసిన సందర్భాలు అనేకం. గత మున్సిపల్ ఎన్నికల్లో అమరచింత మున్సిపాల్టీలో గానీ, రామన్నపేట దగ్గర కొమ్మాయిగూడెం గ్రామ పంచాయతీలో గానీ సీపీఐ(ఎం) అభ్యర్థులు గెలిచిన తీరు చూడవచ్చు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో తొమ్మిది స్థానాల్లో ఇండిపెండెంట్లుగా పోటీ చేసి ఆరు స్థానాలు గెలిచారు.

డబ్బు పాత్ర విషయంలో ప్రజలను నిందించడం పెరిగింది. డబ్బు అలవాటు చేసింది బూర్జువా రాజకీయ పార్టీలు. ఇతర పార్టీల నాయకులను, కార్యకర్తలను వెలగట్టే సంస్కృతి నెల కొల్పిందీ వీరే. ఖర్చు పెట్టగల స్తోమత గలవారికే టిక్కెట్లు ఇస్తున్నది ఆ పార్టీలే. ఈ పరిస్థితులను ఎన్నికల కమిషన్ కట్టడి చేయాలని కోరుకుంటున్నవారు ప్రజాస్వామ్య ప్రేమికులు. కానీ ఎన్నికల కమిషన్ ఆ పని చేయగలదా! శేషన్ లాంటి అధికారి అయితే చేయగలడని కొందరి భ్రమ. ఆయన చేయగలిగారా? హడావుడి జరిగింది. గోడరాతలు, పబ్లిక్ స్థలాల్లో పోస్టర్లు, తోరణాలు, డోర్ పోస్టర్లను అడ్డుకున్నారు. పెద్దగా వనరులు అందుబాటులో లేని కమ్యూనిస్టులకూ, స్వతంత్ర అభ్యర్థు లకు ఉన్న కొద్దిపాటి ప్రచార అవకాశాలు లేకుండా పోయాయి. ఇతరులు కోట్లు వెచ్చించి పత్రికల్లో, టీవీలలో వ్యాపార ప్రకటనలు చేస్తున్నారు. ఎన్నికల ఖర్చు పెరిగిందే తప్ప తగ్గలేదు. తనిఖీలలో దొరికేది పాత్రదారులే తప్ప సూత్రదారులు కాదు. అవి కూడా పరిమితం. ఎన్నికల కమిషన్, పోలీసు యంత్రాంగాలు కూడా అధికార పార్టీలకు సహాయపడుతున్న సందర్భాలే అత్యధికం. కిందిస్థాయి అధికారులు స్వతంత్రంగా వ్యవహరించేందుకు ధైర్యం కూడా చేయజాలరు. ఎన్నికల అనంతరం, వీరంతా మళ్ళీ ఆ పార్టీల నాయకత్వంలోని ప్రభుత్వాల కిందనే పనిచేయాలి కదా! ఇక ఉన్నతస్థాయి అధికారులు, అధికార పార్టీ కనుసన్నల్లో నడుస్తున్నారనడానికి ఇప్పటికే అనేక ఉదాహరణలున్నాయి.

నిబంధనల డొల్లతనం కూడా చూడాలి. వ్యక్తి పేరు మీద విమర్శలు చేయరాదట. ఓడించవల్సింది పార్టీని మాత్రమే కాదు.... వ్యక్తిని (అభ్యర్థిని) కూడా. ఆ వ్యక్తి తప్పొప్పులు ఎండగట్టకుండా ఎట్లా సాధ్యం? కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి వార్తలు రాయించుకోగలిగే, ప్రసారం చేయించుకోగలిగే వారికి ఆటంకం లేదు. భారీ సభలు పెట్టి చెప్పగలిగే వారికి ఇబ్బంది లేదు. వనరులు లేనివారు కరపత్రం మీదనే ఆధారపడతారు. ఇది మాత్రం ఎన్నికల కమిషన్ అధికారుల ఆమోదం లేకుండా ప్రచురించరాదు. ఇక్కడ కూడా వనరులు లేనివారికే ఆంక్షలు. వీరు పేదల ప్రతినిధులే కదా! కమ్యూనిస్టులే కదా! 'మతం' ప్రస్తావన ఉండకూడదన్నది మరో నిబంధన. చూడగానే ఇది మతోన్మాదులను కట్టడి చేయడానికే అనిపిస్తుంది. కానీ అందుకు విరుద్ధంగా జరుగుతున్నది. మతోన్మాదం ప్రమాదకరమని చెప్పాలి కదా! కానీ రేడియో, దూరదర్శన్ ప్రసంగాలలో 'మతం' అన్న మాట ఉండొద్దన్నారు. 'హిందూ' 'ముస్లిం' లాంటి పదాలు వాడవద్దంటే అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ప్రధాని మోడీ వచ్చి బహిరంగ సభల్లో కేసీఆర్ పాలన సుల్తానుల రాజ్యాన్నీ, నిజాం పాలననూ తలపిస్తున్నదన్నాడు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వచ్చి ముస్లింలలోని బీసీ రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంచుతామన్నాడు. బండి సంజయ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఒవైసీ చేతుల్లో ఉన్నదన్నాడు. ఇప్పుడు ఎన్నికల కమిషన్ ఎవరిని కట్టడి చేసినట్టు? ఇవన్నీ చదువుకున్న మధ్య తరగతి బుద్ధిజీవులనే ప్రభావితం చేస్తున్నాయి. మతపరమైన విభజన సృష్టిస్తున్నాయి. మధ్యతరగతి విస్తరణ ప్రజాస్వామ్యం బలోపేతానికి కొంత తోడ్పడినా, తర్వాత కాలంలో మతోన్మాద భావజాలానికీ, ఏకవ్యక్తి పాలన పట్ల భ్రమలకూ లోనవుతున్నది. ఈ మధ్యతరగతి ప్రజలు వివేకానందుడి వ్యాఖ్యలు అర్థం చేసుకోవాలి. "కడుపు నిండిన వాడికే దేవుడు, మతం అవసరం. ఆకలిగొన్నవాడికి కావాల్సింది పిడికెడు మెతుకులు" అన్నారాయన. దేశంలో అత్యధికులకు తిండి, బట్ట, ఇల్లు, విద్య వైద్యమే సమస్యలు. ఇవన్నీ తమ సమస్యలుగా భావించవలసిన బాధ్యత మధ్యతరగతి మీద ఉన్నది. ప్రజాస్వామ్య లౌకిక విలువలు కాపాడే చైతన్యం ప్రదర్శించాలి. ఎన్నికల సందర్భంగా ముందుకొచ్చిన మరో ముద్దుమాట "పోల్ మేనేజిమెంట్". అంటే చివరి రెండు రోజుల్లో ఓటర్లకు చేసే పంపిణీ లన్నమాట!

అవినీతి వ్యక్తులకే పరిమితం కాలేదు. వ్యవస్థలను అవినీతిమయం చేస్తున్నారు. విలువల వ్యవస్థను ఎవరు




'మతం' ప్రస్తావన ఉండకూడదన్నది మరో నిబంధన. చూడగానే ఇది మతోన్మాదులను కట్టడి చేయడానికే అనిపిస్తుంది. కానీ అందుకు విరుద్ధంగా జరుగుతున్నది. మతోన్మాదం ప్రమాదకరమని చెప్పాలి కదా! కానీ రేడియో, దూరదర్శన్ ప్రసంగాలలో 'మతం' అన్న మాట ఉండొద్దన్నారు. 'హిందూ' 'ముస్లిం' లాంటి పదాలు వాడవద్దంటే అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ప్రధాని మోడీ వచ్చి బహిరంగ సభల్లో కేసీఆర్ పాలన సుల్తానుల రాజ్యాన్నీ, నిజాం పాలననూ తలపిస్తున్నదన్నాడు. కేంద్ర హోంమత్రి అమిత్‌షా వచ్చి ముస్లింలలోని బీసీ రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంచుతామన్నాడు. బండి సంజయ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఒవైసీ చేతుల్లో ఉన్నదన్నాడు. ఇప్పుడు ఎన్నికల కమిషన్ ఎవరిని కట్టడి చేసినట్టు? ఇవన్నీ చదువుకున్న మధ్య తరగతి బుద్ధిజీవులనే ప్రభావితం చేస్తున్నాయి. మతపరమైన విభజన సృష్టిస్తున్నాయి.

నిర్మించాలి? అధికార పార్టీయే విలువలు వదిలేయడంలో ముందున్నప్పుడు సాధ్యమా! విలువల వ్యవస్థను నిర్మిస్తే ప్రశ్నించేతత్వం పెరుగుతుంది. అవినీతిని ప్రశ్నించేవారు పెరుగుతారు. అప్పుడు పారిశ్రామిక, వాణిజ్యవేత్తలు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల మధ్య అవినీతి బంధం బట్టబయలవుతుంది. వారి దోపిడీ సాగాలంటే ప్రశ్నించేతత్వం బలహీనపడాలి. అవినీతి సహజమనే ధోరణి బలపడాలి. అందుకే ఓటర్లను కూడా కొనుగోలు చేస్తున్నారు.

అవినీతి వ్యక్తులకే పరిమితం కాలేదు. వ్యవస్థలను అవినీతిమయం చేస్తున్నారు. విలువల వ్యవస్థను ఎవరు నిర్మించాలి? అధికార పార్టీయే విలువలు వదిలేయడంలో ముందున్నప్పుడు సాధ్యమా! విలువల వ్యవస్థను నిర్మిస్తే ప్రశ్నించేతత్వం పెరుగుతుంది. అవినీతిని ప్రశ్నించేవారు పెరుగుతారు. అప్పుడు పారిశ్రామిక, వాణిజ్యవేత్తలు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల మధ్య అవినీతి బంధం బట్టబయలవుతుంది. వారి దోపిడీ సాగాలంటే ప్రశ్నించేతత్వం బలహీనపడాలి. అవినీతి సహజమనే ధోరణి బలపడాలి. అందుకే ఓటర్లను కూడా కొనుగోలు చేస్తున్నారు. మోడీ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి అవినీతి చట్టబద్ధం చేసింది. మార్కెట్ ఆర్థిక వ్యవస్థ ఎంత అభివృద్ధి చెందితే అవినీతి కూడా అంతే వేగంగా విస్తరిస్తున్నది.

మోడీ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి అవినీతి చట్టబద్ధం చేసింది. మార్కెట్ ఆర్థిక వ్యవస్థ ఎంత అభివృద్ధి చెందితే అవినీతి కూడా అంతే వేగంగా విస్తరిస్తు న్నది. ఇదే పెట్టుబడిదారీ వ్యవస్థ స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలపట్ల, ప్రజాస్వామ్యం పట్ల భ్రమలు కల్పిస్తుంది. ఇక్కడ స్వతంత్ర వ్యవస్థ లన్నా, ఎన్నికల కమిషన్ అన్నా.. ఇవేవీ పెట్టుబడి దారుల ప్రయోజనాలకు అతీతంగా పనిచేయ జాలవు. వారి ప్రయోజనాలే ప్రజల ప్రయోజనా లుగా చిత్రీకరిస్తారు. రాజ్యాంగం రూపొందించిన కాలంలో జాతీయోద్యమ భావాలు బలంగా ఉన్నాయి. అందుకే ప్రజాప్రాతినిధ్య చట్టం పట్ల చాలా ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు 'సంక్షేమ రాజ్యం' స్థానంలో 'మార్కెట్ ఆర్థిక వ్యవస్థ' చేరింది. దీనికి తోడు స్వాతంత్ర్యోద్యమంతో ఏ మాత్రం సంబంధంలేని వారి పాలనలో ఉన్నాం. ఇంకా ప్రజాస్వామ్యాన్ని కాంక్షించేవారి 'విలువల' కు స్థానం ఎక్కడ?

డబ్బు పంచకుండా ఎన్నికల్లో పోటీ చేయడం సాధ్యం కాదనీ, చేసినా గెలవరన్న భావన స్థిరపరిచే ప్రయత్నం జరుగుతున్నది. డబ్బు స్వామ్యం అవినీతి సామ్రాజ్యంతో లాభం పొందేవారి అవ సరం. కానీ ప్రజల అవసరం ప్రజాస్వామ్యం. డబ్బు కచ్చితంగా ప్రజల తీర్పును మార్చివేస్తుందన్నది కూడా అర్ధ సత్యమే. డబ్బు తీసుకుని కూడా వేయదలచిన వారికే ఓటువేసి, ప్రభు త్వాలనే తారుమారు చేసిన సందర్భాలు అనేకం. గత మున్సిపల్ ఎన్నికల్లో అమరచింత మున్సి పాల్టీలోగానీ, రామన్నపేట దగ్గర కొమ్మాయిగూడెం గ్రామ పంచాయతీలో గానీ సీపీఐ(ఎం) అభ్యర్థులు గెలిచిన తీరు చూడవచ్చు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో తొమ్మిది స్థానాల్లో ఇండిపెండెంట్లుగా పోటీ చేసి ఆరు స్థానాలు గెలిచారు. ఓడిన మూడు కూడా నామమాత్రపు తేడా. గ్రామీణ ప్రాంతమైనా, పట్టణ ప్రాంతమైనా డబ్బు మీద కాకుండా ప్రజల మీద ఆధారపడితే గెలుపు సాధ్యమే కదా! పరిశీలిస్తే ఇంకా చాలా ఉదాహరణలు కనిపిస్తాయి. ఇదంతా ఎన్నికల తీరు గురించి. ఇంతటితో కథ ముగిసినట్టుకాదు. ఎన్నికైన శాసనసభ్యులు కూడా ప్రజల తీర్పును తారుమారు చేయడం ఇక తర్వాత ఘట్టం. హంగ్ ఏర్పడితే వీరికి పండగే. వీరి రేటు అనేక రెట్లు పెరుగుతుంది. ఓటర్ల తీర్పును పణంగాపెట్టి, పార్టీ ఫిరాయించి, సొమ్ము చేసుకుంటారు. అందుకే ఓట్లు వేసే హక్కు మాత్రమే చాలదు. గెలిచిన వారిని వెనక్కు పిలిచే హక్కు కూడా ప్రజలకు ఉండాలి. ఈ మొత్తం ప్రక్రియలో ప్రజల చైతన్యం కీలకం. ఇది కమ్యూనిస్టులకు మాత్రమే సాధ్యమైన పని. అందుకే ప్రజాస్వామ్యం బలపడాలన్నా కమ్యూనిస్టు ఉద్యమం బలపడాలి. ■


# హిందూత్వ-యూదు పొత్తును వ్యతిరేకించాలి

పాలస్తీనియన్లను ముస్లిం తీవ్రవాదులుగా చిత్రించేందుకు హిందూత్వశక్తులు, దాని అధీనంలోని కార్పొరేట్ మీడియా బాకాలు చేస్తున్న యత్నాల పట్ల పీపుల్స్ డెమొక్రసీ (పీడీ) ఆందోళన వ్యక్తం చేసింది. దీనికి మతం రంగు పులిమి ఇస్లామిక్ ఫోబియాను రెచ్చగొట్టాలని బీజేపీ చేస్తున్న యత్నాలను తిప్పి కొట్టాల్సిన ఆవశ్యకతను అది నొక్కి చెప్పింది. పీపుల్స్ డెమొక్రసీ తన తాజా సంచికలో ప్రచురించిన సంపాదకీయంలో హిందూత్వ-యూదు పొత్తు, దాని ప్రమాదం గురించి హెచ్చరిస్తూ ఇలా వ్యాఖ్యానించింది. గాజాపై ఇజ్రాయిల్ అమానుష యుద్ధంలో మరణించిన పాలస్తీనా చిన్నారులను గుర్తు చేసుకుంటూ బాలల దినోత్సవాన్ని జరుపుకోవడం కూడా నూతన భారత దేశంలో నేరమైపోయింది. ముంబయిలో నవంబరు 14న జుహూ బీచ్‌లో మైనర్ బాలికలతో పాటు కొద్దిమంది, పాలస్తీనా చిన్నారుల కోసం మౌనంగా ప్రార్థనలు జరిపారు. వారిలో 17మందిని పోలీసులు అరెస్టు చేశారు. సాయంత్రం వరకు పోలీసు స్టేషన్‌లోనే అట్టి పెట్టారు. వీరందరూ కూడా మైనారిటీ కమ్యూనిటీకి చెందిన వారే. గాజాలో 5,600 మంది చిన్నారులు మరణిస్తే ఆ పరిణామాలు బీజేపీ పాలకులను కొంచెం కూడా కదిలించలేక పోయాయి.

అదే రోజు, ఢిల్లీ పోలీసులు వివిధ మసీదుల ఇమామ్‌లకు నోటీసులు పంపడం, ప్రార్థనలు, సమావేశాల సందర్భంగా గాజాలో ఇజ్రాయిల్ బలగాల దాడులు గురించి లేదా పాలస్తీనా గురించి ప్రస్తావించవద్దంటూ హెచ్చరికలు జారీచేశారు. గాజాలో మరణించిన వేలాదిమంది స్మత్యర్థం ప్రార్థన జరపరాదంటూ నిషేధం విధించడం ప్రాథమిక హక్కు అయిన భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమే కాకుండా మత స్వేచ్ఛపై కూడా దాడి చేయడమే. అక్టోబరు 13న, ఆ తర్వాత వచ్చే శుక్రవారాల్లో ప్రార్థనలు మానేయాల్సిందిగా శ్రీనగర్‌లోని ప్రధాన మసీదు అయిన జామియా మసీదుకు నగర యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. ప్రార్థనల సమయాల్లో గాజాలోని ప్రజలకు సంఘీభావం తెలియచేయకుండా అడ్డుకునేందుకు యత్నించిందని పీపుల్స్ డెమొక్రసీ విమర్శించింది.

బీజేపీ పాలిత రాష్ట్రాలన్నింటిలో, పాలస్తీనాకు మద్దతుగా ఎలాంటి నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించకుండా పోలీసులు నిషేధం విధించారు. ఢిల్లీలో కూడా, జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలియచేస్తుండగా విద్యార్థులు, ఇతర నిరసనకారులను పోలీసులు చుట్టుముట్టారు. ఇజ్రాయిల్‌ను అతిగా పొగుడుతూ, పాలస్తీనా పోరాటాన్ని తీవ్రవాదంగా చిత్రీకరించే బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ దక్పథం కారణంగానే ఈ చర్యలన్నీ చోటు చేసుకున్నాయి. ఒకపక్క అంతర్జాతీయంగా పేద, వర్ధమాన దేశాలన్నీ గాజాలో సాగుతున్న యుద్ధంలో కాల్పుల విమరణ జరగాలని డిమాండ్ చేస్తుంటే, మరోపక్క ఇజ్రాయిల్‌కు పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటిస్తూ, కాల్పుల విరమణ పిలుపునకు మద్దతు ఇవ్వ డానికి కూడా తిరస్కరిస్తూ మోడీ ప్రభుత్వ వైఖరిలో వచ్చిన పూర్తి మార్పును ఈ చర్యలు ప్రతిబింబిస్తున్నాయి. హిందూత్వ, మితవాద యూదు ఉన్మాదం ఈ రెండూ సైద్ధాంతిక సోదరుల వంటివి. హిందూత్వ భావనకు మూలకర్త అయిన వి.డి. సావర్కర్ పాలస్తీనాలో యూదు దేశం ఏర్పాటుకు మద్దతిచ్చి నట్లు 1923లోనే రాసుకున్నారు. యూదు వాదానికి సావర్కర్ ఎప్పుడూ మద్దతిచ్చేవారు. దాన్ని ఆయన ముస్లిం వ్యతిరేకిగా చూశారు. దీనికి పూర్తి విరుద్ధంగా, పాలస్తీనా ప్రయోజనాలకు గాంధీజీ కూడా అంతే దృఢంగా మద్దతి చ్చారు. "అరబ్బులపై యూదులను రుద్దడం తప్పు, అమానవీయం" అని 1938లో గాంధీజీ రాశారు. ఈనాడు పాలస్తీనాలో జరుగుతున్నదాన్ని ఏ నైతిక ప్రవర్తనా నియమావళితోనూ సమర్థించలేం.

పాలస్తీనాపై భారత్ వైఖరిని మోడీ ప్రభుత్వం పూర్తిగా మార్చివేయడమనేది బీజేపీ నేతృత్వంలోని మొదటి వాజ్‌పేయి ప్రభుత్వం ఇజ్రాయిల్‌తో పెట్టుకున్న వ్యూహాత్మక సంబంధాలకు పరాకాష్టగా వుంది. ఆనాడు ఉప ప్రధాని హోదాలో ఎల్.కె.అద్వానీ 2000లో ఇజ్రాయిల్‌లో పర్యటించారు. అలా పర్యటించిన మొదటి అత్యున్నత భారత ప్రభుత్వనేత ఆయనే. ఈ ధోరణి వివిధ మిలిటరీ, భద్రతా సంబంధాల్లోనూ ప్రస్ఫుటంగా కనిపించింది. తదనంతరం ఇజ్రాయిల్ ప్రధాని ఏరియల్ షరోన్ భారత్‌లో పర్యటించారు. యూదు మితవాద విభాగానికి ఆయన నేతత్వం వహిస్తున్నారు. భారత్‌లో పర్యటించిన మొదటి ఇజ్రాయిల్ ప్రధాని ఆయనే. ఈ వ్యూహాత్మక పొత్తు నరేంద్ర




మోడీ, మితవాద ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కలిసి మరింత ముందుకు తీసుకెళ్లారు. మోడీ ప్రభుత్వానికి అంతర్గత భద్రతా వ్యవస్థకు అవసరమైన పరికరాలను, సాంకేతికతను అందించే కీలక సరఫరాదారుగా ఇజ్రాయిల్ మారింది. అటువంటి సాంకేతికతల్లో ఒకటే పెగాసస్ స్పైవేర్. ఇజ్రాయిల్ ప్రభుత్వ ఆమోదంతో ఒక ఇజ్రాయిల్ కంపెనీ దీన్ని సరఫరా చేసింది. గాజాపై సాగించిన మారణకాండ ప్రపంచవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలను లేవనెత్తింది. ఖండనలకు గురైంది. ఇజ్రాయిల్‌కు పూర్తిగా మద్దతిచ్చే దేశాల్లో కూడా వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి గాజా ప్రజలకు, పాలస్తీనాకు మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించారు. బ్రిటన్‌లో, కన్జర్వేటివ్ ప్రభుత్వం, ప్రతిపక్ష లేబర్ పార్టీ నాయకత్వం రెండూ గాజాలో ఇజ్రాయిల్ ఊచకోతకు పూర్తిగా మద్దతిచ్చాయి. అయినా సరే వందల వేల సంఖ్యలో ప్రజలు ప్రతి శనివారం ప్రదర్శనలు నిర్వహిస్తూనే వున్నారు. ఇటువంటి నిరసనలను, పాలస్తీనా పతాకాలను ప్రదర్శించడాన్ని ఫ్రెంచి, జర్మనీ ప్రభుత్వాలు నిషేధించాయి. అయినా పారిస్, బెర్లిన్‌ల్లో నిరసనలు జరిగాయి.

నాలుగు రోజుల పాటు గాజాలో కాల్పుల విరమణ, హమాస్ చెరలో బందీలుగా వున్న 50మంది మహిళలు, చిన్నారులను విడుదల చేస్తే అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్ళలో మగ్గుతున్న 150మంది పాలస్తీనా మహిళలను, చిన్నారులను విడుదల చేయడమన్నది తాత్కాలిక ఉపశమనం. కాల్పుల విరమణ సమయం ముగిసిన తర్వాత మళ్ళీ యుద్ధం సాగుతుందని నెతన్యాహు ఇప్పటికే స్పష్టం చేశారు. అందువల్లే, ఈ సమస్యకు రాజకీయ పరిష్కారం కనుగొనేవరకు, శాశ్వత కాల్పుల విరమణ జరిగేలా ఒత్తిడి తీసుకురావాలన్నది కీలకాంశంగా వుంది. భారత్‌లో, పెద్ద పెద్ద బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. కేరళలో అన్ని జిల్లాల్లో వేలాది మంది ప్రజలు పాల్గొంటున్నారు. కోల్‌కతాలో వామ పక్షాలు పెద్ద ప్రదర్శన నిర్వహించాయి. వివిధ రాష్ట్రాల్లో సంఘీభావ చర్యలు, సమావేశాలను కూడా వామ పక్షాలు నిర్వహిస్తున్నాయి. పాలస్తీనియన్లను ముస్లిం తీవ్రవాదులుగా చిత్రీకరిస్తూ బీజేపీ, కార్పొరేట్ మీడియా ఆధిపత్యంతో కూడిన మతపరమైన కథనాలు ఇస్తున్న తీరును దష్టిలో పెట్టుకుంటే మరోవైపు లౌకిక ప్రతిపక్షపార్టీలు ఈ అంశంపై ఎదురు తిరగకుండా నిష్క్రియాపరత్వంతో వ్యవహరిస్తున్నాయి. అందువల్ల, స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటు చేయడానికి, పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిలీల ఆక్రమణను అంతమొందించడానికి, అలాగే శాశ్వతంగా కాల్పుల విరమణకు మద్దతుగా వామపక్షాలు విస్తృత రీతిలో, నిలకడగా ప్రచారం చేపట్టడం ఇక్కడ అత్యంత కీలకంగా మారింది. ఇందుకోసం జరిగే ప్రజా సమీకరణలో ఇతర లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను కూడా కలుపుకుంటూ, దీన్నొక ఇస్లామోఫోబిక్ అంశంగా మార్చడానికి బీజేపీ చేస్తున్న ప్రణాళికను భగ్నం చేయాల్సి వుంది." అని పీపుల్స్ డెమొక్రసీ పేర్కొంది. ■

(పీపుల్స్ డెమొక్రసీ సంపాదకీయం)

# సాగర్ డ్యామ్‌పై టెన్షన్.. టెన్షన్

**నవతెలంగాణ-నాగార్జునసాగర్**

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ వద్ద మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొంది. తెలంగాణ ప్రాంతం నుంచి దాదాపు వెయ్యి మంది పోలీస్ బలగాలతో పహారా కాస్తున్నారు. ఇటు తెలంగాణ పోలీసులు, అటు ఆంధ్ర పోలీసు బలగాలతో డ్యామ్ పరిసరాల్లో ఉత్కంఠగా మారింది. గురువారం ఏపీ అధికారులు కృష్ణానది యాజమాన్య బోర్డుకు, తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్ష నిర్ణయంతో బలవంతంగా డ్యామ్‌పై దూసుకొచ్చిన విషయం తెలిసిందే. నాగార్జునసాగర్ కంట్రోల్ రూమ్‌ను పూర్తిగా తమ ఆధీనంలో తీసుకొని కుడి కాలువ నుంచి 2వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. తాగునీటి కోసమే నీటి విడుదల చేశామని ఏపీ ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా.. దౌర్జన్యం చేయడంపై కృష్ణానది యాజమాన్య బోర్డు, తెలంగాణ అధికారులు ఆగ్రహంతో ఉన్నారు.

ప్రస్తుతం సాగర్ నీటి మట్టం 523అడుగుల చేరువలో ఉంది. మరో 12 అడుగులకు చేరితే డెడ్ స్టోరేజీకి వచ్చే అవకాశం ఉంది. దీంతో హైదరాబాద్‌లో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని నీటిపారుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కృష్ణారివర్ బోర్డ్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ వైపు నాగార్జునసాగర్‌లో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

నాగార్జున సాగర్ డ్యామ్ విషయంలో ఇరు రాష్ట్రాల పోలీసుల మధ్య బుధవారం తెల్లవారుజామున మొదలైన వివాదం శుక్రవారం కూడా కొనసాగింది. ప్రాజెక్టులోని 26 గేట్లలో 13 గేట్లు ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వస్తాయని ఏపీ పోలీసులు పేర్కొన్నారు. 13వ గేటు వద్ద మూడంచెల భారీకేడ్లను, ముళ్ల కంచెను ఏర్పాటు చేసుకొని తెలంగాణ ప్రాంతం నుంచి ఎవరినీ అనుమతించడం లేదు. ఇరిగేషన్ ఉన్నత అధికారులు, పోలీస్ అధికారులు నాగార్జునసాగర్ డ్యాం వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు చర్చలు జరిపారు. అయినా ఫలితం లేదు. నాగార్జున సాగర్ ఇరిగేషన్ అధికారులతో కేఆర్ఎంబీ సభ్యులు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. డ్యామ్‌పై జరుగుతున్న పరిణామాలను అధికారులు వివరించారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే నేడు కేంద్ర బలగాలను దించే ఆలోచన ఉంది.

**నీటి విడుదలను తక్షణమే ఆపాలి : కేఆర్ఎంబీ**

కుడి కాలువ ద్వారా నీటి విడుదలను వెంటనే ఆపాలని ఏపీ ప్రభుత్వాన్ని కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆదేశించింది. ఈ మేరకు ఏపీ జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శికి కేఆర్ఎంబీ సభ్యులు అజయ్ కుమార్ గుప్త ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాశారు. అక్టోబర్ కోసం అడిగిన 5 టీఎంసీల నీటిలో ఇప్పటికే 5.01 టీఎంసీలు విడుదల చేసినట్టు లేఖలో పేర్కొన్నారు. నవంబర్ 30వ తేదీ తర్వాత నీటి విడుదలపై ఏపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి వినతీ అందలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మూడు విడతల్లో నీటి విడుదలకు నిర్ణయం తీసుకున్నట్టుగా కేఆర్ఎంబీ తెలిపింది. 2024 జనవరి, ఏప్రిల్‌లో నీరు విడుదల చేయాల్సి ఉందని వివరించింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి ఐదు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం సరైంది కాదని చెప్పింది. వెంటనే డ్యామ్ వద్ద ఏపీ చర్యలను ఆపేయాలని, తక్షణం తమ ఆదేశాలను పాటించాలని కోరింది.

**కేసు నమోదు చేసిన తెలంగాణ పోలీసులు**

నాగార్జునసాగర్ డ్యామ్‌పై ఏపీ ఇరిగేషన్ అధికారులు పోలీసు బలగాల సహయాంతో బుధవారం అర్ధరాత్రి డ్యామ్‌పైకి ప్రవేశించడాన్ని తెలంగాణ పోలీసులు తీవ్రంగా పరిగణించారు. ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్, పోలీస్ శాఖ అధికారులపై తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేశారు. సాగర్ డ్యాంపై విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో పాటు నీటిపారుదల శాఖ తెలంగాణ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 441, 448, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

**కేఆర్ఎంబీ సూచన మేరకే.. : డ్యామ్ సీఈ అజయ్‌కుమార్**

కృష్ణానది యాజమాన్య బోర్డు ఆదేశాల మేరకే నడుచుకుంటామని డ్యామ్ సీఈ అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఆంధ్రప్రదేశ్‌కు 15 టీఎంసీల నీటిని మూడు విడతల్లో విడుదలకు ఒప్పందం జరిగిందని చెప్పారు. అందులో భాగంగా అక్టోబర్‌లో 5 టీఎంసీల నీటిని విడుదల చేశామని, రెండో విడత జనవరి, మూడో విడత ఏప్రిల్ 2024లో నీరు విడుదల చేయాల్సి ఉందని తెలిపారు. కానీ, అందుకు విరుద్ధంగా ఏపీ అధికారులు వ్యవహరించారని చెప్పారు. కేఆర్ఎంబీ బృందం త్వరలో నాగార్జునసాగర్‌ను సందర్శించనున్నట్టు తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి విడుదల వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వివాదంపై కేంద్ర హోంశాఖ కల్పించుకుని పలు ప్రతిపాదనలు చేసినట్టు సమాచారం. ఈ ప్రతిపాదనలకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు అంగీకరించాయనే తెలుస్తోంది. డ్యామ్

**కేంద్ర బలగాలతో డ్యామ్ భద్రత నిర్వహణ**

నిర్వహణను కృష్ణా వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయించినట్టు సమాచారం. నవంబర్ 28వ తేదీకి ముందున్న పరిస్థితులు కొనసాగించాలని తెలిపింది. సీఆర్పీఎఫ్ బలగాల పర్యవేక్షణకు సాగర్ డ్యామ్ అప్పగిస్తే వివాదం ముగిసినట్లే.

## తక్షణమే ఆపేయండి

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

నాగార్జునసాగర్ ప్రాజెక్టు వివాదంపై ఏపీ ప్రభుత్వానికి కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) లేఖ రాసింది. ఏపీకి 3 విడతల్లో నీటి విడుదలకు నిర్ణయం తీసుకున్నామని బోర్డు తెలిపింది. అక్టోబర్ కోసం అడిగిన ఐదు టీఎంసీల్లో ఇప్పటికే 5.01 టీఎంసీలు విడుదల చేసినట్టు పేర్కొంది. 2024 జనవరి, ఏప్రిల్‌లో నీరు విడుదల చేయాల్సి ఉందనీ, ఐదు వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేయడం సరికాదని కృష్ణా బోర్డు తెలిపింది. డ్యాం దగ్గర ఏపీ పోలీసులను మోహరించి సాగర్‌ను ఆక్రమించారని కృష్ణా బోర్డుకు తెలంగాణ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏపీ జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శికి కృష్ణా బోర్డు లేఖ రాసింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాల్వకు తక్షణమే నీటి విడుదల ఆపివేయాలని కేఆర్ఎంబీ ఆదేశాలు జారీ చేసింది. నాగార్జునసాగర్ నుంచి ఏపీకి 15 టీఎంసీల నీటిని విడుదలకు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిందని గుర్తుచేసింది. 2024 జనవరి ఎనిమిది నుంచి 18 వరకు ఐదు టీఎంసీలు, ఏప్రిల్ ఎనిమిది నుంచి 24 వరకు ఐదు టీఎంసీలు, అక్టోబర్ పది నుంచి 20 వరకు ఐదు టీఎంసీలు నీరు విడుదలకు బోర్డు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఇరు రాష్ట్రాలు ఒప్పందం చేసుకున్నాయనీ, నవంబర్ 30 వరకు ముందు అడగకుండా ఎలా నీటిని విడుదల చేస్తారని ఏపీని కేఆర్ఎంబీ ప్రశ్నించింది.

## కేఆర్ఎంబీ చేతిలోకి నాగార్జునసాగర్

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

నాగార్జునసాగర్ కృష్ణాజలాల విడుదల విషయంలో నవంబర్ 28వ తేదీకి ముందు ఉన్న పరిస్థితిని కొనసాగిస్తూ, ఈ డ్యామ్ నిర్వహణను కృష్ణా నదీజలాల యాజమాన్య బోర్డు(కేఈఆర్ఎంబీ)కి అప్పగించడంతోపాటు సీఆర్‌పీఎఫ్ దళాల పర్యవేక్షణకు అప్పగించాలన్న కేంద్ర హోంశాఖ కార్యదర్శి ప్రతిపాదనలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అంగీకరించాయి.

నాగార్జునసాగర్ డ్యామ్ నుంచి ఈనెల 29న ఆంధ్రప్రదేశ్ ఏకపక్షంగా సాయుధ దళాలను మోహరించి కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేసిన సందర్భంగా తలెత్తిన వివాదంపై నేడు కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, కేంద్ర జల సంఘం, కృష్ణా రివర్ వాటర్ మేనేజ్మెంట్ బోర్డు అధికారులు కూడా ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ నవంబర్ 29న రాత్రి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దాదాపు 500 మంది సాయుధ పోలీసులు నాగార్జునసాగర్ డ్యాంపైకి వచ్చి సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతోపాటు ఐదు, ఏడు గేట్ల వద్ద వున్నా హెడ్‌రెగ్యులేటర్లను తెరిచి దాదాపు 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని తెలిపారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల నిర్వహణలో ఉండగా ఏపీ ప్రభుత్వం చేసిన చర్య తమ రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను సృష్టించిందని చెప్పారు. గత రేండేండ్లుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విధమైన అతిక్రమణలకు పాల్పడడం ఇది రెండవసారి అని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ఈ చర్యతో హైదరాబాద్ నగరంతోపాటు పరిసర ప్రాంతాల రెండు కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని శాంతికుమారి ఆందోళన వ్యక్తంచేశారు. 2014 నుంచి కొనసాగుతున్న మాదిరిగానే స్టేటస్-కో ని కొనసాగించాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. కాగా, నాగార్జునసాగర్ డ్యాంపై గతంలో ఉన్న మాదిరిగానే స్టేటస్-కో కొనసాగించాలనీ, ఈ డ్యామ్ ను కేంద్ర రిజర్వ్ పోలీస్ దళాల పర్యవేక్షణలో తాత్కాలికంగా ఉంటుందని కేంద్ర హోంశాఖ కార్యదర్శి స్పష్టం చేశారు. ఈ అంశంపై కేంద్ర జల వనరుల శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించబోతున్నట్టు భల్లా చెప్పారు. వీడియోకాన్ఫరెన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు డీజీపీ అంజనీ కుమార్, నీటి పారుదల శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్, జీఏడీ కార్యదర్శి వి. శేషాద్రి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, అదనపు డీజీ ఎస్.కె.జైన్, ఐజీ షానవాజ్ కాశీ, నీటిపారుదల శాఖ సలహాదారు పెంటారెడ్డి, ఈఎన్‌సీ మురళీధర్, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే పాల్గొన్నారు.

**కృష్ణా జలాల వివాదంపై తెలుగు రాష్ట్రాలకు కేంద్ర జలశక్తి శాఖ నోటీసు**

- నేడు ఢిల్లీలో భేటి
- హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహణ

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

కృష్ణా జలాల వివాదంపై శనివారం ఉదయం 11.00 గంటలకు కీలక సమావేశం జరగనుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సమావేశానికి రావాలని కేంద్ర జలశక్తి శాఖ నోటీసు ఇచ్చింది. కృష్ణా జలాల పంపిణీ విషయంలో రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించడమే అజెండాగా కేంద్ర జలశక్తి శాఖ ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నది. అలాగే నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్ల నిర్వహణ బాధ్యతలపై కూడా సమావేశంలో చర్చించనుంది. న్యూఢిల్లీలోని జలశక్తి శాఖ కార్యాలయంలో రూమ్ నెంబర్ 412లో ఈ భేటీ జరగనుంది. జలశక్తి శాఖలో జలవనరుల విభాగం కార్యదర్శి నేతృత్వంలో తెలుగు రాష్ట్రాల అధికారులు సమావేశం కానున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతోపాటు సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ డీజీలు, సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మెన్, కేఆర్ఎంబీ చైర్మెన్లను సమావేశానికి హాజరుకావాల్సిందిగా కేంద్ర జలశక్తి శాఖ నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి అభిరామ్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. కొందరు ప్రత్యక్షంగా, మరికొందరు హైబ్రిడ్ మోడ్‌లో సమావేశంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

## హైదరాబాద్‌లో రియాల్టీ జోరు

- ఎస్‌బీఐ సిజీఎం రాజేష్ కుమార్
- వేడుకగా మెగా ప్రాపర్టీ షో ప్రారంభం




**హైదరాబాద్ :** నగరంలో నివాస అమ్మకాల్లో మెరుగైన వృద్ధి రేటు చోటు చేసుకుంటుందని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ (సిజీఎం) అన్నారు. ఏడాదికేడాదితో పోల్చితే హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం 40 శాతం పెరుగుదలను సాధించిందని ఇటీవల పలు రిపోర్టులు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ శుక్రవారం హైటెక్స్‌లో మెగా ప్రాపర్టీ షోనూ వేడుకగా ప్రారంభించింది. ఇది డిసెంబర్ 1-3 తేదిల్లో కొనసాగనుంది. ప్రాపర్టీ షోను ప్రారంభించిన రాజేష్ కుమార్.. అనంతరం మాట్లాడుతూ.. ఎస్‌బీఐ రూ.7 లక్షల కోట్ల గృహ రుణాల పోర్టుపోలియోను కలిగి ఉందన్నారు. ఇందులో హైదరాబాద్ సర్కిల్ వాటా రూ.57,000 కోట్లుగా ఉందన్నారు. గడిచిన మూడేళ్లలోనే రూ.23,000 కోట్ల నివాస రుణాలు జారీ చేసినట్లు వెల్లడించారు. తమ సర్కిల్‌లో 26 ప్రాసెసింగ్ సెంటర్లు, 1150 శాఖలు ఉన్నాయన్నారు. కొనుగోలుదారులు ప్రాపర్టీ షోను సందర్శించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రదర్శనలో ప్రాపర్టీలను బుకింగ్ చేసుకున్న వారికి ప్రాసెసింగ్ ఫీజులో 50 శాతం డిస్కౌంట్‌ను అందిస్తున్నామన్నారు. అదే విధంగా వడ్డీ రేట్లలోనూ 0.25 శాతం ప్రత్యేక తగ్గింపును ఇస్తున్నామన్నారు. ముంబయి కార్పొరేట్ సెంటర్ ఆర్ఇహెచ్‌బియు సిజీఎం ఉషా గౌతం మాట్లాడుతూ.. హైదరాబాద్ వృద్ధిలో ఎస్‌బీఐ భాగస్వామ్యం ఉందన్నారు. గృహ రుణాల జారీలో ఎస్‌బీఐ మార్కెట్ లీడర్‌గా ఉందన్నారు. ఈ ప్రాపర్టీ షోలో ఎస్‌బీఐ జీఎం దేబాషిస్ మిత్రా ప్రారంభోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ ప్రెసిడెంట్ రాజ శేఖర్ రెడ్డి, టిబిఎఫ్ ప్రెసిడెంట్ విద్యా సాగర్, నారెడ్కో ప్రెసిడెంట్ సునీల్ చంద్రా రెడ్డి, ఎస్‌బీఐ ఉన్నతాధికారులు, బిల్డర్లు పాల్గొన్నారు.

## ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు కాబట్టి, ప్రధానమంత్రి, హోంమంత్రి, మొత్తం క్యాబినెట్ తీవ్రమైన ప్రచారం చేసినా బీజేపీకి, ప్రత్యేకించి ప్రధాని మోడీకి ఫలితం అంత తేలికైనది కాదు" అని అన్నారు. ఎన్నికల్లో ప్రతిబింబించే అంశాలు, నిరుద్యోగిత రేటు ఎక్కువగా ఉన్నాయని, ప్రపంచ ఆహార సూచీలో కూడా భారత్ స్థానం మరింత దిగజారిందని అన్నారు. ప్రజాసంక్షేమం మంటగలిసిందని, పేద ప్రజల జీవితాలు భారంగా మారాయని చెప్పారు. గత ఏడాది 40,000కు పైగా కార్పొరేట్ సంస్థలు ఆదాయపు పన్ను పరిధి నుంచి బయటికి వెళ్లాయని వివరించారు. ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య కాలంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయని, గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 77 శాతం తగ్గిందని పేర్కొన్నారు.

**ఇండియా బ్లాక్ ను మరింత బలోపేతం చేస్తాం**

వచ్చే ఏడాది జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగం ప్రకటించిన భారత దేశాన్ని కాపాడుకోవడం కోసం మెరుగైన ప్రభుత్వం ఆవశ్యకత, కోరిక ప్రధానాంశంగా ఉంటుందని సీతారాం ఏచూరి అన్నారు. "ప్రజలే నిర్ణయిస్తారు. వారి ఒత్తిడి వల్లనే ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావాలి. ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఇండియా బ్లాక్ ను మరింత బలోపేతం చేసేందుకు సీపీఐ(ఎం) కట్టుబడి ఉంది" అని ఏచూరి అన్నారు. ఇండియా బ్లాక్ సమావేశాల్లో సీట్ల సర్దుబాట్లకు సంబంధించిన అన్ని అంశాలు రాష్ట్రానికి సంబంధించినవిగా నిర్ణయించబడ్డాయని అన్నారు. "సాధారణ జనాభా గణనతో పాటు కుల గణన కూడా జరగాలని మేం కోరుకుంటున్నాం. ఇది సుదీర్ఘంగా ఉన్న అంశం" అని అన్నారు.

యునెస్కో ఎగ్జిక్యూటివ్‌కు జరిగిన ఎన్నికలలో ఆసియా ప్రతినిధిగా పాకిస్థాన్‌కు 38 ఓట్లు రాగా, భారత్‌కు 18 ఓట్లు మాత్రమే వచ్చాయి. "మనం గ్లోబల్ సౌత్‌కు నాయకులమైతే, ఇది ఎందుకు జరుగుతోంది? దీనికి సమాధానం చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు. యూఎస్ ఇటీవల చేసిన ఆరోపణ (ఖలిస్తాన్ వేర్పాటువాదులను చంపే పన్నాగంతో ఒక భారతీయ అధికారిని లింక్ చేయడం), యూఎస్ కోర్టులో సాక్ష్యాధారాలతో, వ్యక్తుల పేర్లతో దాఖలు చేసిన కేసుపై మోడీ ప్రభుత్వం స్పష్టతనివ్వాలని అన్నారు.

తమిళనాడు ఎదుగుదలకు బీజేపీ లేదా కమ్యూనిస్టు పార్టీలు ఏ పార్టీ ఎక్కువ సహకారం అందించిందో బహిరంగ చర్చకు రావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలైకి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి కె. బాలకృష్ణన్ సవాల్ విసిరారు. అన్నాడీఎంకే ఎప్పుడూ బీజేపీకి "బి" టీమ్‌గా పని చేస్తుందని, ఇటీవల అసెంబ్లీ ప్రత్యేక సెషన్‌లో 10 బిల్లులు మళ్లీ ఆమోదించినప్పుడు కూడా సభ నుంచి వాకౌట్ చేసిందని ఆయన గుర్తు చేశారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నువ్వా..నేనా..!

(మొదటిపేజీ తరువాయి)

చూస్తున్నారు. మరోవైపు గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా ఇప్పుడందరూ ఏయే ప్రాంతాల్లో ఏ పార్టీ, ఏ అభ్యర్థి గెలుస్తారు..? మెజారిటీ ఎంత..? అనే చర్చోప చర్చల్లో మునిగిపోయారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ఎన్నికలపై బెట్టింగులు జోరుగా కొనసాగుతున్నాయి. ఇవి వేలు, లక్షలు దాటి కోట్లకు చేరుకున్నాయి. ఈ రకంగా రాష్ట్ర అసెంబ్లీ ఎలక్షన్లు ఓటింగ్ ముగిసిన తర్వాత కూడా మరింత కాక పుట్టిస్తున్నాయి.

## సర్వత్రా ఉత్కంఠ

- అందరి దృష్టి బాన్సువాడపైనే !

**నవతెలంగాణ-బోధన్**

బోధన్ నియోజకవర్గంలో 68.5 శాతం పోలింగ్ నమోదయ్యింది. పోలింగ్ సరళిపై ఉమ్మడి నిజామాబాద్‌లో అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. ఫలితాలు ఆదివారం వెలువడనుండడంతో అంతటా ఉత్కంఠ నెలకొంది. తమకు ఎన్ని ఓట్లు వచ్చాయోనని అభ్యర్థులు బేరీజు వేసుకుంటూ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ఓటర్లు వారి మనసులో మాట చెప్పకుండా వారు ఎవరికి ఓటు వేయాలనుకున్నారో వారికే ఓటు వేసి తమ పని తాము కానిచ్చారు. ఓటర్లు మీ పార్టీకే ఓటు వేసామంటూ చెబుతున్నా నాయకులు నమ్మలేని పరిస్థితి ఎదురైంది. నాయకులు పైకి గంభీరంగా ఉన్న లోలోపల మదన పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా బోధన్ నియోజకవర్గంలో ఎస్సీ, బిసి, మైనార్టీ ఓట్లే అభ్యర్థి విజయానికి కీలకం. ప్రభుత్వం తీరుపై ఓటర్లు వ్యతిరేకత కలిగి ఉండడంతో బీఆర్ఎస్ పార్టీకి ఆశించినంత ఓట్లు పడలేదని ప్రచారం కొనసాగింది. ఎక్కడ చూసినా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తమ పార్టీలకు ఎన్ని ఓట్లు వచ్చాయంటూ టెన్షన్ పడే సందర్భాలు కనపడ్డాయి. బిజెపి ప్రచారం జోరుగా సాగినా మూడో స్థానానికి పరిమితం అయ్యే ఉన్నట్టు సమాచారం.

# సెబీకి మొట్టికాయలు

## ప్రజా ప్రయోజనాలే కీలకమన్న బాంబే హైకోర్టు

**ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీయొద్దు**

- న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు



**ముంబయి :** పెట్టుబడులు, స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)కి బాంబే హైకోర్టు మొట్టి కాయలు వేసింది. ఓ కేసులో కోర్టు ఆదేశాలను పాటించనందుకు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజా ప్రయోజనాల కోసం సెబీ చర్యలు తీసుకోవాలని.. అందు కోసమే పని చేయాలని ఆదేశించింది. అక్టోబర్‌లో కోర్టు జారీ చేసిన ఆదేశాలను సెబీ పాటించకపోవడంపై తీవ్రంగా స్పందించింది. సెబీ అనుసరిస్తున్న ఇటువంటి విధానం పెట్టుబడిదారులకు ఆ సంస్థపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని న్యాయమూర్తులు జిఎస్ కులకర్ణి, జితేంద్ర జైన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఓ సంస్థలోని మైనారిటీ షేర్ హోల్డర్లకు కొన్ని విచారణ పత్రాలను అందించాలని అక్టోబర్‌లో ఆ కంపెనీని, అదే విధంగా సెబీని హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వును ఆ కంపెనీ, సెబీ సుప్రీంకోర్టులో సవాలు చేశాయి. కాగా.. ఆ అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో తిరిగి విషయం బాంబే హైకోర్టుకు చేరింది.భారత్ నిధి లిమిటెడ్ తన మైనారిటీ వాటాదారుల, సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించిందని ఆరోపిస్తూ సెబీకి వివిధ ఫిర్యాదులు చేశారు. కాగా.. దీనిపై సెబీ దర్యాప్తు ప్రారంభించింది. కంపెనీకి షోకాజ్ నోటీసు జారీ చేసింది. కానీ విచారణ డాక్యుమెంట్లను ఫిర్యాదుదార్లకు ఇవ్వడానికి నిరాకరించింది. దీన్ని సవాల్ చేస్తూ సెబీ చేస్తున్న దర్యాప్తు ప్రహసనంగా ఉందని పిటిషనర్లు ఆరోపించారు. ఫిర్యాదుదారుల సెటిల్‌మెంట్ ఆర్డర్‌ను రద్దు చేసినందున.. ప్రస్తుత పిటిషన్లలో ఏమీ మనుగడలో లేదని సెబీ తాజాగా హైకోర్టుకు తెలిపింది. కాగా.. దీనిపై హైకోర్టు ధర్మాసనం తీవ్రంగా స్పందించింది.

"సెబీ మా ఉత్తర్వులను పాటించడం లేదు. ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదు. ఇది మేము ఊహించడానికి చాలా దూరంగా ఉంది. ఒక పబ్లిక్ బాడీ అయినా సెబీ ప్రజా ప్రయోజనాల కోసం పని చేయాల్సిన అవసరం ఉంది. కోర్టు జారీ చేసిన ఆదేశాలకు లోబడి ఉండాలి. ప్రస్తుత కేసులో సెబీ తీసుకున్న విధానం మమ్మల్ని చాలా ఆశ్చర్యానికి గురి చేసింది. సెబి విధానం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. పార్లమెంట్ ద్వారా అందుబాటులోకి వచ్చిన రెగ్యూలేటరీ బాడీ సెబీ తన లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి మాత్రమే పని చేయాలి." అని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. తాము ఇచ్చిన ఆదేశాలను సెబి పాటించకుండా ఉండేందుకు సాధ్యమైన అన్ని ప్రయత్నాలను ఆశ్రయించిందని, ఇది అర్థరహితమని పేర్కొంది. పిటిషనర్లకు పత్రాలను అందించాల్సిన అవసరం ఉందని, తన ఆదేశాలను సెబీ వెంటనే పాటించాలని ధర్మాసనం ఆదేశించింది.

**బిజినెస్**

## తగ్గిన విమానయాన ఇంధన ధర

- పెరిగిన గ్యాస్ ధర



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం విమానయాన ఇంధన ధరలను తగ్గించి.. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను పెంచుతూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. ధనవంతులు ఎక్కువగా ప్రయాణించే విమానాలకు సంబంధించిన ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్) ధరలను ఒక్కో కిలోలీటర్‌పై రూ.5,189.25 తగ్గించి రూ.1,06,155.67కు చేర్చింది. దీంతో ఈ నెలలో వరుసగా రెండో సారి ఎటిఎఫ్ ధరలకు కోత పెట్టినట్లయ్యింది. మరోవైపు వాణిజ్య వంట గ్యాస్ సిలిండర్ ధరను మరోసారి పెంచింది. 19 కిలోల కమర్షియల్ ఎల్పిజి సిలిండర్‌పై రూ.21 ధర పెంచింది. దీంతో ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1,796.50కు చేరింది. మరోవైపు గడిచిన 21 నెలలుగా పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి.

## బ్యాంక్‌లకు చేరని రూ.9,760 కోట్ల విలువ చేసే రూ.2వేల నోట్లు



**న్యూఢిల్లీ :** రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బిఐ ప్రకటన చేసి ఆరు నెలలు అవుతోన్న ఇంకా ఆ కరెన్సీకి చెందిన వేల కోట్లు బ్యాంక్‌లకు చేరలేదు. నవంబర్ 30 నాటికి రూ.2,000 నోట్లలో 97.26 శాతం బ్యాంకుల్లో జమ అయ్యాయని ఆర్‌బిఐ వెల్లడించింది. మిగితా 2.7 శాతం లేదా రూ.9,760 కోట్లు విలువ చేసే రూ.2వేల నోట్లు చెలామణిలోనే ఉన్నాయని పేర్కొంది. ఈ పెద్ద నోట్లను అక్టోబర్ 7నుంచి బ్యాంక్‌ల్లో డిపాజిట్‌కు, మార్పిడికి అవకాశాన్ని నిలిపివేసింది. ప్రస్తుతం ఆర్‌బిఐ రీజినల్ ఆఫీసుల్లో మాత్రమే మార్చుకోవడానికి వీలుంది.

## భారత్- మలేసియా మధ్య 69 విమానాలు

- ఏయిర్ ఆసియా వెల్లడి




**న్యూఢిల్లీ:** భారత్-మలేసియా మధ్య భారీగా విమానయాన సేవలను పెంచుతున్నట్లు ఏయిర్ ఆసియా వెల్లడించింది. వచ్చే ఏడాది 2024లో మొదటి 3 నెలల్లో వారానికి 69 విమానాలను తిప్పనున్నట్లు తెలిపింది. ఏడాదికి 15 లక్షల సీట్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొంది. 2023 డిసెంబర్ ఒక్కటో తేది నుంచి భారత్ నుంచి మలేషియాలోకి వచ్చే ప్రయాణికులకు 30 రోజుల వీసా-రహిత ప్రవేశాన్ని మలేషియా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ప్రయాణికులపై దృష్టి పెట్టింది.

## నిధుల సమీకరణలో ఇంటెగ్ర ఎస్సెన్సియా

**హైదరాబాద్ :** వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల వ్యాపారాల్లో ఉన్న ఇంటెగ్రా ఎసెన్సియా రూ.100 కోట్ల నిధులను సమీకరించనున్నట్లు తెలిపింది. రెండు దఫాల్లో ఈ నిధులను సేకరించడానికి కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారని రెగ్యూలేటరీ సంస్థలకు తెలిపింది. అదే విధంగా వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను అందివ్వడానికి ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. రికార్డ్ తేది నాటికి రూ.1 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌కు మరో షేర్‌ను కేటాయించనున్నట్లు వెల్లడించింది. సంస్థ వృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు సెక్యూరిటీలను జారీ చేయడం ద్వారా రూ.100 కోట్ల వరకు నిధులు సమీకరించనున్నట్లు ఇంటెగ్రా ఎసెన్షియా లిమిటెడ్ పేర్కొంది. ఇటీవల పలు సంస్థల నుంచి రూ.150 మిలియన్ల ఆర్డర్లను పొందినట్లు వెల్లడించింది.

## నవంబర్‌లో రూ.1.68 లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లు




**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఏడాది నవంబర్‌లో దేశంలో రూ.1,67,929 కోట్ల వస్తు సేవల పన్నులు (జిఎస్‌టి) వసూళ్లయ్యాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 15 శాతం పెరిగాయి. గడిచిన నెల వసూళ్లలో సిజిఎస్‌టి వాటా రూ.30,420 కోట్లు, ఎస్‌జిఎస్‌టి కింద రూ.38,226 కోట్లు. ఐజిఎస్‌టి రూపంలో రూ.87,009 కోట్ల చొప్పున వసూళ్లయ్యాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. అదే విధంగా సెస్సుల రూపంలో రూ.12,274 కోట్లు వచ్చాయని పేర్కొంది. ప్రస్తుత 2023-24లో జిఎస్‌టి వసూళ్లు రూ.1.60 లక్షల కోట్ల మార్కును దాటడం ఇది ఆరోసారి కావడం విశేషం. గడిచిన నెలలో ఆంధ్రప్రదేశ్‌లో రూ.4,093 కోట్లు వసూళ్లు నమోదయ్యాయి. గతేడాది నెలలోని రూ.3,134 కోట్ల వసూళ్లతో పోలిస్తే 31 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. క్రితం నెలలో తెలంగాణలో 18 శాతం వృద్ధితో రూ.4,986 కోట్ల జిఎస్‌టి వసూళ్లు కాగా.. గతేడాది ఇదే నెలలో 4,228 కోట్లు వసూళ్లు జరిగాయి.

**నవతెలంగాణపై స్పందన**
**ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016**

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

**అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.**



**హైదరాబాద్‌లో.. బంగారం ధరలు**
**(10 గ్రాములకు రూ.లలో)**

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్లు | 62,950 | ▲ | 220 |
| 22 క్యారెట్లు | 57,700 | ▲ | 200 |
| కిలో వెండి | 82,500 | ▲ | 300 |



**చికెన్ ధరలు**
**హైదరాబాద్**
**బ్రాయిలర్ చికెన్**

| | |
|---|---|
| ఫారం రేటు | రూ. 86 |
| రిటైల్ (లైవ్) | రూ. 108 |
| స్కిన్‌తో | రూ. 157 |
| స్కిన్‌లెస్ | రూ. 178 |

# అక్షర్ దెబ్బకు ఆసీస్ కుదేల్..

• నాల్గో టి20లో 20పరుగుల తేడాతో నెగ్గిన భారత్ • సిరీస్ కైవసం



**రాయ్‌పూర్:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాల్గో టి20లో స్పిన్నర్ అక్షర్ పటేల్ మెరిసాడు. భారత్ నిర్దేశించిన 175పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 154పరుగులే చేయగల్గింది. స్పిన్నర్ అక్షర్ పటేల్(3/16), బిష్ణోయ్(1/17) ఆస్ట్రేలియాను కట్టడి చేశారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 174పరుగులు చేసింది. ఓ దశలో 4వికెట్ల నష్టానికి 167పరుగులతో పటిష్టంగా ఉన్న టీమిండియా.. 7పరుగుల వ్యత్యాసంలో ఐదు వికెట్లు కోల్పోయి భారీస్కోర్‌కు దూరంగా నిలిచింది. ఆసీస్ బౌలర్లు చివర్లో సమయోచితంగా బౌలింగ్ చేశారు. రింకూ సింగ్ 29 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులతో 46 పరుగులకు తోడు వికెట్ కీపర్ జితేశ్ శర్మ 19 బంతుల్లో ఫోర్, 3 సిక్సులతో 35 పరుగులు సాధించాడు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ 37, రుతురాజ్ గైక్వాడ్ 32 పరుగులు చేశారు. శ్రేయస్ అయ్యర్ (8), సూర్యకుమార్ యాదవ్ (1) నిరాశపరిచారు. ఆసీస్ బౌలర్లలో బెన్ డ్వార్షస్‌కు మూడు, బెహ్రెన్ డార్ఫ్, సంఘాకు రెండేసి, ఆరోన్ హార్డీకి ఒక వికెట్ దక్కాయి.

అనంతరం ఆస్ట్రేలియా జట్టు 3ఓవర్లలోనే 40పరుగులు చేసి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. ఆ దశలో స్పిన్నర్ రవి బిష్ణోయ్... ఫిలిప్‌ను బౌల్డ్‌చేసి తొలి బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత అక్షర్ రాణించడంతో ఆసీస్ జట్టు వరుసగా వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ మాధ్యూ వేడ్(36నాటౌట్), హెడ్(31) టాప్ స్కోరర్స్. అక్షర్‌కు మూడు, దీపక్ చాహర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అక్షర్ పటేల్‌కు దక్కగా... ఐదో, చివరి టి20 బెంగళూరు వేదికగా ఆదివారం జరగనుంది.

**రుతురాజ్ రికార్డు...**

రుతురాజ్ గైక్వాడ్ మరో మైలురాయికి చేరువయ్యాడు. టి20ల్లో వేగంగా 4వేల పరుగుల కొట్టి క్లబ్‌లో చేరాడు. పొట్టి ఫార్మాట్‌లో వేగంగా 4 వేల రన్స్ కొట్టిన ఐదో క్రికెటర్‌గా గైక్వాడ్ రికార్డు సృష్టించాడు. రాయ్‌చూర్‌లో ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టీ20లో గైక్వాడ్ ఈ ఫీట్ సాధించాడు. గైక్వాడ్ 116 ఇన్నింగ్స్‌ల్లోనే అతడు 4 వేల పరుగులు బాదాడు. దాంతో కేఎల్ రాహుల్ (117 ఇన్నింగ్స్‌లు) రికార్డు బద్దలైంది. టీ20ల్లో వేగంగా 4వేల పరుగులు కొట్టిన వాళ్ల జాబితాలో క్రిస్ గేల్(107 ఇన్నింగ్స్‌లు) ముందున్నాడు. అతడి తర్వాత షాన్ మార్ష్(113 ఇన్నింగ్స్‌లు), బాబర్ ఆజాం(115 ఇన్నింగ్స్‌లు), డెవాన్ కాన్వే(116 ఇన్నింగ్స్‌లు) వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు.

**స్కోర్‌బోర్డు..**



**ఇండియా ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి)డెర్మాట్ (బి)హార్డి 37, గైక్వాడ్ (సి)ద్వార్షస్ (బి)సంఘా 32, శ్రేయస్ (సి)క్రిస్ గ్రీన్ (బి)సాంఘా 8, సూర్యకుమార్ (సి)వేడ్ (బి)ద్వార్షస్ 1, రింకు సింగ్ (ఎల్‌బి)బెహ్రెన్‌డార్ఫ్ 46, జితేశ్ శర్మ (సి)హెడ్ (బి)ద్వార్షస్ 35, అక్షర్ పటేల్ (సి)సంఘా (బి)ద్వార్షస్ 0, దీపక్ చాహర్ (సి)క్రిస్ గ్రీన్ (బి)బెహ్రెన్‌డార్ఫ్ 0, రవి బిష్ణోయ్ (రనౌట్) ఫిలిప్స్/హెడ్ 4, ఆవేశ్ ఖాన్ (నాటౌట్) 1, అదనం 10. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 174పరుగులు.

**వికెట్ల పతనం:** 1/50, 2/62, 3/63, 4/111, 5/167, 6/168, 7/168, 8/169, 9/174

**బౌలింగ్:** హార్డి 3-1-20-1, బెహ్రెన్‌డార్ఫ్ 4-0-32-2, ద్వార్షస్ 4-0-40-3, క్రిస్ గ్రీన్ 4-0-36-0, సాంఘా 4-0-30-2, షార్ట్ 1-0-10-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (సి) ముఖేశ్ (బి)అక్షర్ 31, ఫిలిప్స్ (సి)బిష్ణోయ్ 8, డెర్మాట్ (బి)అక్షర్ 19, హార్డీ (బి)అక్షర్ 8, టిమ్ డేవిడ్ (సి)జైస్వాల్ (బి)దీపక్ చాహర్ 19, షార్ట్ (సి)జైస్వాల్ (బి)చాహర్ 22,

వేడ్ (నాటౌట్) 35, డ్వార్షస్ (బి)ఆవేశ్ ఖాన్ 1, క్రిస్ గ్రీన్ (నాటౌట్) 2, అదనం 8, (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 154పరుగులు.

వికెట్ల పతనం: 1/40, 2/44, 3/52, 4/87, 5/107, 6/126, 7/133

బౌలింగ్: దీపక్ చాహర్ 4-0-44-2, ముఖేశ్ కుమార్ 4-0-42-0, రవి బిష్ణోయ్ 4-0-17-1, అక్షర్ పటేల్ 4-0-16-3, ఆవేశ్ ఖాన్ 4-0-33-1.



# కబడ్డీ..కబడ్డీ

• నేటి నుంచి ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్
• తెలుగు టైటాన్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య తొలి పోరు

**అహ్మదాబాద్ :** కబడ్డీ ఆటకు వేళయైంది. గ్రామీణ క్రీడకు కార్పొరేట్ హంగులు అద్దుతూ అభిమానులను అలరిస్తున్న కబడ్డీ మరోమారు సిద్ధమైంది. ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) పదో సీజన్‌కు శనివారం తెరలేవనుంది. తెలుగు టైటాన్స్, గుజరాత్ జెయింట్స్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది. గత సీజన్లను మరిపిస్తూ ఈసారి దుమ్మురేపాలన్న పట్టుదలతో టైటాన్స్ బరిలోకి దిగుతున్నది. 2014లో మొదలైన పీకేఎల్ 30 సెకన్ల రైడ్, డూ ఆర్ డై రైడ్స్, సూపర్ రైడ్స్, సూపర్ ట్యాకిల్ లాంటి వినూత్న నియమాలను అమలు చేసి అభిమానులకు మరింత చేరువైంది. ఈ కారణంగా దేశంలో క్రికెట్ తర్వాత అత్యధిక జనాదరణ కల్గిన లీగ్‌గా కబడ్డీ రికార్డుల్లోకెక్కింది. లీగ్ పదో సీజన్‌లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా శుక్రవారం అహ్మదాబాద్‌లోని అక్షర్ రివర్‌క్రూజ్‌లో వివిధ ఫ్రాంచైజీ కెప్టెన్లతో కలిసి లీగ్ కమిషనర్ అనుపమ్ గోస్వామి ట్రోఫీని ఆవిష్కరించారు. రైడింగ్‌లో తనకంటూ ప్రత్యేకతను దక్కించుకున్న పవన్ షెరావత్ ఈసారి కెప్టెన్‌గా వ్యవహరించడం టైటాన్స్‌కు బాగా కలిసిరానుంది. ఈ సందర్భంగా పవన్ మీడియాతో మాట్లాడుతూ 'తమ తొలి మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో తలపడబోతున్నాం. మ్యాట్‌పై అడుగుపెట్టేందుకు ఎప్పుడెప్పుడా ఆతతగా ఎదురుచూస్తున్నా. గత సీజన్‌కు దూరంగా ఉండటం నిరాశ కల్గించింది. మొదటి మ్యాచ్‌లో ఫజల్ అత్రాచలి ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాను. కోచింగ్ క్యాంప్‌లో ప్లేయర్లందరూ మెరుగైన శిక్షణ పొందారు' అని అన్నాడు. పీకేఎల్ అహ్మదాబాద్ అంచె ఈ నెల 7వరకు జరుగనుండగా, జనవరి 19 నుంచి 24 వరకు జరిగే మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. పీకేఎల్ స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

# ఉత్కంఠపోరులో హాకీ అమ్మాయిలు ఓటమి

• మహిళల హాకీ జూనియర్ ప్రపంచకప్



**న్యూఢిల్లీ :** మహిళల హాకీ జూనియర్ ప్రపంచకప్‌లో భారత జట్టు పరాజయాన్ని చవిచూసింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ 3-4గోల్స్ తేడాతో జర్మనీ చేతిలో ఓడింది. భారత్ తరఫున అన్ను(11వ ని.), రూప్‌ని కుమారి(14వ ని.), ముంతాజ్ ఖాన్(24వ ని.) ఒక్కో గోల్ కొట్టారు. ఇక జర్మనీ తరఫున సోఫియా(17వ ని.), ఫ్లుట్(21, 36వ ని.), కరోలిన్(38వ ని.) ఒక్కో గోల్ కొట్టారు. తొలి క్వార్టర్ ముగిసేసరికి భారత్ 2-0గోల్స్ ఆధిక్యతలో నిలువగా.. రెండో క్వార్టర్‌లో జర్మనీ రెండు, భారత్ ఒక గోల్ కొట్టాయి. దీంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి భారత్ 3-2గోల్స్‌తో ఆధిక్యతలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో జర్మనీ రెండు గోల్స్ చేయడంలో 3-4తో భారత్ వెనుకబడింది. నిర్ణయాత్మక మూడో, చివరి క్వార్టర్‌లో ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో జర్మనీ జట్టు 4-3గోల్స్‌తో భారత్‌ను ఓడించింది. తొలి మ్యాచ్‌లో భారత్ జట్టు కెనడాను చిత్తుచేయగా.. డిసెంబర్ 2న జరిగే మూడో మ్యాచ్‌లో భారత జట్టు బెల్జియంతో తలపడనుంది.


# అప్పటిదాకా అతడే టీమిండియా కెప్టెన్‌గా ఉండాలి

• బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ



**న్యూఢిల్లీ :** మూడు ఫార్మాట్లలో టీమిండియా కెప్టెన్‌గా రోహిత్ శర్మనే ఉండాలని మాజీ సారథి, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ ముగిసేంత వరకు హిట్‌మ్యాన్‌ను కొనసాగిస్తేనే అనుకున్న ఫలితాలు రాబట్టగలరని తెలిపారు. కాగా వన్డే వరల్డ్‌కప్-2023 తర్వాత రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20లకు పూర్తిగా దూరం కానున్నాడనే వార్తలు వినిపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హార్దిక్ పాండ్యా పగ్గాలు చేపట్టాల్సి ఉండగా.. అతడు ఇంకా గాయం నుంచి కోలుకోలేదు. దీంతో ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లో జట్టును ముందుండి నడిపిస్తున్న సూర్యకుమార్ యాదవ్‌నే సఫారీలతోనూ కెప్టెన్‌గా కొనసాగించనున్నారు. ఇక వన్డే కెప్టెన్సీని కేఎల్ రాహుల్‌కు అప్పగించారు. అయితే, టెస్టు సిరీస్‌లో మాత్రం రోహిత్ శర్మ జట్టుతో కలువనున్నాడు. ఈ పరిణామాలపై సౌరవ్ గంగూలీ స్పందిస్తూ మేనేజ్‌మెంట్‌కు కీలక సూచనలు చేశాడు. "చాలా మంది ఆటగాళ్ల అందుబాటులో ఉండకపోవడం సమస్యగా పరిణమించింది. సూర్య టీ20 కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అయితే, వన్డేల్లో అతడి స్థానం విషయంలో అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. కాబట్టి 50 ఓవర్ల క్రికెట్‌కు మరో కెప్టెన్ అంటే ఈసారి కేఎల్ రాహుల్ వస్తున్నాడు. ఇక రోహిత్ టెస్టులు ఆడాలనుకుంటున్నాడు కాబట్టి తనే సారథిగా ఉంటాడు.

# అగౌరవపర్చలేదు : మిచెల్ మార్ష్



**న్యూఢిల్లీ :** టీమ్‌ఇండియాపై విజయం సాధించిన ఆస్ట్రేలియా ఆరోసారి వన్డే ప్రపంచకప్‌ను కైవశం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆటతీరు ఆకట్టుకున్నా.. ఆస్ట్రేలియా జట్టు ఆటగాడు మిచెల్ మార్ష్ ప్రవర్తన విమర్శలకు దారితీసింది. వరల్డ్ కప్‌పై కాళ్లు పెట్టి ట్రోలింగ్‌కు గురయ్యాడు. ఇలా ప్రవర్తించడం సరైంది కాదని మాజీ క్రికెటర్లు, అభిమానులు తెలిపారు. కాగా, తనపై వస్తున్న విమర్శలు, ట్రోలింగ్‌పై దాదాపు రెండు వారాల తర్వాత మిచెల్ మార్ష్ స్పందించాడు.

"సోషల్ మీడియాలో వస్తున్న ఆ ఫొటోలో ఎలాంటి అమర్యాద ప్రవర్తన కనిపించడం లేదు. దాని గురించి తీవ్రంగా ఆలోచించాలని అనుకోవడం లేదు. అసలు నేను సోషల్ మీడియాను ఎక్కువగా చూడను. కానీ, సహచరులు, స్నేహితులు దాని గురించే చెప్పారు. కానీ, నాకు మాత్రం అందులో ఎలాంటి తప్పు కనిపించడం లేదు" అని మార్ష్ వెల్లడించాడు.




# నవచిత్రం

## వైవిధ్యమైన ప్రేమకథతో
# ది గర్ల్ ఫ్రెండ్

రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. 'చి.ల.సౌ, మన్మథుడు 2' చిత్రాలతో దర్శకుడిగా మంచి పేరు తెచ్చుతున్న రాహుల్ రవీంద్రన్ దీన్ని రూపొందిస్తున్నారు. విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని నిర్మాతలు. కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఈ సినిమా హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది.

ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ నివ్వగా, డైరెక్టర్ మారుతి కెమెరా స్విచ్చాన్ చేశారు. డైరెక్టర్ సాయి రాజేశ్ ఫస్ట్ షాట్‌కు దర్శకత్వం వహించారు. వైవిధ్యమైన ప్రేమకథతో తెరకెక్కనున్న ఈ సినిమా త్వరలో రెగ్యులర్ షూటింగ్‌కి వెళ్లనుంది.

ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - కృష్ణన్ వసంత్, సంగీతం - హేషమ్ అబ్దుల్ వాహబ్, ప్రొడక్షన్ డిజైన్ - ఎస్ రామకృష్ణ, మౌనిక నిగోత్రి, సమర్పణ - అల్లు అరవింద్, నిర్మాతలు - విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని, రచన -దర్శకత్వం - రాహుల్ రవీంద్రన్.

# పవర్ ఆఫ్ సుబ్రమణ్యం

హీరో సుధీర్ బాబు నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో ఎస్ఎస్‌సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్నారు. ప్రభాస్, మమ్ముట్టి, టైగర్ ష్రాఫ్, విజయ్ సేతుపతి, కిచ్చా సుదీప్ వంటి అగ్ర కథానాయకులు 'పవర్ ఆఫ్ సుబ్రమణ్యం' పేరుతో తెలుగు, మలయాళం, హిందీ, తమిళం, కన్నడ భాషల్లో 'హరోం హర' టీజర్‌ను లాంచ్ చేశారు.

హీరోని పోలీసులు అరెస్టు చేయడంతో టీజర్ ప్రారంభమవుతుంది. అతని మద్దతుదారులు వారిని ఆపడానికి ప్రయత్నిస్తారు. సుబ్రమణ్యంగా సుధీర్ బాబు సాధారణ వ్యక్తి, కానీ పరిస్థితులు అతన్ని హింసాత్మక మార్గంలో నడిపిస్తుంటాయి. కథాంశాన్ని రివీల్ చేయకుండా అన్ని ప్రధాన పాత్రలను, సినిమా ప్రిమైజ్‌ని ఆకట్టుకునేలా అద్భుతంగా టీజర్ ప్రెజెంట్ చేసింది.

టీజర్‌ని చాలా ఇంటెన్స్, ఎనర్జీతో కూడిన అంశాలతో అద్భుతంగా కట్ చేశారు. యుద్ధభూమిలో మనుగడ సాగించడానికి, విజయం సాధించడానికి ధైర్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉందని టీజర్ చూస్తోంది. దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక పీరియడ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఓ పల్లెటూరి కథను ఎంచుకుని, దాన్ని అత్యంత అద్భుతంగా అందించాడు. ఈ యాక్షన్ ప్యాక్డ్ సెటప్‌కి డైలాగ్‌లు మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి. సాధారణ వ్యక్తి నుంచి శక్తివంతమైన వ్యక్తిగా ఎదిగే సుబ్రమణ్యం పాత్రను సుధీర్‌బాబు అద్భుతంగా పోషించారు. తన పాత్రలో చాలా లేయర్స్ ఉన్నాయి. పవర్ ఫుల్ రోల్, సరికొత్త మేకోవర్‌లో సుధీర్ బాబు ప్రేక్షకులని కట్టిపడేశారు. కుప్పం నేపథ్యంలో సాగే కథ కావడంతో రాయలసీమ స్లాంగ్‌లో పలికిన డైలాగులు ఆకట్టుకున్నాయి. సునీల్ తన ప్రెజెన్స్‌తో అలరించాడు. మాళవిక శర్మ హీరోయిన్‌గా ఆకట్టుకుంది. లక్కీ లక్ష్మణ్, రవి కాలే, అర్జున్ గౌడ ముఖ్యమైన పాత్రలు పోషించి మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చారు.

వచ్చే ఏడాది ప్రారంభంలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీలో విడుదల కానున్న ప్రాజెక్ట్ పై ఈ టీజర్ చాలా ఎగ్జైట్‌మెంట్‌ని క్రియేట్ చేసింది అని చిత్ర యూనిట్ తెలిపింది.



సుధీర్‌బాబు



మణి సాయితేజ, అనిల్ రావిపూడి, రేఖ నిరోషా

# మెకానిక్ రిలీజ్‌కి రెడీ

టీనా శ్రీ క్రియేషన్స్ బ్యానర్ పై మణి సాయి తేజ, రేఖ నిరోషా జంటగా నటిస్తున్న చిత్రం 'మెకానిక్'. ట్రబుల్ షూటర్ అనేది ట్యాగ్ లైన్. ముని సహేకర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నాగ మునెయ్య (మున్నా) నిర్మిస్తున్నారు. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 15న విడుదలకి రెడీ అవుతోంది. డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ చిత్రటీజర్‌కు సంబంధించిన పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ సినిమా కోసం సిద్ శ్రీరామ్ పాడిన 'నచ్చేసావే పిల్లా నచ్చేసావే ..' ఇన్‌స్టాగ్రామ్‌లో 100మిలియన్ వ్యూస్ సాధించగా, యూ ట్యూబ్‌లో 8 మిలియన్ వ్యూస్ సాధించి ట్రెండింగ్‌లో ఉంది. అలాగే 'టూ లెట్ బోర్డ్ ఉందీ - నీ ఇంటికి' అనే మరో పాట 1.6 మిలియన్ వ్యూస్‌తో అందర్నీ అలరిస్తోంది. ఈ సినిమా నుండి కైలాష్ ఖేర్ పాడిన మరో ఎమోషనల్ సాంగ్ అతి త్వరలో రిలీజ్ చేయనున్నట్టు మేకర్స్ తెలిపారు.

నందిపాటి శ్రీధర్ రెడ్డి, కొండ్రాసి ఉపేందర్ సహ నిర్మాతలుగా వ్యవహరించారు. ఈ సినిమా తెలుగుతో పాటు తమిళం, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది.

# వధువు వెబ్ సిరీస్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది



సరికొత్త కంటెంట్ తో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ అందిస్తున్న మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ "వధువు". ఈ వెబ్ సిరీస్ లో అవికా గోర్, నందు, అలీ రెజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ ను ఎస్వీఎఫ్ బ్యానర్ లో శ్రీకాంత్ మొహ్తా, మహేంద్ర సోని నిర్మిస్తున్నారు. పోలూరు కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి "వధువు" వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతోంది. ఈ సందర్భంగా "వధువు" వెబ్ సిరీస్ హైలైట్స్, ఇందులో నటించిన ఎక్స్‌పీరియన్స్ తెలిపింది అవికా గోర్.

డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో ఇటీవల మాన్షన్ 24 అనే వెబ్ సిరీస్ లో నటించాను. అదే టైమ్ లో "వధువు" ప్రాజెక్ట్ గురించి చెప్పారు. బెంగాలీ సక్సెస్ ఫుల్ వెబ్ సిరీస్ ఇందును తెలుగులోకి "వధువు"గా తీసుకొస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ నా దగ్గరకు వచ్చినప్పుడు ఎగ్జైట్ అయ్యాను. ఎందుకంటే ఇలాంటి స్క్రిప్ట్ లో నేను ఇప్పటిదాకా నటించలేదు. నేను గతంలో చేసిన బబ్లీనెస్ ఈ క్యారెక్టర్ లో ఉండదు. ఒక యూనిక్ క్యారెక్టర్ దొరికింది.

చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ చేసేప్పుడు నాకు పదేళ్ల వయసు. అప్పటికి పెళ్లంటే ఏంటి.. పెళ్లి కూతురు ఎలా ఉండాలి, ఇంట్లో ఎలా వ్యవహరించాలి అనే విషయాలపై ఏమాత్రం అవగాహన లేదు. సందేహాలు వస్తే డైరెక్టర్ ను అడిగేదాన్ని. ఇప్పుడు "వధువు" వెబ్ సిరీస్ చేస్తున్నప్పుడు అలాంటి ఇబ్బంది లేదు.

దర్శకుడు పోలూరు కృష్ణ అనుభవం ఉన్న డైరెక్టర్. "వధువు" వెబ్ సిరీస్ ను ఆయన హాట్ స్టార్ లో ఉండాల్సిన క్వాలిటీ మెయింటేన్ చేస్తూనే టీవీ ఆడియెన్స్ కు రీచ్ అయ్యేలా రూపొందించాడు. ప్రతి సీన్ లో ఆ సస్పెన్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉండేలా చూసుకున్నాడు. "వధువు" క్రెడిట్ మా డైరెక్టర్ కు దక్కుతుంది. మా ఇంట్లో వాళ్లు వధువు ట్రైలర్ చూసినప్పుడు చాలా హ్యాపీగా ఫీలయ్యారు.

"వధువు" వెబ్ సిరీస్ లో ఇందూ క్యారెక్టర్ చాలా మెచ్యూర్డ్ గా ఉంటుంది. ఆమెకు తనదైన ఒక స్టోరి ఉంటుంది. తన లైఫ్ లో జరిగిన ఈవెంట్స్ ఇందు మనసులో మెదులుతూ ఉంటాయి. ఒక సాధారణ పెళ్లి కూతురుగా ఆమె ఉండదు.

ఈ వెబ్ సిరీస్ లో వెడ్డింగ్ సీక్వెన్స్ ఆసక్తికరంగా ఉంటుంది. పెళ్లి జరుగుతున్న టైమ్ లో ఇందుకు తెలిసిన ఒక మహిళ అక్కడికి వస్తుంది. ఆమెను ఎవరూ పెళ్లికి పిలవకున్నా ఎందుకు వచ్చిందనే విషయంలో ఇందు షాక్ కు గురవుతుంది. ఆమె క్యారెక్టర్ ఎంట్రీతో ఈ వెడ్డింగ్ సీక్వెన్స్ లో డ్రామా క్రియేట్ అవుతుంది. మాన్షన్ 24 వెబ్ సిరీస్ తో పాటు వధువులో నందుతో కలిసి నటించా. తను మంచి కోస్టార్. వధువులో ఆయన పర్ ఫార్మెన్స్ చాలా బాగుంటుంది.

ఉయ్యాల జంపాల సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నా. ఆ సినిమా ఇంపాక్ట్ ఇప్పటికీ నా కెరీర్ మీద ఉంది. ఆ తర్వాత కొన్ని మంచి ప్రాజెక్ట్స్ చేసే అవకాశం ఇండస్ట్రీ నాకు ఇచ్చింది. ఇటీవల పాప్ కార్న్ అనే సినిమాకు ప్రొడ్యూసర్ గా మారాను. ఆ సినిమా నా కెరీర్ లో ఎంతో స్పెషల్ గా నిలుస్తుంది. నా దగ్గరకు ఎక్కువగా సస్పెన్స్, థ్రిల్లర్ సబ్జెక్ట్స్ వస్తున్నాయి. మంచి లవ్ స్టోరీస్ వచ్చినా చేస్తాను. నటిగా నాకు ఒకే జానర్ లో కంటిన్యూ కావాలని లేదు. ప్రస్తుతం తెలుగులో ఆది సాయికుమార్ హీరోగా ఒక సినిమా చేస్తున్నా అలాగే హిందీలో కొన్ని ప్రాజెక్ట్స్ లో నటిస్తున్నా.

# బచ్చల మల్లి గ్రాండ్ గా ప్రారంభం




హీరో అల్లరి నరేష్ తన 63వ చిత్రం కోసం సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ దర్శకుడు సుబ్బు మంగాదేవితో చేతులు కలిపారు. బ్లాక్ బస్టర్ 'సామజవరగమనా' చిత్రాన్ని అందించిన హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇది బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం. 4. టైటిల్‌ను శుక్రవారం ప్రకటించారు. ఈ చిత్రానికి 'బచ్చల మల్లి' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. టైటిల్ పోస్టర్‌లో పూర్తిగా లోడ్ చేయబడిన ట్రాక్టర్ లోయలో పడిపోతున్నట్లు కనిపిస్తోంది. ట్రాక్టర్‌పై టైటిల్ రాసి ఉంది. టైటిల్ పోస్టర్ ద్వారా సినిమాలో యాక్షన్ ఎక్కువగా ఉంటుందని అర్థమౌతోంది

బచ్చల మల్లి ఈరోజు గ్రాండ్ గా లాంచ్ అయింది. ముహూర్తం షాట్‌కు ప్రతాప్‌రెడ్డి కెమెరా స్విచాన్ చేయగా, అనిల్ రావిపూడి క్లాప్ ఇచ్చారు. విజయ్ కనకమేడల తొలి షాట్‌కి గౌరవ దర్శకత్వం వహించారు. స్క్రిప్ట్‌ని మారుతీ, బుచ్చిబాబు మేకర్స్‌కి అందజేశారు. అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో సూచించినట్లుగా, న్యూ -ఏజ్ యాక్షన్ డ్రామాగా యూనిక్ కథతో ఈ చిత్రం రూపొందుతోంది. అల్లరి నరేష్ ఇంటెన్సివ్ రోల్ ప్లే చేయబోతున్నారు. పూర్తిగా కొత్త లుక్ లో కనిపించనున్నారు.

అల్లరి నరేష్ కు జోడిగా అమృత అయ్యర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కోట జయరామ్, రావు రమేష్, సాయి కుమార్, ధనరాజ్, హరితేజ లాంటి ప్రముఖ నటీనటులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందనున్న 'బచ్చల మల్లి'లో ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. 'సీతారామం' ఫేమ్ విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా, మానాడు, రంగం, మట్టి కుస్తి చిత్రాలకు పనిచేసిన రిచర్డ్ ఎం నాథన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఛోటా కె ప్రసాద్ ఎడిటర్, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్.

కథ, సంభాషణలు సుబ్బు స్వయంగా అందించగా, విప్పర్తి మధు స్క్రీన్‌ప్లే, అదనపు స్క్రీన్‌ప్లే విశ్వనేత్ర అందించారు. ఈ చిత్రం 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఉండబోతుంది. ఈ సినిమా రెగ్యులర్ షుటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది. తారాగణం: అల్లరి నరేష్, అమృత అయ్యర్, రోహిణి, కోట జయరామ్, రావు రమేష్, సాయి కుమార్, ధనరాజ్, హరి తేజ, ప్రవీణ్, ప్రసాద్ బెహరా, భాను, రోషన్, అంకిత కొయ్య.

ఐద్వా అదాలత్
సెల్ : 9490098024

# స్నేహం పేరుతో సమస్యలు సృష్టిస్తే...

**ఓదార్పు కోసం మన స్నేహితులతో కొన్ని సమస్యలు చెప్పుకుంటాం. అర్థం చేసుకునే స్నేహితులైతే మంచి సలహాలు, సూచనలు ఇచ్చి మన జీవితాన్ని మంచి మార్గంలో పెడతారు. స్వార్థం ఉన్న వారైతే మన సమస్యలను తమ అవకాశంగా మలచుకునే ప్రయత్నం చేస్తారు. ఒక్కోసారి వారు సృష్టించే సమస్యల నుండి బయటపడలేక అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అలాంటి సమస్యతోనే ఒక మహిళా ఈ మధ్య ఐద్వా అదాలత్‌కు వచ్చింది. ఇంతకీ ఆమె ఎదుర్కొంటున్న సమస్య ఏంటో, దానికి పరిష్కారం దొరికిందో లేదో తెలుసుకుందాం...**



పల్లవికి ప్రస్తుతం 32 ఏండ్లు ఉంటాయి. డిగ్రీ పూర్తి కాగానే పెండ్లి చేశారు. భర్తతో సంతోషంగా ఉండేది. చిన్న ఉద్యోగం కూడా చేస్తుంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిన్న కుటుంబం అంతా బాగానే ఉంది అనుకుంటున్న సమసయంలో తన కాలేజీ రోజుల్లో క్లాస్‌మెట్ కనిపించాడు. కాలేజీ అయిపోయిన దాదాపు 15 ఏండ్లకు తర్వాత అతను కనిపించాడు. ఆమె అతన్ని గుర్తు పట్టలేకపోయింది. శ్రీకాంత్ ఆమెను గుర్తుపట్టి మాట్లాడించాడు. ఇద్దరూ కలిసి ఒక కాఫీ షాపులో కూర్చొని మాట్లాడుకున్నారు. పల్లవి 'నాకు పెండ్లి అయింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. నా భర్త ప్రైవేటు ఉద్యోగి. అంతా చాలా సంతోషంగా ఉన్నాము' అని చెప్పుకొచ్చింది. అప్పటి నుండి ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. అప్పుడప్పుడు కలుసుకోవడం మొదలుపెట్టారు.

పల్లవి శ్రీకాంత్‌ను తన భర్త రవికి పరిచయం చేసింది. కాలేజీ స్నేహం కాస్త కుటుంబ స్నేహంగా మారింది. అప్పటి వరకు పల్లవి తన ఫోన్ నెంబర్ శ్రీకాంత్‌కి ఇవ్వలేదు. వాళ్ళు కలిసిన ఆరు నెలల తర్వాత రవినే శ్రీకాంత్‌కు పల్లవి ఫోన్ నెంబర్ ఇచ్చాడు. అప్పటి నుండి శ్రీకాంత్ పల్లవికి ఫోన్ చేసి మాట్లాడేవాడు. రవి పల్లవికి ఎక్కువ సమయం కేటాయించేవాడు కాదు. భార్యాభర్తలు కలిసి మాట్లాడుకునే సమయం కూడా చాలా తక్కువ. రవి ఇంటికి వచ్చిన తర్వాత టీవీ, ఫోన్ చూస్తూ కూర్చునేవాడు. పల్లవి మాట్లాడించినా చిరాకుపడేవాడు.

ఇంటిపని, వంటపని, పిల్లల్ని చూసుకుంటూ గడిపేసేది. రవి మాత్రం ఒక్క పని కూడా ముట్టుకునేవాడు కాదు. కనీసం పిల్లలకు హోంవర్క్ కూడా చేయించే వాడు కాదు. పల్లవికి ఆరోగ్యం బాగోకపోయినా ఆస్పత్రికి కూడా తీసుకెళ్ళేవాడు కాదు. అన్నీ ఆమే చూసుకునేది. దాంతో పల్లవికి ఒంటరిగా ఉన్నాననే ఫీలింగ్ వచ్చేది. తన పుట్టింటికి గానీ, బంధువుల ఇంటికి గానీ, ఫంక్షన్లకు గానీ రవి వెళ్ళేవాడు కాదు. బంధువులు అందరూ 'ఏంటి ఎప్పుడూ ఒక్కదానివే వస్తావు, నా భర్తను తీసుకు రావేంటి' అని అడిగేవారు. పల్లవికి ఏం చెప్పాలో తెలిసేది కాదు. అదే విషయం రవికి చెబితే 'ఆయన చాలా బిజీగా ఉంటారు అని చెప్పు' అనేవాడు.

ఆమె ఏం కొనుక్కోవాలన్నా రవి ఒక్క పైసా కూడా ఇచ్చేవాడు కాదు. 'నీవు ఉద్యోగం చేస్తున్నావుగా నీ డబ్బు నువ్వే ఖర్చుపెట్టుకో' అనేవాడు. కానీ తనకు అవసరం వచ్చినా, తన బంధువులకు అవసరం వచ్చినా పల్లవి డబ్బు తీసుకునేవాడు. మళ్ళీ తిరిగి ఇచ్చేవాడు కాదు. పైగా అప్పుడే ఇచ్చేశానుగా అనేవాడు.

ఇటువంటి పరిస్థితుల్లోనే పల్లవికి శ్రీకాంత్ పరిచయం అయ్యాడు. అతని మాటలు ఆమెకు ఒక విధమైన ఆనందాన్ని ఇచ్చేవి. అందుకే ఆమె శ్రీకాంత్‌తో మాట్లాడటానికి ఇష్టపడేది. ఇద్దరూ మంచి స్నేహితులుగానే ఉండేవారు. అయితే కొన్ని రోజుల తర్వాత శ్రీకాంత్ 'నీ పిల్లలను, నీ భర్తను వదిలేసి నాతో వచ్చేసెయ్, నిన్ను బాగా చూసుకుంటా' అంటూ పల్లవిని ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టాడు. దాంతో ఆమెకు ఏం చేయాలో తోచలేదు. ఇలాంటి పరిస్థితుల్లోనే ఐద్వా అదాలత్‌కు వచ్చింది.

మేము శ్రీకాంత్‌ను పిలిపించి మాట్లాడితే 'నాకు పల్లవి అంటే చాలా ఇష్టం. నేను ఆమెను మా కాలేజీ రోజుల నుండే ప్రేమిస్తున్నాను. ఆ విషయం ఆమెకు కూడా తెలుసు. నేను ఆమె కోసమే ఇప్పటి వరకు పెండ్లి చేసుకోలేదు' అన్నాడు. నా ప్రేమ నిజమైనది. కాబట్టే ఇన్నేండ్ల తర్వాత పల్లవిని కలుసుకోగలిగాను. అప్పట్లో నా ప్రేమ గురించి చెబితే నాకు కొంత టైం కావాలి అని అడిగింది. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఏ విషయం చెబుతా అంది. కానీ నాకు చెప్పకుండా పెండ్లి చేసుకుని వెళ్ళిపోయింది. తిరిగి ఇన్న ఏండ్లకు కలిసింది. ఇక నేను ఆమెను వదులుకోలేను. కావాలంటే రవితో నేను మాట్లాడి ఒప్పిస్తాను. అతను ఇప్పుడు నాకు మంచి స్నేహితుడు. నేను చెప్పింది ఏదీ కాదనడు. పల్లవితో నాకు పెండ్లి చేయమన్నా చేసేస్తాడు. ఎందుకంటే అతను కూడా వేరే అమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడు. కాబట్టి మా బంధానికి రవి అడ్డుపడడు. మీరు ఎలాగైనా నాతో పెండ్లికి పల్లవిని ఒప్పించండి' అన్నాడు.

దానికి మేము 'ప్రేమగానీ, పెండ్లి గానీ ఇద్దరు వ్యక్తుల అంగీకారంతో జరుగుతుంది. అంతే గానీ ఒక్కరు ప్రేమ అనుకున్నంత మాత్రానా అది ప్రేమ కాదు. మిమ్మల్ని మంచి స్నేహితుడిగా భావించి పల్లవి మీతో తన సమస్యలన్నీ చెప్పుకుంది. ఓదార్పు పొందాలనుకుంది. కానీ మీరు మాత్రం ఆ స్నేహాన్ని ప్రేమగా భావించారు. నిజంగా పల్లవి మిమ్మల్ని ప్రేమిస్తే రవిని పెండ్లి చేసుకునేది కాదు. ఆమె పెండ్లి చేసుకునే ముందే మీకు విషయం చెప్పేది. అంటే ఆమె ఇష్టపూర్వకంగానే రవిని పెండ్లి చేసుకుంది. ఆమె అతనితో సంతోషంగానే ఉంటుంది. భార్యా భర్తల మధ్య ఏవైనా సమస్యలు వస్తే వారు చూసుకుంటారు. పెండ్లయిన అమ్మాయిని ప్రేమ పేరుతో ఇబ్బంది పెట్టడం కరెక్ట్ కాదు. పల్లవికి మిమ్మల్ని పెండ్లి చేసుకోవడం ఇష్టం లేదు. ఈ విషయంలో ఆమె స్పష్టంగా ఉంది. మీరు నిజంగా ఆమెను ప్రేమిస్తే ఆమె నిర్ణయాన్ని గౌరవించండి. ఇక ఆమెను ఇబ్బంది పెట్టకండి. అలా కాకుండా మీ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తే తర్వాత పరిణామాలు తీవ్రంగా ఉంటాయి' అని హెచ్చరించాము.

రవిని కూడా పిలిపించి 'భార్యా భర్తలు ఒకరికొకరు కాస్త సమయం కేటాయించుకోవాలి. అంతే గానీ వున్న కాస్త టైం కూడా వేరే వారికి కేటాయిస్తే మీ బంధం బలహీనమవుతుంది. మీకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి భవిష్యత్‌పై దృష్టి పెట్టండి. ఇతరులతో సంబంధం పెట్టుకుంటే అది ఎప్పటికైనా నష్టమే. మీ జీవితం నాశనం అవుతుంది. ఇప్పటి నుంచైనా పల్లవితో, పిల్లలతో సంతోషంగా ఉండండి. టీవీ, ఫోన్ చూడడం తగ్గించండి. ఇంటి పనిలో పల్లవికి సాయం చేయండి. అది చూసి పిల్లలు కూడా నేర్చుకుంటారు. పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వడం తల్లిదండ్రులుగా మీ బాధ్యత. ఆ బాధ్యతల నుండి తప్పించుకునే అవకాశం లేదు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని సంతోసంగా ఉండండి. మూడో వ్యక్తిని మీ జీవితంలోకి ఆహ్వానించి అనసరంగా సమస్యలు తెచ్చుకోవద్దు' అని చెప్పి పంపించాము.

> భార్యా భర్తలు ఒకరికొకరు కాస్త సమయం కేటాయించుకోవాలి. అంతే గానీ వున్న కాస్త టైం కూడా వేరే వారికి కేటాయిస్తే మీ బంధం బలహీనమవుతుంది. మీకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి భవిష్యత్‌పై దృష్టి పెట్టండి. ఇతరులతో సంబంధం పెట్టుకుంటే అది ఎప్పటికైనా నష్టమే. మీ జీవితం నాశనం అవుతుంది. ఇప్పటి నుంచైనా పల్లవితో, పిల్లలతో సంతోషంగా ఉండండి. టీవీ, ఫోన్ చూడడం తగ్గించండి. ఇంటి పనిలో పల్లవికి సాయం చేయండి. అది చూసి పిల్లలు కూడా నేర్చుకుంటారు. పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వడం తల్లిదండ్రులుగా మీ బాధ్యత. ఆ బాధ్యతల నుండి తప్పించుకునే అవకాశం లేదు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని సంతోసంగా ఉండండి. మూడో వ్యక్తిని మీ జీవితంలోకి ఆహ్వానించి అనసరంగా సమస్యలు తెచ్చుకోవదు

- వై. వరలక్ష్మి, 9948794051

## కొన్ని జాగ్రత్తలు తీసుకుంటూ...



**వ్యాయామం చేయడం వల్ల కేవలం శారీరక దృఢత్వమే కాదు.. మానసిక ఆరోగ్యం కూడా మన దరిచేరుతుంది. అయితే కొత్తగా వ్యాయామం ప్రారంభించేవారు కొన్ని జాగ్రత్తలు తీసుకుని వాటిని కచ్చితంగా పాటించాలి. అవేంటో తెలుసుకుందాం...**

- వ్యాయామం చేయడం కోసం కొంత మంది నెలలకు నెలలు వేస్ట్ చేస్తుంటారు... పొద్దున లేవాలంటే బద్దకం. పొద్దెక్కదాకా పడుకోవడం.. చివరికి ఆదరాబాదరాగా లేచి ఆఫీసుకు పరుగులెత్తడం.. వీటితోనే చాలా మంది వ్యాయామాన్ని వాయిదా వేస్తుంటారు. దీని నుంచి బయట పడాలంటే ముందు వ్యాయామం చేయడానికి మన మనసును సిద్ధం చేసుకోవాలి. ఎక్సర్‌సైజ్ చేయాలనే కోరిక బలంగా మన మనసులో నాటుకుంటే ఇక మనను ఏ శక్తీ ఆపలేదు. మనసు నియంత్రణలో ఉంటే శరీరం ఆటోమేటిక్‌గా కంట్రోల్ లోకి వచ్చేస్తుంది.
- యువత ఏ టైంలో నైనా వ్యాయామం చేయొచ్చు. వారికి ఎలాంటి అనారోగ్య సమస్యల్లేకుంటే నిశ్చింతగా చేయొచ్చు. కానీ 55 ఏండ్లు దాటిన మహిళలు కొంచెం కేర్ తీసుకోవాలి. ఏమైనా అనారోగ్య సమస్యలుంటే కచ్చితంగా వైద్యుల సూచనలు పాటించి వ్యాయామం ప్రారంభించాలి.
- లక్ష్యం లేని జీవితం వృధా అంటారు. మనం వ్యాయామం క్రమం తప్పకుండా చేయాలంటే కచ్చితంగా లక్ష్యం నిర్ధారించుకోవాలి. అయితే కొత్తగా వ్యాయామం చేసేవాళ్ల చిన్న చిన్న లక్ష్యాలతో ముందుకెళ్లడం ఉత్తమం. పెద్ద గోల్స్ పెట్టుకుంటే అవి సాధించలేని స్థితిలో చాలామంది ముందులోనే వెనుకంజ వేసే ప్రమాదం పొంచి ఉంది.
- లక్ష్యాలు నిర్దేశించుకున్న తర్వాత అనుకున్న ఫలితాలు రాలేదని కుంగిపోకూడదు. ఇన్నాళ్లుగా ఎక్కడెక్కడో తిన్న తిండిని కరిగించడం అనేది ఒక నెలో.. రెండు నెలలో అయ్యే పని కాదు. అది దీర్ఘకాల ప్రక్రియ.
- వ్యాయామం ప్రారంభించిన కొత్తలోనే రోజుకు పది కిలోమీటర్లు పరిగెత్తి అలసిపోకండి. దాని వల్ల మొదటికే మోసం. ఒక ప్రణాళిక ప్రకారం వెళ్తేనే శరీరంలోని కొవ్వు కరిగే అవకాశం ఉంటుంది. మొదట వాకింగ్, డ్యాన్సింగ్, సైక్లింగ్ వంటివి చేయడం ఉత్తమం. రన్నింగ్ చేయాలనుకుంటే చిన్నగా ప్రారంభించాలి. రోజుకు కొంతదూరం పెంచుకోవాలే తప్ప ఒకేసారి చేయకూడదు.
- ఉదయం లేవగానే షూ లేస్ కట్టుకుని ఇంటిదగ్గర్నుంచే పరిగెత్తాలనే ఆదుర్దను వదిలేయండి. వ్యాయామానికంటే ముందు మన బాడీని అందుకు సిద్ధం చేయాలి. అందుకోసం వార్మప్ కచ్చితంగా చేయాలి. అలా చేయడం వల్ల మన బాడీని ఎక్సర్‌సైజ్ కు సిద్ధం చేసినట్లవుతుంది.
- చాలామంది ఇంట్లోనే ఉంటూ వ్యాయామాలు చేసేందుకు ప్రాధాన్యం ఇస్తుంటారు. అలాంటి వాళ్ల కార్డియో వ్యాయామాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఉత్తమం. ఆన్‌లైన్‌లో ఇందుకు సంబంధించి చాలా వీడియోలు అందుబాటులో ఉన్నాయి.
- అమెరికన్ హర్ట్ అసోసియేషన్ స్టడీ ప్రకారం.. రోజుకు 30 నిమిషాల పాటు వ్యాయామం కచ్చితంగా చేయాలి. వాకింగ్, రన్నింగ్, జిమ్.. ఏదైనా సరే.. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు శ్రమించాల్సిందేనట. వారానికి ఐదు రోజులు కచ్చితంగా వ్యాయామం చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

### ఇట్ల చేద్దాం



బియ్యంలో పురుగులు చేరకుండా ఉండా లంటే... ఎండిపోయిన కాకరకాయల్ని ఓ పల్చటి వస్త్రంలో మూటకట్టి, ఆ మూటని బియ్యం డబ్బాలో వేయాలి.

## బిల్లుల ప్రతిష్టంభనకు తెరదించాలి

(మొదటిపేజీ తరువాయి)



(ఫైల్)

గవర్నర్ పంపలేరని స్పష్టం చేసింది. అసెంబ్లీ తీర్మానించిన బిల్లులను గవర్నర్ ఉద్దేశపూర్వకంగానే ఆమోదించడం లేదంటూ తమిళనాడు ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్ధీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. తమిళనాడు ప్రభుత్వ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ "గవర్నర్ వెనక్కి పంపిన బిల్లులకు తమిళనాడు అసెంబ్లీ ఇటీవల మరోసారి ఆమోదం తెలిపింది ఆ వెంటనే గవర్నర్‌కు పంపించింది. అయితే.. గవర్నర్ వాటిని రాష్ట్రపతికి రిజర్వ్ చేశారు" అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. "బిల్లుల ప్రతిష్టంభనకు గవర్నర్ తెరదించాలని కోరుకుంటున్నాం. ఈ దిశగా ముఖ్యమంత్రితో కలిసి నడిస్తే అభినందిస్తాం. సీఎంను గవర్నర్ ఆహ్వానించి.. ఉభయలు కూర్చొని సమస్య పరిష్కారానికి చర్చలు జరుపుతారని ఆశిస్తున్నాం" అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో ఉన్నతమైన రాజ్యాంగబద్ధ వ్యవస్థల (గవర్నర్)తో వ్యవహరిస్తున్నామనే విషయం తెలుసని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ క్రమంలోనే తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తన ఆమోదాన్ని నిలుపుదల చేస్తూ రాష్ట్ర అసెంబ్లీ తిరిగి ఆమోదించి పంపిన బిల్లులను రాష్ట్రపతికి పంపడంపై అనుసరించిన విధానాన్ని కూడా ధర్మాసనం ప్రశ్నించింది. రాజ్యాంగంలోని 'ఆర్టికల్- 200'ను ప్రస్తావిస్తూ.. పున్ణపరిశీలన కోసం గవర్నర్ కార్యాలయం నుంచి తిరిగి వచ్చిన బిల్లులను శాసనసభ రెండోసారి ఆమోదించిన తరువాత గవర్నర్ వాటిని రాష్ట్రపతికి పంపలేరని స్పష్టం చేసింది.

"రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్‌కు మూడు ఎంపికలు ఉన్నాయి. ఆయన బిల్లుపై సమ్మతి తెలపవచ్చు. నిలిపివేయవచ్చు. ఆయన బిల్లును (పరిశీలన) రాష్ట్రపతికి రిజర్వ్ చేయవచ్చు. ఇవి అన్ని ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి" అని ధర్మాసనం పేర్కొంది. "ఈ సందర్భంలో, గవర్నర్ మొదట సమ్మతిని నిలుపుదల చేశారు. ఒకసారి ఆయన సమ్మతిని నిలిపివేస్తే, దానిని రాష్ట్రపతికి రిజర్వ్ చేసే ప్రశ్నే లేదు. ఆయన రాష్ట్రపతికి పంపలేరు. ఆయన మూడు ఎంపికలలో ఒకదాన్ని అనుసరించాలి. ఒకసారి ఆయన సమ్మతిని నిలుపుదల చేస్తే, నిబంధన ఆయనకు నాల్గో ఎంపికను ఇవ్వదు" అని తమిళనాడు గవర్నర్ తరఫున హాజరైన అటార్నీ జనరల్ (ఎజెఐ) ఆర్. వెంకటరమణికి సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. అనంతరం తదుపరి విచారణను డిసెంబరు 11కు వాయిదా వేసింది. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 12 బిల్లుల్లో 10 బిల్లులను గవర్నర్ ఈనెల మొదటి వారంలో వెనక్కి పంపారు. ఈ బిల్లులు 2022 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులను వెనక్కి పంపడానికి కారణాలను గవర్నర్ ప్రస్తావించలేదు. దీంతో తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ ప్రత్యేక సమావేశానికి పిలుపుచ్చారు. దీంతో అసెంబ్లీ రెండోసారి ఆ బిల్లులకు ఆమోదం తెలిపింది. 12 బిల్లులకు ఆమోదం తెలిపే ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇటీవల కేంద్రాన్ని కూడా సమాధానం కోరింది. కోర్టులను పార్టీలు ఆశ్రయించే వరకూ గవర్నర్ ఎందుకు వేచిచూడాలని కూడా అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది.

## జాతీయ వైద్య కమిషన్ లోగో మారింది

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. "ధన్వంతరి చిత్రం నలుపు, తెలుపు రంగులో ఉన్నది. ప్రింటౌట్లను తీసేటప్పుడు, అది స్పష్టంగా లేదు. ప్రస్తుతం అది రంగులో ఉన్నది. అది మాత్రమే తేడా. జాతీయ చిహ్నం ఎన్ఎంసీ లోగో కాదు" అని తెలిపారు. గతేడాది కాలంగా లోగోపై ధన్వంతరి చిత్రం ఉన్నదని కూడా ఆయన నొక్కి చెప్పారు. మార్చబడిన లోగోను మెడికల్ రెగ్యులేటర్ అధికారిక వెబ్‌సైట్‌లో కనిపిస్తుంది. కానీ నాలుగు సింహాలను కలిగి ఉన్న పాత వెర్షన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో కనిపిస్తుండటం గమనార్హం.

# 3 శాతం తగ్గిన పోలింగ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 2018తో పోలిస్తే 3 శాతం పోలింగ్ తక్కువగా జరిగిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా రీ పోలింగ్ అవకాశాలు లేవన్నారు. తుది గణాంకాల ప్రకారం రాష్ట్రం మొత్తం మీద 71.34 శాతం పోలింగ్ నమోదైందని చెప్పారు. శుక్రవారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయనీ, దానికి సంబంధించి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొత్తం 49 ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో 79 నియోజకవర్గాల్లో 75 శాతానికి పైగా పోలింగ్ జరిగిందనీ, అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 90.03 శాతం, అత్యల్పంగా హైదరాబాద్‌లో 46.56 శాతం పోలింగ్ నమోదయ్యిందని తెలిపారు. అలాగే మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 91.89 శాతం పోలింగ్ జరిగింది. అత్యల్పంగా యాఖుత్‌పురా నియోజకవర్గంలో 39.64 శాతం పోలింగ్ నమోదైంది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు పోటీచేస్తున్న గజ్వేలు, కామారెడ్డి రెండు నియోజకవవర్గాల్లో వరుసగా 84.14 శాతం, 75.58 శాతం పోలింగ్ నమోదైంది. పలుచోట్ల మధ్యాహ్నం తర్వాత పోలింగ్ ప్రక్రియ ఊపందుకున్నదనీ, కొన్ని నియోజకవర్గాల్లో రాత్రి 9.30 గంటల వరకు ఓటింగ్ జరిగిందని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం తొలిసారిగా ప్రవేశపెట్టిన హెూం ఓటింగ్ విజయవంతమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16,005 మంది వృద్ధులు, 9,459 మంది వికలాంగులు ఇంటి నుంచి ఓట్లు వేశారని చెప్పారు. ఎన్నికల విధుల్లో భాగస్వాములైన 1.80 లక్షల మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారనీ, థర్డ్ జెండర్ ఓటర్లు అధిక సంఖ్యలో ఓట్లు వేశారని చెప్పారు. పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు 27,094 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, 7,591 కేంద్రాల వెలుపల సీసీ టీవీలు ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశామన్నారు. దీనివల్ల ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగిందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు 2018లో 2,400 కేసులు నమోదయ్యాయనీ, కానీ 2023 ఎన్నికల్లో 13వేల కేసులు బుక్ చేసి, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణలో పూర్తిపారదర్శకంగా వ్యవహరించామనీ, పలువురు మంత్రులపై కూడా కేసులు నమోదు చేశామని వివరించారు.

**కౌంటింగ్ ఇలా...**

స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు సీఈఓ వికాస్‌రాజ్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 40 కంపెనీల కేంద్ర బలగాలు భద్రతా విధుల్లో ఉంటాయన్నారు. స్ట్రాంగ్ రూముల దగ్గర సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశామనీ, ఇక్కడి నుంచి నియోజకవర్గాల వారీగా ఎన్నికల ఏజెంట్ల సమక్షంలోనే కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎమ్‌లు తరలిస్తామన్నారు. కౌంటింగ్ సెంటర్లలో 1,766 లెక్కింపు టేబుళ్లు, 131 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు ఉంటాయని చెప్పారు. ఆరు నియోజకవర్గాల్లో 500కు పైగా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయనీ, అక్కడ 28 టేబుళ్లు ఉంటాయని తెలిపారు. 3వ తేదీ ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభమవుతుందనీ, హెూం ఓటింగ్ బ్యాలెట్లను కూడా పోస్టల్ బ్యాలెట్లతో కలిపే లెక్కిస్తారని వివరించారు. ఆ తర్వాత ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు మొదలవుతుందనీ, ఒక్కో ఈవీఎమ్‌లో ఓట్లను రెండుసార్లు లెక్కిస్తారని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువగా ఉంటే రెండింటి కౌంటింగ్ సమాంతరంగా జరుగుతుందని స్పష్టత ఇచ్చారు. కౌంటింగ్ జరిగే ఒక్కో టేబుల్‌పై ఎన్నికల సూక్ష్మ పరిశీలకులు, కౌంటింగ్ సూపర్ వైజర్, ఇద్దరు సహాయకులు ఉంటారని చెప్పారు. చిన్న నియోజకవర్గాల తొలి ఫలితాలు ఉదయం 10 గంటలకల్లా వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికల తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్న సొమ్మును ఆధారాలు చూపితే, తిరిగి ఇచ్చేస్తారని తెలిపారు.

# సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)

దుబాయ్‌లో జరుగుతున్న కాప్ 28 సదస్సుకు హాజరైన మోడీ అక్కడి పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. వాతావరణ మార్పులనేది సమిష్టిగా ఎదుర్కొనాల్సిన సవాలని తానెప్పుడూ చెబుతానని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఐక్య ప్రతిస్పందన ఒక్కటే దీనికి పరిష్కారమని స్పష్టం చేశారు. వాతావరణ మార్పులపై చేపట్టే కార్యాచరణ గురించి పెరుగుతున్న ఆశలను వాతావరణ నిధులపై పురోగతిలో చూడాల్సి వుందని ఆయన పేర్కొన్నారు. సమర్ధవంతమైన, సమిష్టి వాతావరణ కార్యాచరణకు ఈ సదస్సు తాజా ఊపునివ్వగలదని భారత్ ఆశాభావంతో వుందని అన్నారు. అలాగే యుఎన్ఎఫ్‌సిసిసి, పారిస్ ఒప్పందం లక్ష్యాలను మరింత ముందుకు తీసుకెళ్లడంలో అంతర్జాతీయ సహకారం కూడా పెరగగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. మరింత పచ్చదనంతో కూడిన, అలాగే సంక్షేమం సమృద్ధిగా వుండగల భవితవ్యం కోసం భారత్, యుఎఇలు భాగస్వాములుగా కృషి చేస్తాయన్నారు. వాతావరణ కార్యాచరణపై అంతర్జాతీయ కార్యకలాపాలను ప్రభావితం చేసేందుకు సంయుక్తంగా కృషి చేయడానికి కట్టుబడి వున్నామన్నారు.

భారత్-యుఇఎ సంబంధాలపై మాట్లాడుతూ, రెండు దేశాల మధ్య ఇప్పటికే మంచి పటిష్టమైన సంబంధాలు వున్నాయన్నారు. ఇంధన భద్రతను మరింత పెంచుకునేందుకు ఉమ్మడి గ్రిడ్‌ను ఏర్పాటు చేయడంలో చేతులు కలపనున్నట్లు చెప్పారు. గ్లోబల్ సోలార్ ఫెసిలిటీకి మద్దతునిస్తామని చెప్పారు.

**తదుపరి కాప్ సదస్సుకు భారత్ ఆతిథ్యం ?**

2028లో జరగబోయే కాప్ 33 వాతావరణ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తుందని ప్రధాని మోడీ శుక్రవారం ప్రతిపాదించారు. ప్రజల ప్రాతినిధ్యం ద్వారా కార్బన్ సింక్‌లను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టే గ్రీన్ క్రెడిట్ ఇనీషియేటివ్‌ను ప్రారంభించారు. అభివృద్ధికి, పర్యావరణ సంరక్షణకు మధ్య సంతులనాన్ని పాటిస్తూ భారత్, ప్రపంచ దేశాలకు గొప్ప ఉదాహరణగా నిలిచిందని చెప్పారు.

2030 జూన్ కల్లా కాలుష్యాల తీవ్రతను 45శాతం తగ్గించాలని, శిలాజయేతర ఇంధనాల వాటాను 50శాతానికి పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు వర్ధమాన, పేద దేశాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపన్న దేశాలు బదిలీ చేయాలని ఆయన కోరారు.

## ఎన్నికలు కాగానే బాదుడు...

**న్యూఢిల్లీ :** ఐదు రాష్ట్రాల ఎన్నికలు కాగానే మోడీ సర్కార్ బాదేసింది. వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ ధరను పెంచి...భారత్‌లో విమానాలకు వాడే ఏవియేషన్ టర్బైన్ ఇంధన (ఏటీఎఫ్) ధర 4.6 శాతం తగ్గించింది. ఇది ఒకే నెలలో రెండో తగ్గింపు కావటం గమనార్హం. అయితే వాణిజ్య వంట గ్యాస్ (ఎల్పీజీ) రేటు 19 కిలోల సిలిండర్‌కు 21 రూపాయలు పెరిగింది. గృహావసరాల ఎల్పీజీ ధర (14.2 కిలోల సిలిండర్‌పై)లో ఎలాంటి మార్పు లేదు. దాని ధర రూ. 903గా ఉన్నది.

చమురు సంస్థలు వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను రూ. 21 మేర పెంచాయి. దీంతో దీని ప్రభావం హెూటళ్లు, రెస్టారెంట్లు వంటి వాటిపై పడనుంది. 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ఇప్పుడు దేశ రాజధానిలో రూ. 1,796.50గా, వాణిజ్య రాజధాని ముంబయిలో రూ. 1,749గా ఉన్నది. చమురు సంస్థలు సవరించిన ధరల ప్రకారం..విమాన ఇంధనం ఏటీఎఫ్ ధర రూ. 5,189.25 (4.6 శాతం) తగ్గింది. దేశ రాజధానిలో కిలోలీటర్‌కు రూ. 1,11,344.92 నుంచి రూ. 1,06,155.67కి తగ్గింది. నవంబర్ 1న జెట్ ఇంధనం ధర దాదాపు 6 శాతం (కిలోలీటర్‌కు రూ. 6,854.25) తగ్గింది. విమానయాన సంస్థ నిర్వహణ వ్యయంలో 40 శాతంగా ఉండే జెట్ ఇంధనం ధర తగ్గింపు, ఇప్పటికే ఆర్థికంగా కష్టాల్లో కూరుకుపోయిన ఎయిర్‌లైన్స్‌పై భారాన్ని తగ్గించనున్నది.

## పురాణాలతో భవిష్యత్తు సంక్షోభం

(మొదటిపేజీ తరువాయి)

తరం జ్ఞానాన్ని కోల్పోతుందని, భవిష్యత్తు సంక్షోభంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కాలంలో ఉండే అనేక రకాల అవతారాలు ఇప్పుడెందుకు రావడం లేదన్న ప్రశ్న విద్యార్థులకు వస్తుందన్నారు. ఇంకోవైపు సమాజంలో ఉండే సవాళ్లు, సమస్యలు, హింస, ఆధిపత్యం, అసమానతల వంటి వాటికి కారణమెవరన్న ఆలోచనలు వస్తాయని చెప్పారు. మతం విశ్వాసాల ఆధారంగా గతంలోకి వెళ్తుందన్నారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తును సైన్స్ నిర్మాణం చేస్తుందని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణం, సమాజం పురోగతి ఉండేలా పాఠ్యాంశాలను అందించాల్సిన అవసరముందని అన్నారు. చరిత్ర మార్పుపై ఎన్‌సీఈఆర్టీ అవలంభిస్తున్న వైఖరిపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

## దాడులు..సోదాలు..సీజ్‌లు

(మొదటిపేజీ తరువాయి)

స్థానానికి చెందిన మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఓం ప్రకాష్ హడ్లా ఆస్తులపై కూడా సోదాలు జరిగాయి. అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ లేవనెత్తుతున్న ప్రాథమిక సమస్యలలో సర్వీస్ సెలక్షన్ ప్రవేశ పరీక్షలలో పేపర్ లీక్‌లు ఒకటి. నవంబర్‌లో దోతస్రా కుమారులు అవినాష్, అభిలాష్‌లకు కూడా ఈడీ నుంచి సమన్లు అందాయి. దాదాపు అదే సమయంలో ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కుమారుడు వైభవ్ గెహ్లాట్ కూడా ఈడీ సమన్లు అందుకున్నారు.

**ఛత్తీస్‌గఢ్‌లో...**

ఛత్తీస్‌గఢ్‌లో ఈడీ సోదాలు ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రారంభమయ్యాయి. రాయ్‌పూర్, దుర్గ్‌లలో ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్ రాజకీయ సలహాదారు, మాజీ జర్నలిస్ట్ వినోద్ వర్మ, ఇద్దరు అధికారులపై సోదాలు జరిగాయి. ఆ తర్వాత, రాయ్‌పూర్, దుర్గ్‌లలో రూ. 14.92 కోట్లు స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో నవంబర్‌లో రాష్ట్రంలో మొదటి దశ ఎన్నికలకు నాలుగు రోజుల ముందు మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో రూ. 508 కోట్ల లబ్దిదారుడిగా ముఖ్యమంత్రిని ఈడీ తన ప్రకటనలో పేర్కొన్నది. సోనీ విడుదల చేసిన వీడియో ఆధారంగా బాఘేల్‌ను నిందితుడిగా పేర్కొంటూ ఈడీ ఒక ప్రకటన విడుదల చేసింది. రాయ్‌పూర్‌లో సుమారు రూ. 5 కోట్లతో అరెస్టయిన "క్యాష్ కొరియర్" చేసిన ప్రకటనలో బఘేల్ పేరు ఆసరాగా ఉన్నదని వివరించింది. అయితే ఈ ఆరోపణలన్నీ "విచారణకు సంబంధించిన అంశం" అని ఏజెన్సీ పేర్కొనటం గమనార్హం.

**మధ్యప్రదేశ్‌లో..**

కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థి కమల్ నాథ్ మేనల్లుడు రతుల్ పూరీతో సహా కాంగ్రెస్‌తో సంబంధం ఉన్న చాలా మంది ప్రభావవంతమైన వ్యక్తులకు సంబంధించిన రూ. 354 కోట్ల బ్యాంక్ మోసం కేసులో వారిని ఈడీ ఆగస్టులో అరెస్టు చేసింది. 2019లో సీబీఐ మరో కేసులో రతుల్ పూరీ, అతని తండ్రి దీపక్ పూరి, తల్లి నీతా, పూరీకి చెందిన సీ.డీ తయారీ కంపెనీ మోజర్ బేర్ ఇండియా లిమిటెడ్, దాని ప్రమోటర్లపై రుణం విషయంలో బ్యాంకును మోసం చేశారని ఆరోపించింది. ఈడీ కూడా పూరీపై అదే కేసు అనుసరిస్తున్నట్టు తెలుస్తున్నది. మోజర్ బేర్‌పై పీఎంఎల్ఏ కేసులో బ్యాంక్ ఆఫ్ సింగపూర్ మాజీ రిలేషన్షిప్ మేనేజర్ నితిన్ భట్నాగర్‌ను కూడా ఈడీ ఈ ఏడాది ఆగస్టులో అరెస్టు చేసింది. ఎన్నికల్లో బీజేపీకి సాయం చేసేందుకు ఈడీ, ఆదాయపన్ను శాఖ (ఐటీ) పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, సహచరులపై అభియోగాలు మోపేందుకు ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

**మిజోరాంలో నో**

ఈశాన్య రాష్ట్రం మిజోరంలో మాత్రం ఈడీ ఎలాంటి దాడులూ నిర్వహించలేదు. రాష్ట్రంలో ఎన్నికల్లో అధికారంలో ఉన్న మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్), ఇతర ఏడు పార్టీల ప్రాంతీయ కూటమి అయిన జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ మధ్య పోటీ ఉన్నది. రాష్ట్రంలో బీజేపీకి ప్రస్తుతం ఒక ఎమ్మెల్యే ఉన్నారు. అయితే, ఇక్కడ బీజేపీకి రాజకీయంగా ఎలాంటి ఆశలు, అవకాశాలు లేనందునే కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈ రాష్ట్రంలోకి రాలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇక్కడ ఎన్నికల ప్రచారానికి సైతం మోడీ రాకపోవటాన్ని వారు ఉదహరిస్తున్నారు.

## తెలంగాణలో...

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్త, వ్యాపారవేత్త విజయ్ నాయర్ ద్వారా ఆప్‌కి కనీసం రూ. 100 కోట్లు లంచం ఇచ్చిన సౌత్ గ్రూప్‌లో కవిత కూడా భాగమేనని ఈడీ ఆరోపించింది. కవితతో పాటు, అనేక ఇతర బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ఈ దాడులను ఎదుర్కొన్నారు.

పోలింగ్‌కు వారం రోజుల ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జి. వివేక్ కంపెనీకి, విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మధ్య జరిగిన రూ. 8 కోట్ల లావాదేవీకి సంబంధించి ఈడీ దాడులు జరిపింది. వివేక్‌కు చెందిన పలు ప్రాంతాల్లో నవంబర్ 20న సోదాలు జరిగాయి. చెన్నూర్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న వివేక్ కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన విషయం విదితమే. ఐటీ శాఖ కూడా వివేక్ ఇంటి వద్ద సోదాలు నిర్వహించింది. గతంలో వివిధ ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపిస్తూ మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మా రెడ్డి, పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు చెందిన ఇండ్లపై ఐటీ శాఖ, ఈడీ దాడులు నిర్వహించాయి.

# అంతర్మథనం...

**ఉమ్మడి కరీంనగర్‌లో బూత్‌లవారీగా అభ్యర్థుల లెక్కలు**

**లెక్కలతో కుస్తీపడుతున్న ఆయా పార్టీల నేతలు**

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్‌లో పోటీలో ప్రధానపార్టీల అభ్యర్థులు అంతర్మథనంలో పడ్డారు. బూత్‌లవారీగా పోలైన ఓట్లలో తమకు అనుకూలంగా పడిన వాటి లెక్కలను కిందిస్థాయి శ్రేణుల నుంచి తెలుసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం నుంచే ఆ లెక్కలతో కుస్తీ పడుతున్నారు. 'మా నాయకుడిదే విజయమంటే.. లేదు.. మా నాయకునిదే గెలుపు' అంటూ కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సవాళ్లు విసురుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పోలింగ్‌శాతం చూస్తే పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా 70శాతం దాటలేదు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం 80శాతంపైనే పోలింగ్ నమోదైంది. అయితే సిరిసిల్ల, కరీంనగర్ తప్ప మిగిలిన నియోజకవర్గాల్లో గత ఎన్నికల కంటే పోలింగ్ శాతం ఎక్కువగానే నమోదైంది. కరీంనగర్ జిల్లాలో 2018 ఎన్నికల్లో 79.69శాతం నమోదైతే ఈ ఎన్నికల్లో 75.64శాతమే ఓట్లు పడ్డాయి. పెద్దపల్లి జిల్లాలో 2018 ఎన్నికల్లో 80.47శాతం పోలింగ్ నమోదైతే ఈ ఎన్నికల్లో 75.62శాతమే వేశారు. జగిత్యాల జిల్లాలో గత ఎన్నికల్లో 78.28శాతం ఓట్లు పోలైతే ఈ ఎన్నికల్లో 76.12శాతమే పోలింగ్ నమోదైంది. సిరిసిల్ల జిల్లాలో 2018 ఎన్నికల్లో 80.72శాతం ఓట్లు పడితే ఈ ఎన్నికల్లో 75.92శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. సాధారణంగా ఓట్ల శాతం పెరిగితే ప్రత్యర్థి పార్టీలకు మేలు జరుగుతుందన్న రాజకీయవిశ్లేషకులు చెబుతుంటారు. ఇప్పుడు గత ఎన్నికలతో పోల్చితే 5 నుంచి 7శాతం ఓటింగ్ తగ్గడం చూస్తుంటే అన్ని నియోజకవర్గాల్లోనూ అభ్యర్థుల మధ్య గట్టిపోటీయే ఉంటుందని అంటున్నారు. గెలుపోటములపై చర్చోపచర్చలు ప్రజల్లో సాగుతున్నాయి. పోలింగ్ ముగియగానే బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ముఖ్య అనుచరులతో సమావేశాలు ఏర్పాటు చేసి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. పోలింగ్ రోజు ప్రలోభాలకు గురిచేస్తున్నారంటూ పలువురు సి-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు 424 ఫిర్యాదులు అందగా ఇందులో పోలింగ్ రోజుకు సంబంధించినవి 30 ఉన్నాయి. ఫిర్యాదులు ఆధారంగా సంబంధిత తనిఖీ బృందాలతో విచారణ చేపట్టారు.

## కాంగ్రెస్ ధీమా.. కారులో గుంభనం

మెజార్టీ సర్వే సంస్థలు తమ ఎగ్జిట్‌పోల్స్ కాంగ్రెస్‌కు అనుకూలంగా ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో గెలుపుపై ధీమా వ్యక్తమవుతోంది. సంబురాలకు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చినా 3 వరకు వేచి ఉందామనే రీతిలో నేతలు ఉన్నారు. కరీంనగర్‌లో మాత్రం కాంగ్రెస అభ్యర్థి పురుమళ్ల శ్రీనివాస్, అతని శ్రేణులు సంబురాలు నిర్వహించారు. వేములవాడ, ధర్మపురి, చొప్పదండి నియోజకవర్గాల్లో గెలుపుపై గట్టిగానే ధీమాతో ఉన్నారు. మానకొండూర్‌లోనూ ఉంది. గత ఎన్నికల్లో కూడా ఎగ్జిట్‌పోల్స్ కాంగ్రెస్‌వైపే ఉన్నా. ఫలితాలు మాత్రం బీఆర్ఎస్‌కే వచ్చాయి. దీంతో ఆ సర్వే సంస్థల రిపోర్టుపై బీఆర్ఎస్ శ్రేణులు అపనమ్మకంగానే ఉన్నారు. స్వల్ప మెజార్టీతో అయినా తమ పార్టీ అభ్యర్థి గెలుపును అందుకుంటాడన్న చర్చలతో గులాబీ శ్రేణులు గుంభనంగా ఉన్నాయి.

# అహంకారానికి తగిన గుణపాఠం

**బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారు..కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీ**

- నాగార్జునసాగర్ రూపంలో సెంటిమెంట్‌కు జగన్ కుట్ర: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేసీఆర్ అహంకారం, అవినీతికి తెలంగాణ ప్రజలు తగిన గుణ పాఠం చెప్పారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. శుక్రవాం హైదరాబాద్‌లోని ముగ్దుం భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎగ్జిట్ పోల్ సర్వేలతో పాటు క్షేత్ర స్థాయిలో తమకున్న సమాచారం ప్రకారం కాంగ్రెస్ పూర్తి మెజార్టీ సాధిస్తుందని అంచనా వేశారు. పదేండ్ల టీఆర్ఎస్ పాలనలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని అన్నారు. వందల ఎకరాలున్న భూస్వాములకు రైతుబంధు కొమ్ము కాస్తె, దళిత బంధులో మితిమీరిన అవినీతి, ధరణిలో భూదందాలు, ఉద్యోగాల భర్తీలో అవకతవకలు, వెరసి బీఆర్ఆస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టాయని తెలిపారు. తెలంగాణ ప్రజలు అవినీతినైనా సహిస్తారు కాని అహంకారాన్ని, నిరంకుశత్వాన్ని సహించరని అన్నారు పదేండ్ల టీఆర్ఎస్ పాలనలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని అన్నారు. వందల ఎకరాల భూములున్న భూస్వాములకు రైతుబంధు పేరిట కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్మును దానం చేయడం, దళిత బంధులో మితిమీరిన అవినీతి, ధరణిలో భూదందాలు, ఉద్యోగాల భర్తీలో అవకతవకలు, వెరసి బీఆర్ఆస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టాయని తెలిపారు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనేది కాంగ్రెస్ పార్టీ అంతర్గతవ్యవహారమని, ఎక్కువ పోటీ ఉంటేనే ప్రజాస్వామ్యం మనుగడలో ఉంటుందని అన్నారు. హైదరాబాద్‌లో పోలింగ్ తక్కువగా నమోదు కావడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. చంద్రబాబు హయం నుంచి కూడా నగర వాసులు ఓటింగ్ పట్ల విముఖతను ప్రాదర్శిస్తున్నారని ఉన్నారని గుర్తు చేశారు. చదువుకున్న నగర ఓటర్ల కంటె గ్రామీణ ప్రాంత ఓటర్లలోనే రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉందని తెలిపారు. ఎన్నికల చివరి క్షణంలో నాగార్జున సాగర్ రూపంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సెంటిమెంట్ రగిల్చే కుట్ర చేసినప్పటికి తెలంగాణ ప్రజలు ఆ ఉచ్చులో పడలేదని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపు పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ పట్టణాలకంటే గ్రామీణ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారనీ, ఓటింగ్ సరళిని బట్టి ఈ విషయం అర్థమవుతుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్ ప్లాన్‌లను తీసేసి అనవసరమైన పథకాలను ప్రవేశ పెట్టారని విమర్శించారు. ఇప్పటికైనా కేసీఆర్ తన నిరంకుశత్వ, అహంకార ధోరణిని మార్చుకోవాలని సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు బాల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటెయ్యని నగరవాసులు

నవతెలంగాణ- హైదరాబాద్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఓటెయ్యడానికి ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేరు. కొందరు డబ్బులు ఇవ్వలేదని, ఇంకొందరు ఏ ప్రభుత్వం వస్తే ఏం చేస్తారనే నిర్లక్ష్య ధోరణితో ఇంటికే పరిమితమ య్యారు. ఓటు వేసేందుకు గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంట్ వాసులు కూడా అంతగా ఆసక్తి చూపలేదు. నగరంలో 46.56 శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. కొందరికి ఓట్లు రెండు చోట్ల ఉండటం, ఇంకొందరు ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశ విదేశాల్లో ఉండటంతో ఓటింగ్ శాతం తగ్గుముఖం పట్టిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పక్కాగా ఓటరు వెరిఫికేషన్ చేస్తే తప్పా ఓటింగ్ శాతాన్ని పెంచలేమని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ప్రభుత్వ, కార్పొరేట్ కంపెనీలు సెలవులు ప్రకటిస్తే చాలామంది ఓటు వేయకుండా ఇండ్లకే పరిమితమయ్యారు.

## 3న ప్రజాసంక్షేమ ప్రభుత్వం

- తనపై మతం రంగు పూలమాలనుకున్నారు : నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

డిసెంబర్ 3న ప్రజా సంక్షేమ ప్రభుత్వం ఏర్పడబోతోందని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ అర్బన్ అభ్యర్థి షబ్బీర్ అలీ తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమది సెక్యులర్ పార్టీ అని అన్నారు. దొర అరాచక, నియంత పాలనపై తెలంగాణ ప్రజలు విసుగు చెందారని, స్పష్టంగా ప్రజలు మార్పు కోరారని తెలిపారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన వారికి, సహకరించిన వారందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కే ప్రజలు ఈసారి పట్టం కట్టబోతున్నారన్నారు. రాష్ట్రంలో ఎగ్జిట్ పోల్స్ అన్నీ కాంగ్రెస్‌కు మెజారిటీ వస్తుందని చెబుతున్నాయని, 25 సీట్ల కంటే ఎక్కువ బీఆర్ఎస్‌కు రావని తెలిపారు. ఇదే విషయాన్ని జాతీయ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి కూడా చెప్పారన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉందన్నారు. దీపం ఆరిపోయే ముందు వెలిగినట్టు ఎగ్జిట్ పోల్స్ ఫేక్ అని కేటీఆర్ అంటున్నారని, కేసీఆర్ నిన్న మీడియా ముందుకు రాకుండా ఓటమిని అంగీకరించారని చెప్పారు. నిజామాబాద్ అర్బన్‌లో కమిషన్ల ఎమ్మెల్యేపై కాంగ్రెస్‌కు



కనీవినీ ఎరుగని రీతిలో మెజారిటీ వస్తుందన్నారు. భారీ మెజార్టీతో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని తెలిపారు. తనపై మతం రంగు రుద్ది ప్రజలను రెచ్చగొట్టి రాజకీయం చేద్దామనుకున్నారని, కానీ నిజామాబాద్ ప్రజలు కులమతాలకు అతీతంగా మనస్ఫూర్తిగా తతను ఆదరించారని తెలిపారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారవేత్తలను ఇబ్బంది పెట్టినట్టు నిరూపిస్తే.. రాజకీయాల నుంచి తప్పుకుంటా

- ప్రజలకు పని మనిషి లాగా పనిచేస్తా : నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం



నవ తెలంగాణ- నకిరేకల్

తాను ఎమ్మెల్యేగా (2014) ఉన్న కాలంలో ఏ వ్యాపార వేత్తనైనా ఇబ్బంది పెట్టినట్టు నిరూపిస్తే.. రాజకీయాల నుంచి తప్పుకుంటానని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం ప్రత్యర్థులకు సవాల్ విసిరారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని పన్నాల గూడెం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఉద్యోగులను కూడా ప్రశాంతంగా ఓటు వేయనీయలేదని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి తన నోటికొచ్చిన విధంగా మాట్లాడారన్నారు. ఎవరైనా ఎన్నికల్లో తాను చేసిన అభివృద్ధి, పార్టీ మేనిఫెస్టోను వివరించుకుంటూ ప్రచారం నిర్వహిస్తారని, కానీ బీఆర్ఎస్ అభ్యర్థి తనను తిట్టడమే ఎజెండాగా పెట్టుకున్నారని తెలిపారు. నియోజకవర్గంలో గంజాయి సృష్టించింది.. బీఆర్ఎస్ అభ్యర్థి కుటుంబమేనని తెలిపారు. బొందల గడ్డను ధ్వంసం చేసిన చరిత్ర అతనిదేనని విమర్శించారు. సత్యానికి, అసత్యానికి అరాచకానికి, సహనానికి మధ్య జరిగిన ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రెండు నెలలపాటు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు నమస్కారాలు తెలియజేశారు. నియోజకవర్గంలో బలమైన శక్తిగా కాంగ్రెస్ పార్టీ ఎదిగేలా ప్రతి ఒక్కరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానని తెలిపారు. మీకోసం, ప్రజల కోసం ఒక పనిమనిషి లాగా పని చేస్తానన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 సీట్లు గెలవబోతున్నామని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని చెప్పారు. ఈ నెల 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్టు చెప్పారు. రానున్న ఐదేండ్లలో నకరేకల్ నియోజకవర్గాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పూజర్ల శంభయ్య, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్, నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్ రావు, చిట్యాల మున్సిపాలిటీ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకట్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి నకిరేకంటి ఏసు పాదం, నాయకులు యాస కరుణాకర్ రెడ్డి, లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఖమ్మంలో తగ్గిన పోలింగ్

- పాలేరులో అత్యధికంగా 90.91 శాతం
- అతి తక్కువగా కొత్తగూడెం 76.42 శాతం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 82 శాతం పోలింగ్ నమోదైంది. 2018 సంవత్సరం నాటి ఎన్నికలతో పోల్చితే ఈసారి 9.3 శాతం పోలింగ్ తగ్గింది. నాడు ఉమ్మడి జిల్లాలో 91.6 శాతం ఓటింగ్ నమోదైతే ఇప్పుడు 82.3 శాతం మాత్రమే నమోదైంది. పాలేరులో 90.91 శాతం పోలింగ్ నమోదయింది. కొత్తగూడెం నియోజకవర్గంలో 76.42 శాతం పోలింగ్ నమోదయింది. భద్రాచలం నియోజకవర్గంలో 1,48,61 మంది ఓటర్లు ఉండగా 1,17,447 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 79 శాతం పోలింగ్ నమోదయింది. ఆయా నియోజకవర్గాల నుండి ఓట్ల లెక్కింపునకు ఈవీఎంలు తరలించగా, జాగ్రత్తగా వాటిని సరిచూసుకుని స్ట్రాంగ్ రూంలలోకి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా క్రమపద్ధతిలో అమర్చామని అధికారులు తెలిపారు.

# భారీగా తగ్గిన ఓటింగ్

- పోలింగ్ పెంచడంలో.. అధికారుల వైఫల్యం
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

నవతెలంగాణ - వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత ఎన్నికల కంటే పోలింగ్ శాతం గణనీయంగా తగ్గింది. దాంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. పోలింగ్ సరళిపై పార్టీ శ్రేణులతో అభ్యర్థులు కసరత్తు చేశారు. గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికల సంఘం ఆదేశాలతో 10 శాతం పోలింగ్‌ను అదనంగా పెంచేందుకు తగిన చర్యలు తీసుకున్నామని అధికారులు చెప్పినా, ఇందులో ఘోరంగా విఫలమయ్యారు. గత ఎన్నికల కంటే 'పశ్చిమ'లో 2.62 శాతం పోలింగ్ తగ్గడం గమనార్హం. వరంగల్ తూర్పులో గణనీయంగా 6.71 శాతం, పరకాలలో 4.9, వర్ధన్నపేటలో 3.69, మహబూబాబాద్‌లో 2.72 శాతం పోలింగ్ తగ్గింది.

**అత్యధికంగా నర్సంపేటలో అత్యల్పం వరంగల్ పశ్చిమలో..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక పోలింగ్ నర్సంపేట నియోజకవర్గంలో 87.87 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 56.59 శాతం



నమోదైంది. 2018 ఎన్నికల్లో నర్సంపేటలో అత్యధికంగా 90.05 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి 2.18 శాతం తగ్గింది. డోర్నకల్‌లో గతంలో 88.96 శాతం పోలింగ్ జరగ్గా, ఈసారి 87.73 శాతం నమోదై 1.23 శాతం తగ్గింది. పాలకుర్తిలో గత ఎన్నికల్లో 89.01 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 86.68 శాతం నమోదైంది. 2.33 పోలింగ్ తగ్గడం చర్చకు దారితీసింది. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 2018 ఎన్నికలతో పోలిస్తే 6.71 శాతం పోలింగ్ తగ్గడం చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో 73.45 శాతం నమోదు కాగా, ఈ ఎన్నికల్లో కేవలం 66.74 శాతం మాత్రమే నమోదైంది. కాగా, ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు గెలుపుపై ఎవరి ధీమా వారే వ్యక్తం చేస్తున్నారు. పలువురు అభ్యర్థులు సామాజిక మాధ్యమాల్లో ఓటర్లకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రేవంత్‌కు శుభాకాంక్షల వెల్లువ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నవంబర్ 30న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న వార్తల నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డికి పలువురు నేతలు, పార్టీ అభ్యర్థులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్‌కు అనుకూలంగా రావడంతో రేవంత్‌ను వచ్చి కలుస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితులు, ఓటింగ్ తక్కువగా ఉన్న నియోజకవర్గాలపై చర్చించారు. పోలింగ్ సరళి, ప్రజల స్పందన తదితర అంశాలపై ఆరా తీశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పహారా ఉండాలని రేవంత్ వారికి సూచించినట్టు తెలిసింది. పార్టీ నేతలు మల్లు రవి, జి. చిన్నారెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, అభ్యర్థులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బండి రమేష్, మల్‌రెడ్డి రంగారెడ్డితోపాటు ఆయా జిల్లాలకు చెందిన నాయకులు కూడా రేవంత్‌ను కలుస్తున్నారు.

## ఆ రెండు నియోజకవర్గాల్లో రీపోలింగ్ చేపట్టండి

- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు నిరంజన్ లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

చాంద్రాయణగుట్ట, చార్మినార్ నియోజకవర్గాల్లో రీపోలింగ్ నిర్వహించాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ కోరారు. గురువారం ఈమేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు ఆయన లేఖ రాశారు.ఎంఐఎం బోగస్ ఓటింగ్, రిగ్గింగ్‌కు పాల్పడిందని పేర్కొన్నారు. కెమెరాల పరిశీలన పూర్తయ్యే వరకు చాంద్రాయణగుట్ట, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపును పక్కన పెట్టి రీపోలింగ్ నిర్వహించాలని కోరారు.

# ఎవరికి ఎన్ని ఓట్లు..?

## పోలింగ్ సరళిపై అభ్యర్థులు,జనాల్లో చర్చలు

- ఉమ్మడి ఆదిలాబాద్‌లో చాలాచోట్ల టఫ్ ఫైట్
- విజయావకాశాలపై అభ్యర్థుల లెక్కలు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల సమరంలో ఫలితాలు వెలువడటమే మిగిలింది. పోలింగ్ ముగిసిన నాటి నుంచి చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఏ పార్టీ విజయం సాధిస్తుంది.. ఏ అభ్యర్థికి ఎంత మెజార్టీ వస్తుంది.. ఏయే గ్రామాల్లో తమ పార్టీలకు అధికంగా ఓట్లుపడ్డాయి.. వేటిలో తక్కువగా ఉండే అవకాశం ఉంది తదితర అంశాలపై ఇప్పటికే విశ్లేషణలు సాగుతున్నాయి. మరోపక్క ఇప్పటికే వచ్చిన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలపైనా తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఇందులో ఏది సరైనదో.. ఏది కాదో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ముఖ్యంగా వివిధ పార్టీల మధ్య రాష్ట్రంలో చాలాచోట్ల టఫ్‌ఫైట్ నడిచిందని వార్తలు రావడంతో ఇందులో విజేతలెవరో.. పరాజితులెవరో తెలియని పరిస్థితి ఉంది. ఫలితాలు వచ్చే వరకు అభ్యర్థులు, పార్టీల ముఖ్య నాయకుల్లోనూ ఆందోళన కనిపిస్తోంది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా వీటి పరిధిలో 148మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఒక్కో నియోజకవర్గంలో ఐదు నుంచి పదిహేను మంది వరకు పోటీ పడ్డారు. పోలింగ్ సరళితో పాటు స్థానికుల నుంచి వినిపించిన మాటల ప్రకారం మూడు ప్రధాన పార్టీల మధ్యనే హోరాహోరీ పోరు సాగిందని తెలుస్తోంది. ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొనగా.. ఇక్కడ కాంగ్రెస్ సైతం గట్టిపోటీ ఇస్తుందని చెబుతున్నారు. బోథ్‌లోనూ బీఆర్ఎస్, బీజేపీకి మధ్య పోటీ ఉంటుందని.. కాంగ్రెస్ ప్రభావం కూడా బాగానే ఉంటుందని తెలుస్తోంది. ఖానాపూర్‌లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మధ్య వార్ ఉంటుందని, నిర్మల్‌లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని సమాచారం. ముథోల్‌లో బీఆర్ఎస్, బీజేపీ తీవ్ర పోటీ ఉంటుందని.. ఇక్కడ కాంగ్రెస్ సైతం గణనీయమైన సంఖ్యలో ఓట్లు సాధిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య తీవ్ర పోటీ ఉంటుందని, ఇక్కడ బీజేపీ బాగానే ఓట్లు సాధిస్తుందని తెలుస్తోంది. సిర్పూర్‌లో బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ మధ్య త్రిముఖ పోటీ ఉంటుందని.. ఇక్కడ కాంగ్రెస్ ప్రభావం బాగానే ఉంటుందని చెబుతున్నారు. మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే తీవ్ర పోటీ ఉంటుందన్నారు.

## బోథ్‌లో అత్యధికం.. మంచిర్యాలలో అత్యల్పం..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓటింగ్ ప్రక్రియ ముగియడంతో ఆయా చోట్ల పోలింగ్ శాతాన్ని అధికారులు లెక్కించారు. గతేడాది కంటే పోలింగ్ స్వల్పంగా తగ్గింది. ఖానాపూర్‌లో తప్ప మిగతా ఏ నియోజకవర్గంలో చూసినా పోలింగ్ తగ్గింది. బోథ్ నియోజకవర్గంలో అత్యధికంగా 82.93పోలింగ్ శాతం నమోదు కాగా.. అన్నింటి కంటే తక్కువగా మంచిర్యాలలో 69.06శాతం నమోదు కావడం గమనార్హం. ఈ ఏడాది ఏకంగా పది నియోజకవర్గాల్లోనూ పోలింగ్ శాతం తగ్గిపోవడం గమనార్హం. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం కల్పించింది. కానీ బయటి ప్రాంతాల్లో ఉండేవారిలో చాలా మంది ఓటేసేందుకు సొంత ఊరికి, ప్రాంతానికి రాలేకపోయారని తెలుస్తోంది. దీంతో పోలింగ్ శాతం తగ్గినట్టు చెబుతున్నారు.


Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886